Dwaraka
ఈనాడు

విజయవాడ 17-1-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 157

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



Dwaraka

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 17-1-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 157

రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



పల్లెల్లో నవశకం

- జన్మభూమితో గ్రామీణాభివృద్ధి
- వ్యవసాయ, పర్యాటకానికి ఊతం
- ప్రతి సంక్రాంతికి తరలి రండి..
- అనిర్వచనీయ అనుభూతులను సొంతం చేసుకోండి
- నారావారిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు
- కుటుంబ సభ్యులతో కలిసి పండగ సందడి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి

ఈనాడు - తిరుపతి

సంక్రాంతి పండక్కి ప్రతివారూ సొంత ఊళ్లకు వచ్చేలా ఒక నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దీనివల్లే నగరాల్లో ఉండే ప్రతి ఒక్కరూ గ్రామీణ ప్రాంతాలకు తరలివస్తున్నారని చెప్పారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో నాలుగు రోజుల పాటు నారావారిపల్లెలో పండుగ వేడుకల్లో పాల్గొన్న ఆయన మంగళవారం మధ్యాహ్నం రాజధాని అమరావతికి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. 15ఏళ్ల కిందట సంక్రాంతికి సొంతూరికి వెళ్లాల్సిందేనని తన సతీమణి పట్టుబట్టారని, తొలి రోజుల్లో ఇబ్బందిగా ఉండేదని, ఇప్పుడు అలవాటైందని తెలిపారు. ప్రతి ఒక్కరూ జన్మభూమి రుణం తీర్చుకోవాలని సూచించారు. 'ఉపాధి కోసం అమెరికా, ఆస్ట్రేలియా, బెంగళూరు వెళ్తున్నారు. సంక్రాంతి సమయంలో ప్రతి ఒక్కరూ గ్రామాలకు రావాలి. అందరూ గ్రామాలకు రావడంవల్ల నేడు నగరాలన్నీ ఖాళీ అయ్యాయి. గ్రామాలకు ఇలా రావడం వల్ల ఇక్కడ మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయి. నగరాల్లో ఉండే మౌలిక వసతులు గ్రామాల్లోనూ ఉండాలన్నదే నా ఆలోచన' అని పేర్కొన్నారు. 24 గంటలూ పని ఒత్తిడిలో ఉండేవారు గ్రామాలకు రావడంవల్ల ఒక కొత్త అనుభూతిని పొందుతారని, ఆనందంగా ఉండగలుగుతారని వివరించారు. గ్రామాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని అనుకుంటున్నామని, వ్యవసాయం, గ్రామీణ పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ మొత్తానికి కారణమైన తన భార్యకు ధన్యవాదాలు చెబుతున్నానని, భావి తరాలకు చెప్పడానికి వీలుగా పిల్లలను గ్రామ దేవతలకు మొక్కిస్తున్నామని, దీనివల్ల వారికీ ఓ నమ్మకం ఏర్పడుతుందని వివరించారు.

గ్రామాల్లో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోనూ సీసీ రహదారుల నిర్మాణం చేపట్టామని, దీనివల్ల కొన్ని సమస్యలూ ఎదురవుతున్నాయని, కొన్ని మట్టి, మెటల్ రహదారులు ఉంటే బాగుంటుందని, లేకుంటే మోకాళ్ల సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో ఎక్కువ ఆహారం తినడంవల్ల ప్రజలకు చక్కెర వ్యాధి వచ్చిందని, ఇప్పుడు సీసీ రహదారుల మీద నడవటంవల్ల మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని, అవి పోవాలంటే కొంత మట్టి రహదారి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఆర్ఎఫ్ఐడీ ద్వారా ప్రతి ఇంటికీ నెంబరు ఇచ్చి చెత్తను (మిగతా 2లో)

20న దావోస్‌కు చంద్రబాబు

ఈనాడు అమరావతి: ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ వెళ్లనున్నారు. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా సాగే ముఖ్యమంత్రి పర్యటన 20వ తేదీన మొదలవుతుంది. ఆ రోజున రాష్ట్రం నుంచి ఆయన నేతృత్వంలో మంత్రులు, అధికారులతో కూడిన బృందం దావోస్ పర్యటనకు వెళ్తుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం గురించి తెలియజేసే ప్రచార చిత్రంతో ముస్తాబైన వాహనం దావోస్ వీధుల్లో తిరుగుతోంది. అలాగే సదస్సు నిర్వహించే ప్రాంగణంలో రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి మండలి (ఈడీబీ) ఆధ్వర్యంలో ప్రత్యేకంగా లాంజ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

దిల్లీకి సీఎం: బుధవారం చంద్రబాబు దిల్లీ వెళ్లనున్నారు. ఫిబ్రవరిలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారు.

వెలిగొండ నీటి వెలుగులెప్పుడో?

- ప్రాజెక్టు కీలక పనుల్లో జాప్యం
- సొరంగం తవ్వకాల్లోనే ఆలస్యం
- రిజర్వాయరు పూర్తయినా నీరందించలేని పరిస్థితి
- 'ఈనాడు' క్షేత్ర స్థాయి కథనం...

6లో


వెలిగొండ ప్రాజెక్టులో అసంపూర్తిగా సొరంగం తవ్వకం పనులు

ముఖ గుర్తింపుతో ఆధార్

జులై 1 నుంచి అందుబాటులోకి

దిల్లీ: అరిగిపోయిన వేలిముద్రల వల్ల 'ఆధార్'లో పొందుపర్చిన వివరాలతో బయోమెట్రిక్ జత కలవక ఇబ్బందిపడుతున్న వారి కష్టాలు త్వరలోనే తొలగిపోనున్నాయి. ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) సదుపాయాన్నీ... విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(ఉడాయ్) అందుబాటులోకి తీసుకురానుంది. వయసురీత్యా, కష్టమైన పనులు చేయటం వల్ల కొందరికి వేలిముద్రలు అరిగిపోతుంటాయి. అటువంటి (మిగతా 2లో)



హజ్ రాయితీ ఇక ఉండదు

- ఈ ఏడాది నుంచి అమలు
- మైనార్టీల గౌరవాన్ని కాపాడాలనే నిర్ణయం
- అభివృద్ధి కార్యక్రమాలపై ఖర్చు చేస్తాం
- కేంద్ర మంత్రి నఖ్వీ వెల్లడి

దిల్లీ

ఈ ఏడాది నుంచి హజ్ యాత్రలో భాగంగా మక్కాకు వెళ్లేవారికి రాయితీ ఉండబోదు. మైనార్టీల గౌరవాన్ని కాపాడుతూ వారిని సాధికారులను చేసే విధానంలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. రాయితీలతో ముస్లింలకు ప్రయోజనం చేకూరట్లేదని ఇదే మొత్తాన్ని మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామని తెలిపారు. 2012లో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నఖ్వీ తెలిపారు. భారత్ నుంచి ఓడల ద్వారా వచ్చే హజ్ యాత్రికులను అనుమతించేందుకు సౌదీ అరేబియా ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని నఖ్వీ అన్నారు. దీనిపై విధానాలకు ఇరు దేశాల అధికారులు త్వరలోనే తుదిరూపును ఇస్తారని పేర్కొన్నారు. దీంతో కొన్ని మార్గాల్లో యాత్ర ఖర్చులు 70% మేర తగ్గుతాయని తెలిపారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో దేశంలోని 1.75 లక్షల మంది ముస్లింలు హజ్ యాత్రలో (మిగతా 2లో)



మైటెక్ సిటీగా మంగళగిరి

- నేడు 16 ఐటీ కంపెనీలను ప్రారంభించనున్న మంత్రి లోకేష్
- ఎన్ఆర్‌టీ టెక్ పార్కులో 13
- మంగళగిరి ఆటోనగర్ ఐటీ పార్కులో 3
- తక్షణం 600 మందికి ఉపాధి
- ఏడాదిలో మరో 1600 మందికి

2లో



నలుగురు న్యాయమూర్తులతో

సీజేఐ భేటీ!

- సుప్రీం కోర్టులో సంక్షోభ పరిష్కారానికి చర్చలు
- పాల్గొన్న ఇతర జడ్జీలు
- నేడూ సమావేశం కానున్న ప్రధాన న్యాయమూర్తి
- వివాదం ఇంకా పరిష్కారం కాలేదు: అటార్నీ జనరల్

దిల్లీ

సుప్రీం కోర్టులో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించుకునేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర చర్చలు మొదలుపెట్టారు. తనకు వ్యతిరేకంగా పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించిన నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతో ఆయన మంగళవారం దాదాపు 15 నిమిషాల పాటు మాట్లాడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 12న పాత్రికేయ సమావేశంలో వారు లేవనెత్తిన అన్ని అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. సున్నితమైన, ముఖ్యమైన ప్రజాహిత వ్యాజ్యాలను ధర్మాసనాలకు కేటాయిస్తున్న తీరు కూడా ఇందులో ఉంది. మరోవైపు వైద్య కళాశాలల లంచాల కుంభకోణం కేసులో హైకోర్టులోని ఒక ప్రస్తుత న్యాయమూర్తిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయకుండా సీబీఐని జస్టిస్ దీపక్ మిశ్ర అడ్డుకున్నారంటూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఒక ఫిర్యాదు దాఖలు చేశారు. వివాదం బహిర్గతమయ్యాక ఇరు పక్షాల మధ్య జరిగిన తొలి ముఖాముఖీ భేటీ.. సుప్రీం కోర్టు ప్రాంగణంలోని లాంజ్‌లో జరిగింది. సాధారణంగా ఉదయం 10.30 గంటల సమయంలో తమ తమ కోర్టు హాళ్లలోకి వెళ్లడానికి ముందు న్యాయమూర్తులు ఇక్కడ తేనీరు సేవిస్తూ ఇష్టాగోష్ఠిగా ముచ్చటించుకుంటారు. మంగళవారం నాటి సమావేశంలో ఇతర న్యాయమూర్తులూ ఉన్నారు. సున్నితమైన ప్రజాహిత వ్యాజ్యాలను విచారిస్తున్నారంటూ కొందరు న్యాయవాదులకు లక్ష్యంగా మారిన ఒక జడ్జీ కూడా ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది. నలుగురు న్యాయమూర్తుల పాత్రికేయ సమావేశం తర్వాత ఈ అంశంపై మీడియాలో వస్తున్న వార్తలపై జడ్జీలు ఈ భేటీలో ఆందోళన వ్యక్తంచేసినట్లు సమాచారం. సంక్షోభ పరిష్కారానికి కృషి జరుగుతున్న సమయంలో ఈ అంశంపై జాగ్రత్తగా వార్తలు రాయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ భేటీ తర్వాత సీజేఐ, నలుగురు న్యాయమూర్తులు తమ రోజువారీ విధులను కొనసాగించారు. విభేదాలు (మిగతా 2లో)


ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర

వేతన జీవులకు ఊరట!

- 80సీ కింద పెరగనున్న ఆదాయపన్ను మినహాయింపు పరిమితి
- బడ్జెట్‌లో రూ.1.5 లక్షల నుంచి 2 లక్షలకు పెంచనున్న కేంద్రం

ఈనాడు, దిల్లీ: వేతన జీవులకు చేతికందే డబ్బుల్ని పెంచే దిశగా ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదాయ పన్ను చట్టం-1961లోని సెక్షన్ 80సీ కింద ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచనున్నట్లు భావిస్తున్నారు. అయితే, ఇది 80సీలోని ఒకట్రెండు పన్ను ఆదా అంశాలకే పరిమితమయ్యే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. సెక్షన్ 80సీ పరిమితిని రూ.2 లక్షలకు పెంచితే అదనంగా ఆదా అయ్యే మొత్తం రూ.2,575 (10%), రూ.10,300 (20%), రూ.15,450(30%)గా ఉండనుంది.

- ప్రస్తుతం సెక్షన్ 80సీ కింద జీవితబీమా, ఈక్విటీ అనుసంధాన పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్), ఐదేళ్ల తపాలా టైమ్ డిపాజిట్లు, వయోవృద్ధుల (మిగతా 2లో)



హైకోర్టు జడ్జిపై సీబీఐ దర్యాప్తును అడ్డుకున్నారు

- సుప్రీం ప్రధాన న్యాయమూర్తిపై సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఫిర్యాదు

2లో

ఇదీ సంగతి!









నారావారిపల్లిలో తల్లిదండ్రుల సమాధుల వద్ద నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో సీఎం కుటుంబ సభ్యులు, బాలకృష్ణ తదితరులు ★ రూ.57కోట్లతో నిర్మించనున్న పుదిపట్ల-రంగంపేట రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, పక్కనే మంత్రులు కామినేని, లోకేష్, ఎంపీ శివప్రసాద్ తదితరులు

మైటెక్ సిటీగా మంగళగిరి

మంగళగిరి - న్యూస్‌టుడే

అమరావతి రాజధాని ప్రాంతమైన మంగళగిరిని మైటెక్ సిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణ కార్యరూపం దాలుస్తోంది. ఈ క్రమంలో మంగళగిరి ఎన్ఆర్‌టీ టెక్ పార్కు(13), ఆటోనగర్ ఐటీ పార్కు(3)ల్లో 16ఐటీ కంపెనీలను ఐటీ మంత్రి లోకేష్ బుధవారం ప్రారంభిస్తున్నారు. వీటి ఏర్పాటుతో తక్షణం 600 మందికి ఉపాధి లభిస్తుంది. ఏడాదిలో మరో 1600 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. సాంకేతిక విద్య చదివిన రాష్ట్ర యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాజధాని అమరావతిలోనే అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. మంగళగిరి ఆటోనగర్ ఐటీ పార్కులో ఇప్పటికే మూడు ఐటీ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో 500 మంది పని చేస్తున్నారు.

ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక పోలీసు పెట్రోలింగ్

ఐటీ ఉద్యోగులకు రవాణా సదుపాయం కోసం ఏపీఎస్ ఆర్‌టీసీతో ప్రభుత్వం సంప్రదించి ఐటీ పార్కు వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేసింది. దీంతో ఆటోనగర్ ఐటీ పార్కు వరకు విజయవాడ నుంచి బస్సులు నడుపుతున్నారు. అదేవిధంగా ఉద్యోగుల రక్షణ కోసం ప్రత్యేకంగా పోలీసు పెట్రోలింగ్ వాహనం నిరంతరం గస్తీ తిరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యోగులు, ఐటీ సంస్థల్లో శిక్షణకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే వారికి హాస్టల్ వసతి కోసం అపార్టుమెంట్లలో ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

పరిశోధన అభివృద్ధికి వేద ఐఐటీ

తాజాగా ఐటీలో పరిశోధన అభివృద్ధికి మరో భారీ సంస్థను రాజధానిలో ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు విద్యానగర్‌లో ఈ సంస్థ ఏర్పాటు కాబోతోంది. వేద ఐఐటీగా దీన్ని పిలుస్తారు. ఇక్కడ వీఎల్ఎస్ఐ, చిప్ డిజైనింగ్ వంటి పరిశోధనలు జరుగుతాయి.

కామర్స్ పట్టభద్రుల కోసం

రాజధానిలో వస్తున్న ఐటీ సంస్థలతో పాటు ఐటీకి అనుబంధంగా స్టేట్ సాఫ్ట్ ఫైనాన్స్ కామర్స్ కంపెనీని ఏర్పాటు చేస్తున్నారు. గన్నవరంలోని మేధా టవర్స్‌లో దీన్ని నెలకొల్పుతున్నారు. కామర్స్ పట్టభద్రులను ఎంపిక చేసి వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఇప్పటికే ఈ సంస్థ కోసం 250 మందికి శిక్షణ ఇస్తున్నారు.

విద్యార్థులకు కార్యశాల

ఐటీ సంస్థల ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్ఆర్‌టీ మంగళగిరిలో ఒక వర్క్‌షాపును నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని 1500 నుంచి 2వేల మంది విద్యార్థులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. ఐటీ అభివృద్ధి, శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఐటీ రిసెర్చ్, వెంచర్ క్యాపిటల్ వంటి అంశాలపై మంత్రి లోకేష్ విద్యార్థులకు వివరిస్తారని ఏపీ ఎన్ఆర్‌టీ సీఈవో రవి వేమూరి తెలిపారు. హైదరాబాద్‌లో ఐటీ ప్రాంతం హైటెక్ సిటీగా పేరుగాంచిన విధంగా మంగళగిరిలో ఐటీ ప్రాంతం మైటెక్ సిటీగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

(ఐటీ పార్కులో వచ్చే కంపెనీల వివరాలు ఈనాడు.నెట్‌లో..)

పల్లెల్లో నవశకం

(మొదటి పేజీ తరువాయి)

సేకరించి.. చెత్త సేకరణ జరుగుతుందా లేదా అనేది ఆన్‌లైన్‌లో పరిశీలిస్తామని తెలిపారు. జీఐఎస్, జీపీఎస్ కింద ప్రతి ఇంటినీ మ్యాపింగ్ చేస్తామని, వీటిని ప్రజాసాధికార సర్వేకు అనుసంధానం చేసి.. ఇళ్లు లేని వారిని గుర్తించి భూ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇంటింటికీ రెండు పశువులను సబ్సిడీ ద్వారా అందించి తద్వారా పాలను సేకరించి వారికి ఆదాయం సమకూరేలా చేస్తామని తెలిపారు.

- ప్రతి ఒక్కరూ ఏదో ఒక పని చేయాలని, పనిలేకుంటే ఆనందంగా ఉండలేరని, ఉదయం నిద్ర లేచి ఆరేడు గంటలు పని చేస్తే మంచి ఆరోగ్యంతో ఉల్లాసంగా ఉంటారని తెలిపారు.
- మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నామని, తమిళనాడులో సంక్రాంతిని జల్లికట్టు పండగ పేరుతో పిలుస్తున్నారని, అప్పుడు తాము పలకల పండుగగా పిలిచేవాళ్లమని వివరించారు.

సంక్రాంతి వేళ కుటుంబ సభ్యులతో..

సంక్రాంతి పండగను ముఖ్యమంత్రి తన స్వగ్రామమైన నారావారిపల్లెలో జరుపుకొన్నారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా ఇంటివద్ద ఉన్న గంగమ్మ గుడి వద్దకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా నాగాలమ్మకట్ట వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి నాగదేవతకు హారతులిచ్చారు. ఇంటి పక్కనే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తన తల్లిదండ్రుల సమాధి వద్దకు చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. సాయంత్రం సమయంలో కోడలు బ్రహ్మణి.. మనవడు దేవాన్ష్‌తో కలిసి ఎడ్లబండిపై గ్రామంలో పర్యటించారు. తనకు వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ లోపలికి పిలిచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పక్షవాతం వచ్చిన రెడ్డెప్ప అనే వ్యక్తికి రూ.50వేలు అందజేశారు. వెంకట్రామనాయుడుకు వృద్ధాప్య పింఛను, కె.ధనలక్ష్మి, బి.పుష్పలత, జి.శకుంతలమ్మలకు ఇళ్లను మంజూరు చేశారు.



నారావారిపల్లిలో ఎడ్లబండిపై బ్రహ్మణి, దేవాన్ష్

లోయా మృతికి సంబంధించిన పత్రాలను పిటిషనర్లకు అందజేయండి

- మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశం

దిల్లీ: సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీహెచ్ లోయా మృతికి సంబంధించిన అన్ని పత్రాలనూ.. పిటిషనర్లకు అందజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించింది. లోయా మరణం వెనుకున్న కారణాలపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ ఈ పిటిషనర్లు కోర్టుకెక్కారు. తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం లోయా శవపరీక్ష నివేదికను కోర్టుకు సమర్పించింది. పిటిషనర్లకు పత్రాలు ఇవ్వాలని కోర్టు సూచించగా.. వాటిలో రహస్య సమాచారం ఉందని, వాటిని బహిరంగపరచకూడదని పేర్కొంది. ఇటు పిటిషనర్లు తాము రహస్య సమాచారాన్ని బయటకు వెల్లడించబోమని హామీ ఇవ్వడంతో.. వారంలోగా ఈ పత్రాలను వారికి అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు సూచించింది. ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు ఆరోపణలున్న సొహ్రాబుద్దీన్ 'నకిలీ ఎన్‌కౌంటర్' కేసులో విచారణ న్యాయమూర్తిగా ఉన్న లోయా.. 2014 డిసెంబర్ 1న గుండెపోటుతో మృతిచెందారు. ఈ కేసులో అప్పట్లో భాజపా అధ్యక్షుడు అమిత్ షా నిందితుడిగా ఉన్నారు. అయితే లోయా మృతి చెందిన పరిస్థితులపై అనుమానాలున్నాయంటూ ఓ కాంగ్రెస్ నాయకుడు, మరో పాత్రికేయుడు సుప్రీం కోర్టులో వ్యాజ్యాలు వేశారు.

నలుగురు న్యాయమూర్తులతో సీజేఐ భేటీ!

(మొదటి పేజీ తరువాయి)

సమసిపోయాయా? నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలపై ఏదైనా పరిష్కార మార్గాన్ని ఆలోచించారా అన్నది ఇంకా తెలియరాలేదు. నలుగురు జడ్జీలతో బుధవారం కూడా సీజేఐ భేటీ అయ్యే అవకాశం ఉంది.

ఒక అంశంపై పరిష్కారం?

నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాల్లో ఒకటి పరిష్కారమైనట్లు కనపడుతోంది. సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బి.హెచ్.లోయా మరణం కేసుపై విచారణ జరుపుతున్న జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఎం.ఎం.శాంతనుగౌడర్‌లతో కూడిన ధర్మాసనం.. ఈ కేసును 'నిర్దిష్ట ధర్మాసనం ముందుంచాలి' అని ఆదేశించింది. ఈ కేసు కేటాయింపు అంశంపై నలుగురు న్యాయమూర్తులు తమ పాత్రికేయ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించిన సంగతి తెలిసిందే.

ఇంకా అపరిష్కృతంగానే..

మరోపక్క ఈ సంక్షోభం ఇంకా పరిష్కారం కాలేదని, 2-3 రోజుల్లో అంతా సర్దుకుంటుందని ఆశిస్తున్నట్లు అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ ప్రకటించాక మంగళవారం సుప్రీం కోర్టు నడువాల్లో అన్ని రకాల ఊహాగానాలు సాగాయి. నిజానికి ఈ వివాదం సర్దుబాటు అయ్యిందని, ఇది టీ కప్పులో తుపాను లాంటిదని వేణుగోపాల్ సోమవారం పేర్కొనడం ఇక్కడ గమనార్హం.

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా వివాదం సమసిపోయిందని అంతకుముందు పేర్కొంది. అయితే ఈ వారాంతంలోగా పరిస్థితులు చక్కబడే అవకాశం ఉందని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ తాజాగా తెలిపారు.

8 కీలక కేసులపై రాజ్యాంగ ధర్మాసనం

మరోవైపు తాజా సంక్షోభం నేపథ్యంలో ముఖ్యమైన 8 కేసులపై విచారణకు సర్వోన్నత న్యాయస్థానం ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. దీనికి సీజేఐ నేతృత్వం వహిస్తారు. అయితే ఆయనకు వ్యతిరేకంగా గళం విప్పిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లకు ఇందులో చోటు లభించలేదు. జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్‌లు ఈ ధర్మాసనంలో ఉంటారు. ఆధార్ చట్టం, స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించే ఐపీసీలోని 377 సెక్షన్ చెల్లుబాటు, శబరిమల ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పించడం తదితర 8 కేసులను ఈ ధర్మాసనం విచారిస్తుంది. బుధవారం వీటిపై విచారణ జరుగుతుంది.

వేతన జీవులకు ఊరట!

(మొదటి పేజీ తరువాయి)

పొదుపు పథకం(ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి ఖాతా, ప్రజాభవిష్యనిధి(పీపీఎఫ్), జాతీయ పొదుపు పత్రం(ఎన్ఎస్‌సీ), ఐదేళ్ల పన్ను ఆదా బ్యాంకు డిపాజిట్లు, ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్) తదితర పెట్టుబడులు, వ్యయాలపై స్థూల మొత్తం ఆదాయంలో ఏటా రూ.1.5 లక్షల దాకా డిడక్షన్‌కు అవకాశం ఉంది. ఎవరైనా రూ. 1.5 లక్షల్ని ఇందులో ఏదైనా ఒక పథకంలోగానీ, వేర్వేరుగాగానీ పెట్టవచ్చు. బోధన రుసుములు, గృహ రుణాల చెల్లింపులు వంటి వ్యయాల ద్వారా కూడా ప్రయోజనం పొందవచ్చు.

గృహరుణాలు: మోదీ ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని భారీగా ప్రోత్సహించేందుకు యత్నిస్తున్న క్రమంలో ఇళ్ల కొనుగోలుదారులకు కొన్ని ప్రోత్సాహకాలు గృహరుణంలో అసలు మొత్తం చెల్లింపులో అదనంగా రూ.50 వేలదాకా ప్రయోజనం దక్కొచ్చు. ప్రస్తుతం గృహరుణం ఉన్న వారు ముందస్తు చెల్లింపు ద్వారా ప్రయోజనాన్ని, కొత్తగా ఇళ్లు కొనుగోలు చేసేవారు గృహ రుణాల ద్వారా అదనపు ప్రోత్సాహకాల్ని పొందే అవకాశం ఉంది.

ఈఎల్ఎస్ఎస్: గృహరుణం కాకుండా సెక్షన్ 80సీ కింద మినహాయింపు పరిమితి పెంపుదలను ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులకు పరిమితం చేసే అవకాశం ఉంది. ఇవి మూడేళ్ల కాలవ్యవధితో, పన్ను ప్రయోజనాల్ని అందించే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలు. దేశంలో ఈక్విటీ పెట్టుబడుల సంస్కృతి ఆశావహంగా ఉండటంతో ప్రభుత్వం దీనిని ఉపయోగించుకునే అవకాశం ఉంది.

టెర్మ్ బీమా పథకాలు: 2018 బడ్జెట్‌లో టెర్మ్ బీమా పథకాల కోసం సెక్షన్ 80సీ మినహాయింపు పరిమితి పెంచేట్లయితే బీమా కవరేజీ పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ఆర్జిత వ్యక్తి మరణిస్తే కుటుంబ సభ్యుల జీవనప్రమాణాలు పడిపోకుండా సాగే అవకాశముంది.

హైకోర్టు జడ్జిపై సీబీఐ దర్యాప్తును అడ్డుకున్నారు..

- సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రపై సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆరోపణలు
- సిట్‌తో దర్యాప్తు జరిపించాలని డిమాండ్
- వైద్య కళాశాల లంచాల కుంభకోణం వ్యవహారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్

దిల్లీ: వైద్య కళాశాల లంచాల కుంభకోణం వ్యవహారం న్యాయవ్యవస్థపై మరోసారి దుమారం రేపింది. భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)పైనే ఆరోపణలు సంధిస్తూ సుప్రీంకోర్టులోని అయిదుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తుల ధర్మాసనానికి ఫిర్యాదు వెళ్లింది. సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ నేతృత్వంలోని సిజార్ (క్యాంపెయిన్ ఫర్ జుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫామ్స్-సీజేఏఆర్)ఈ ఫిర్యాదు చేసింది. ఒక సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తి మీద సీబీఐ కేసు నమోదు కాకుండా సీజేఐ దీపక్ మిశ్ర అడ్డుకున్నారన్నది ఫిర్యాదుదారు ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలన్నది పిటిషనర్ డిమాండ్.

సుప్రీంకోర్టు అంతర్గత నిబంధనల ప్రకారం అత్యంత సీనియర్ నాయమూర్తులైన తొలి అయిదుగురితో కూడిన ధర్మాసనానికి సిజార్ ఈ ఫిర్యాదు అందజేసింది. జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎంబీ లోకుర్, జస్టిస్ కె జోసెఫ్, జస్టిస్ ఏకే సిక్రి ఈ ధర్మాసనం సభ్యులుగా ఉన్నారు. సుప్రీంకోర్టు పాలనా వ్యవహారాలతో పాటు న్యాయ సంబంధ విషయాలన్నీ ప్రధాన న్యాయమూర్తి చేతిలోనే ఉన్నాయని, వైద్య కళాశాల కుంభకోణం కేసును చేపట్టే ధర్మాసనం సహా ప్రతి ధర్మాసనానికీ ఆయనే నేతృత్వం వహిస్తున్నారని సిజార్ ఆరోపించింది. ఇది న్యాయమూర్తుల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే చర్యగా ఆ సంస్థ పేర్కొంది.

ఫిర్యాదు చేయటానికి ముందు ఏమి జరిగిందంటే..: వైద్య కళాశాల లంచాల కుంభకోణంపై దర్యాప్తు చేయించాలని కోరుతూ సిజార్ దాఖలుచేసిన పిటిషన్‌ను జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. అంతే కాకుండా పిటిషనర్ రూ.25 లక్షలు చెల్లించాలంటూ ఆదేశించింది.

ప్రశాంత్ భూషణ్ ఆరోపణ ఏమిటంటే..: 'సీజేఐ అనుమతి లేకుండా సిట్టింగ్ హైకోర్టు జడ్జిపై సీబీఐకి ఎఫ్ఐఆర్ దాఖలు చేయటం సాధ్యంకాదు. అలాంటి అనుమతివ్వటానికి సీజేఐ దీపక్ మిశ్ర నిరాకరించారు. లఖ్‌నవూకు చెందిన వైద్య కళాశాల లంచాల కుంభకోణంలో జస్టిస్ శుక్లా దాదాపు రూ. కోటి మేర లంచాలు తీసుకున్నారని, ఈ కుట్రలో ఆయన ప్రమేయం ఉందని చెప్పటానికి తగిన ఆధారాలతో గత ఏడాది సెప్టెంబరు 6న సీబీఐ అధికారి... సీజేఐని కలిశారని విశ్వసనీయ సమాచారం ఉంది'' అని ప్రశాంత్‌భూషణ తెలిపారు. వైద్య కళాశాల కుంభకోణం కుట్రలో సీజేఐ ప్రమేయం ఉందా లేదా అనేది తేల్చటానికి దర్యాప్తు అవసరమని ఆయన అన్నారు. ఫిర్యాదు ప్రధాన న్యాయమూర్తిపైనే అయినందున సీజేఐ తర్వాత అత్యంత సీనియర్లు అయిన న్యాయమూర్తులకు ఫిర్యాదు అందజేసినట్లు చెప్పారు.

లఖ్‌నవూకు చెందిన ఓ వైద్య కళాశాలకు భారత వైద్య మండలి (ఎంసీఐ) అనుమతినిరాకరించినా న్యాయస్థానాల ద్వారా అనుకూల ఉత్తర్వులు పొందటం, ఈ కుట్రలో హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భాగస్వాములయ్యారనే ఆరోపణ వివాదానికి కేంద్ర బిందువయ్యింది.

ఎన్‌జేఏసీ తీర్పుపై పునఃపరిశీలనా.. తర్వాత చూద్దాం

- విచారణ తేదీ ఖరారుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- అంతకన్నా ప్రాధాన్యాంశాలు ఉన్నాయని వెల్లడి

దిల్లీ: జాతీయ న్యాయ నియామకాల సంఘం (ఎన్‌జేఏసీ) చట్టం చెల్లదంటూ వెలువడిన తీర్పును పునఃపరిశీలించాలంటూ దాఖలైన వ్యాజ్యం విచారణకు తేదీని ఖరారు చేసేందుకు మంగళవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనికన్నా ప్రాధాన్యమైన చాలా విషయాలు అపరిష్కృతంగా ఉన్నాయని, ఈ అంశాన్ని తర్వాత పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. సర్వోన్నత న్యాయస్థానంతో పాటు ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలకు ఉద్దేశించిన (ఎన్‌జేఏసీ) 2014 చట్టం చెల్లదంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2015 అక్టోబరు 16వ తేదీన కొట్టివేసింది. అయిదుగురు న్యాయమూర్తుల్లో నలుగురు కొలీజియం వ్యవస్థను సమర్థించగా ఒకరు వ్యతిరేకిస్తూ తీర్పునిచ్చారు. ఎన్ఏఏసీ చట్టం చెల్లదంటూ వెలువడిన తీర్పును పునఃపరిశీలించాలంటూ దాఖలైన పిటిషన్‌ను వెంటనే విచారణ జాబితాలోకి చేర్చాలంటూ న్యాయవాది మాథ్యూ జె నెడుంపర మంగళవారం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితిల్లో దీనికి ప్రాధాన్యం ఉందని తెలుపగా ధర్మాసనం ఆ అభిప్రాయంతో ఏకీభవించలేదు. న్యాయవాది అభ్యర్థనను పరిశీలించి తర్వాత నిర్ణయిస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా న్యాయవాది చేసిన కొన్ని వ్యాఖ్యలపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గొంతు పెంచి మాట్లాడవద్దని, ఎవరూ అరుస్తూ మాట్లాడనవసరంలేదని, నెమ్మదిగానే లీగల్ పాయింట్లను ప్రస్తావించవచ్చని తెలిపింది. దీంతో న్యాయవాది నెడుంపర క్షమాపణ కోరారు. సుప్రీంకోర్టులో కేసుల విచారణ దృశ్యాలను వీడియో తీసేందుకు అనుమతించాలన్న న్యాయవాది అభ్యర్థననూ తర్వాత పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది.

హజ్ రాయితీ ఇక ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొనున్నారని తెలిపారు. గతేడాది రాయితీలకు ప్రభుత్వం రూ.250 కోట్లు వెచ్చించిందని పేర్కొన్నారు.

ఏంటీ హజ్ రాయితీ?

తాము పవిత్ర నగరంగా భావించే మక్కాను దర్శించుకునేందుకు ముస్లింలు చేపట్టే యాత్రే హజ్. ప్రతి ముస్లిమూ తమ జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా ఈ యాత్ర చేపట్టాలని ఇస్లాం సూచిస్తోంది. భారత్ నుంచి ఏటా పెద్ద సంఖ్యలో ముస్లింలు హజ్‌లో పాల్గొంటుంటారు. ఇలాంటి యాత్రికులకు విమాన టిక్కెట్లు, కొన్ని సౌకర్యాలపై కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తూ వస్తోంది. బ్రిటీష్ పాలన కాలం నాటి నుంచే ఇది కొనసాగుతోంది. ఏటా 1.2 లక్షలకుపైగా మంది ఈ రాయితీని పొందుతున్నారు. 2008లో ఒక్కో యాత్రికుడిపై సగటున దాదాపు రూ.75వేలు కేంద్రం రాయితీ కల్పించింది. అయితే ఈ రాయితీ ఇస్లాంకు వ్యతిరేకమని. . దీన్ని ఎత్తివేయాలని కొందరు ముస్లిం వర్గం ఎంపీలు కూడా గతంలో డిమాండ్లు చేశారు.

సుప్రీం సూచన మేరకే..


కాంగ్రెస్ అధికారంలో ఉండగా 2012లో జస్టిస్ అఫ్తాబ్ ఆలమ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం 2022లోపు హజ్ రాయితీని ఎత్తివేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. పదేళ్ల వ్యవధిలో రాయితీని క్రమంగా తగ్గిస్తూ పూర్తిగా తీసివేయాలని పేర్కొంది. మైనార్టీ వర్గాల విద్య, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై ఈ మొత్తాన్ని ఖర్చు పెట్టడం సముచితంగా ఉంటుందని పేర్కొంది. ప్రయాణ, వసతి తదితర ఖర్చులు భరించగలిగినవారే హజ్ యాత్ర చేపట్టాలని ఖురాన్ సూచించిన విషయాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది.

అభివృద్ధికి ఖర్చు చేయాలి: కాంగ్రెస్

హజ్ రాయితీని ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై.. కాంగ్రెస్ పార్టీ స్పందించింది. సుప్రీం కోర్టు ఆదేశాలను మోదీ ప్రభుత్వం గౌరవించి.. రాయితీల మొత్తాన్ని మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఖర్చు చేస్తుందని ఆశిస్తున్నామని కాంగ్రెస్ మీడియా వ్యవహారాల బాధ్యుడు రణ్‌దీప్ సుర్జేవాలా తెలిపారు. ఇటు హజ్ యాత్రికులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ ఏమీ లేదని.. టిక్కెట్ ధరలను పెంచి తిరిగి నష్టాల్లో ఉన్న ఎయిర్‌ఇండియాకు ఆ మొత్తం చేరుస్తుందని అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా వలీ రహ్మానీ అన్నారు. రాయితీ మొత్తాన్ని అభివృద్ధి కోసం ఖర్చు చేయాలనుకోవడం మంచిదేనని.. అయితే ఇకపై పేద ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లలేకపోతారని అఖిలభారత షియా పర్సనల్ లా బోర్డు ఛైర్మన్ యాసూబ్ అబ్బాస్ అభిప్రాయపడ్డారు. హజ్ రాయితీని పూర్తిగా తొలగించకూడదని.. యాత్రికులకు వసతులను అభివృద్ధి చేయాలని సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌధురి అన్నారు.

మిగతా తీర్థయాత్రలపైనా చర్చ!

హజ్ రాయితీని ఎత్తివేసిన నేపథ్యంలో.. ఈ తరహాలో మిగతా మతస్థులకు కల్పిస్తున్న ప్రయోజనాల విషయంపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం తమిళనాడులో క్రైస్తవులకు జెరూసలేం యాత్ర కోసం.. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20వేల మేర రాయితీ కల్పిస్తోంది. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ తరహా హామీనే ఇచ్చారు. ఇటు కుంభమేళా వంటి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఖర్చు పెడుతున్న నిధుల మాటేమిటని ఎమ్ఐఎమ్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రశ్నించారు. కర్ణాటకలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చార్‌ధామ్ యాత్ర కోసం ఒక్కొక్కరికి రూ.20వేలు కేటాయిస్తోందని ఆయన అన్నారు. అయోధ్య, కాశీ, మథుర తదితర దేవస్థాన పట్టణాలకు తీర్థయాత్రలపై ఉత్తర్‌ప్రదేశ్ నిధులివ్వడం ఎప్పుడు ఆపుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లిం బాలికలకు ఉపకారవేతనాల కోసం రూ.2వేల కోట్లు ఇస్తామన్న హామీని మోదీ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సవాలు విసిరారు.



ముఖ గుర్తింపుతో ఆధార్

(మొదటి పేజీ తరువాయి)

వారు ఆధార్ సంఖ్యను తెలిపినప్పటికీ ఉడాయ్ వద్ద నిక్షిప్తమై ఉన్న వివరాలతో సరిపోల్చుకోవటానికి సాధ్యం కావటంలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిని పరిష్కరించేందుకు జులై1 తేదీ నుంచి ముఖ గుర్తింపునకూ అనుమతిస్తున్నామని ఉడాయ్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ముఖ గుర్తింపుతో పాటు కంటి పాప (ఐరిస్), ఓటీపీ(వన్‌టైమ్ పాస్‌వర్డ్)లలో ఏదోఒకటి కూడా జతకలవాల్సి ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. పౌరులు దీనికోసం మళ్లీ ఫొటోలు దిగాల్సిన అవసరంలేదు. ఆధార్ సంఖ్య జారీ కోసం బయోమెట్రిక్, తదితర వివరాలతో పాటు ఫొటోలు కూడా సంస్థ సేకరించినందున అవే సరిపోతాయని, దీనికి అవసరమైన అదనపు సాంకేతికతను సమకూర్చుతామని ఉడాయ్ స్పష్టం చేసింది.

కోస్తాలో మంచు వాతావరణం

ఈనాడు, విశాఖపట్నం: కోస్తా తీరం వెంట ఇదివరకు ఈశాన్య, తూర్పు దిశ నుంచి గాలులు వీచాయని, ప్రస్తుతం కోస్తా మీదుగా ఆగ్నేయ, దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీనివల్ల తేమశాతం పెరిగి కోస్తాలో అక్కడక్కడా మంచు దుప్పటిలాగా చల్లటి వాతావరణం ఉండే అవకాశం ఉందని తెలిపింది. ప్రత్యేకించి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ప్రభావం బాగా ఉండేలా కనిపిస్తోందని వాతావరణ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో సాధారణం కన్నా 1 నుంచి 3 డిగ్రీలు అధికంగానే నమోదయ్యాయి.

గ్రహం అనుగ్రహం

17–1–2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ **ఉత్తరాయణం** **హేమంత రుతువు;** పుష్య మాసం; **బహుళ** పక్షం **అమావాస్య:** ఉ. 7-09

తదుపరి మాఘమాసం శుక్లపక్ష పాడ్యమి

ఉత్తరాషాఢ నక్షత్రం: రా. 9-53 తదుపరి శ్రవణం
అమృత ఘడియలు: మ. 2-48 నుంచి 4-34 వరకు
వర్జ్యం: రా. 2-15 నుంచి 4-00 వరకు
దుర్ముహూర్తం: మ. 11-47 నుంచి 12-32 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; **సూర్యాస్తమయం:** సా.5-43

ముక్కనుమ

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.1	32.4
మెదక్	14.1	35.3
శ్రీకాకుళం	15.0	33.0
రామగుండం	15.4	32.0
గుంటూరు	15.5	32.0
విశాఖపట్నం	17.0	30.0
హన్మకొండ	17.0	32.0
హైదరాబాద్	17.7	33.0
కరీంనగర్	18.0	32.0
రాజమహేంద్రవరం	18.0	33.0
తిరుపతి	18.6	31.5
అనంతపురం	18.7	32.6
ఖమ్మం	19.0	30.0
కడప	19.0	34.0
మహబూబ్‌నగర్	19.6	34.0
తాడేపల్లిగూడెం	20.0	30.0
నిజామాబాద్	20.0	32.0
విజయవాడ	20.7	31.0
కర్నూలు	21.2	37.8
ఒంగోలు	21.3	31.1
నరసాపురం	22.1	29.2
నెల్లూరు	23.0	30.0
సూర్యాపేట	23.0	35.0

మినుములు కొంటారా? లేదా?

- అదనపు కొనుగోళ్లపై తేల్చని కేంద్రం
- ఇక రాష్ట్రంపైనే భారం..

ఈనాడు – అమరావతి

మినుముల ధర క్వింటా రూ.4వేలకు పడిపోయింది. మరోవైపు రూ.5400 చొప్పున కొనుగోళ్లకు నాఫెడ్ అనుమతించిన 13,000 టన్నుల పరిమితి పూర్తయింది. దీంతో కొనుగోలు కేంద్రాలను మూసేశారు. కేంద్రం నుంచి అదనపు కోటా ఇస్తేనే మళ్లీ కొనుగోళ్లు సాధ్యం. లేదంటే రాష్ట్రమే సొంతంగా సేకరించి లాభనష్టాలను భరించాల్సి ఉంటుంది. దీనిపై సర్కారు నుంచి స్పష్టత లేకపోవడంతో కొనుగోళ్ల విషయంలో సందిగ్ధం నెలకొంది.

పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇంకా రైతుల వద్ద మినుముల నిల్వలున్నాయి. కృష్ణా, గుంటూరు, కర్నూలు నుంచి కూడా డిమాండ్లు పెరుగుతున్నాయి. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లిన నేతలవద్ద పలువురు రైతులు మినుముల కొనుగోలు అంశాన్ని ప్రస్తావించారు. మద్దతు ధర ఇప్పించాలని కోరారు. రైతుల వద్ద 2017 ఖరీఫ్ తోపాటు 2016-17 నాటి మినుములూ ఉన్నాయి. వాటన్నిటినీ తీసుకోవాలని కోరుతున్నారు. నేతలు ఇదే విషయాన్ని మంత్రుల ముందుంచుతున్నారు. మొత్తంగా చూస్తే ఐదుగురు మంత్రుల నుంచి కేంద్రాల కోసం డిమాండ్లు వస్తున్నాయి.

ఇంకా రైతుల వద్ద నిల్వలున్న విషయాన్ని అధికారులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అదనపు కొనుగోళ్లకు అనుమతించాలని కోరారు. అయినా ఫలితం లేదు. ముందు రాష్ట్రంలో ఖరీఫ్ మినుము విస్తీర్ణం, దిగుబడులకు సంబంధించిన సమగ్ర వివరాలు పంపాలని లేఖ వచ్చింది. దాన్ని పరిశీలించిన మీదట అదనపు కొనుగోళ్లకు అనుమతించాలా? లేదా? అనే నిర్ణయం తీసుకుంటారు. అప్పటిదాకా ఆగితే రబీ వస్తుందని అధికారవర్గాలు గుర్తు చేస్తున్నాయి. కొత్త మినుములు రైతుల ఇళ్లవద్దకు వస్తే గందరగోళం నెలకొంటుందని వివరిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని సొంతంగా కొనుగోళ్లు చేయించాల్సిందే.

ప్రస్తుతం మినుముల మార్కెట్ ధర క్వింటాలు రూ.4వేలే ఉంది. మద్దతు ధర ప్రకారం రూ.,5400 లెక్కన 5 వేల టన్నులు కొనుగోలు చేయాలన్నా రూ.27 కోట్లకు పైగా నిధులు సమకూర్చాలి. మద్దతు ధరతో పోలిస్తే మార్కెట్ ధర క్వింటాల్‌కు రూ.1,400 వరకు తక్కువే ఉంది. సేకరణ, కమిషన్, నిల్వ తదితర ఖర్చులన్నీ కలిపితే క్వింటాల్‌కు రూ. 1,600 వరకు నష్టం వస్తుందనే అంచనాతో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కొనుగోలు చేయించాలి. ముఖ్యమంత్రి స్థాయిలో త్వరితగతిన నిర్ణయం తీసుకుంటేనే న్యాయం జరుగుతుందని రైతులు అంటున్నారు.

కొత్త గవర్నర్‌ను నియమించండి

- రాజ్‌నాథ్‌కు ఎంపీ హరిబాబు లేఖ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కొత్త గవర్నర్‌ను వెంటనే నియమించాలని విశాఖ పార్లమెంటు సభ్యుడు హరిబాబు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేఖ రాశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న ఆయన పార్లమెంటు సభ్యుడి హోదాలో రాసిన లేఖను మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో హైకోర్టు ఏర్పాటుకు అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోందని పేర్కొన్నారు. త్వరలోనే ఇది కార్యరూపం దాలుస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం సీఎం చంద్రబాబు పరిపాలనను హైదరాబాదు నుంచి అమరావతికి తరలించి, తాత్కాలిక సచివాలయం కింద నిర్మాణాలను కూడా చేపట్టారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు దృష్టిలో ఉంచుకుని త్వరిగతిన రాష్ట్రానికి ప్రత్యేకంగా గవర్నర్‌ను నియమించాలని కోరారు. దీనివల్ల రాష్ట్ర పరిపాలనకు సులువుగా ఉంటుందని హరిబాబు ఆ లేఖలో అభిప్రాయపడ్డారు.

సూర్య.. గ్రేట్ ఫీట్!

గ్యాంగ్ చిత్రం విజయోత్సవంలో భాగంగా సినీ కథానాయకుడు సూర్య సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మేనక థియేటర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులతో మాట్లాడారు. అనంతరం తిరిగివెళ్లే క్రమంలో తాళం వేసి ఉన్న గేటుపై నుంచి ఇలా దూకారు.

– ఈనాడు, రాజమహేంద్రవరం



కేంద్ర మంత్రులు సమయం ఎందుకు ఇవ్వడం లేదు బాబూ?

వైకాపా ఎమ్మెల్యే రాజేంద్రనాథ్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు సాధించింది ఏమీ లేదని వైకాపా ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. సంకీర్ణ ప్రభుత్వంలో కనీసం కేంద్ర మంత్రుల సమయం కూడా చంద్రబాబుకు దొరకడం లేదని ఆక్షేపించారు. చంద్రబాబుకు కేంద్రం సమయం ఇవ్వకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నర పాటు ప్రధానిని కలిసే అవకాశం చంద్రబాబుకు దొరక్కపోవడం, కేంద్ర మంత్రి గడ్కరీ కోసం ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడకు ప్రత్యేక విమానాల్లో వెళ్లడం ఏంటని రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు.

పాడి ఉత్పత్తుల్లో తెలుగు రాష్ట్రాల ఘనత

- గుడ్ల ఉత్పత్తిలో 2వ స్థానంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు మూడో స్థానం
- పాలలో 5వ స్థానంలో ఏపీ

ఈనాడు – దిల్లీ

పాడి ఉత్పత్తుల్లో తెలుగురాష్ట్రాలు ఘనత చాటాయి. గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 2, తెలంగాణ మూడోస్థానంలో నిలిచాయి. పాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అయిదో స్థానాన్ని ఆక్రమించింది. గత వేసవిలో దేశవ్యాప్తంగా జరిగిన పాల, గుడ్ల ఉత్పత్తి ఆధారంగా కేంద్ర వ్యవసాయశాఖ ఈ గణాంకాలు వెల్లడించింది. పాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కంటే ముందు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ ఉన్నట్లు పేర్కొంది. 2017-18 మార్చి-జూన్ నెలల మధ్యలో దేశవ్యాప్తంగా 53.77 మిలియన్ టన్నుల పాల ఉత్పత్తి జరిగినట్లు తెలిపింది. అంతకుముందు ఏడాదికంటే ఇది 4.7% ఎక్కువ అని పేర్కొంది. 2013-14తో పోలిస్తే 2016-17 నాటికి దేశంలో పాల ఉత్పత్తి 20.13% వృద్ధి నమోదుచేసినట్లు వెల్లడించింది. 2014-15 నుంచి యేటా 6%కిపైగా ఉత్పత్తి పెరుగుతూ వస్తున్నట్లు విశ్లేషించింది. 2015-16 వేసవితో పోలిస్తే 2016-17 వేసవిలో పాల ఉత్పత్తి 3.9% మాత్రమే పెరిగిందని, ఈసారి అంతకుమించి వృద్ధి నమోదైందని తెలిపింది. దేశంలో ఈ వేసవిలో గుడ్ల ఉత్పత్తిలో 7.4% వృద్ధి నమోదైనట్లు పేర్కొంది. మార్చి నుంచి జూన్ వరకు 27.95 బిలియన్ల గుడ్ల ఉత్పత్తి అయినట్లు తెలిపింది. 2016-17లో 88.1 బిలియన్ గుడ్లు ఉత్పత్తి అయ్యాయని, 2013-14తో పోలిస్తే ఇది 12.3% అధికమని తెలిపింది. గుడ్ల ఉత్పత్తిలో తెలుగురాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ రెండు, తెలంగాణ మూడో స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. తొలిస్థానంలో తమిళనాడు, నాలుగు, అయిదు స్థానాల్లో పశ్చిమబంగ, హరియాణలు ఉన్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ తెలిపింది.

ఈనాడు

మైత్రికి కొత్త చివుళ్లు

'ఇండియా ఇజ్రాయెల్ బంధం... ఆ దేవుడు చేసిన పెళ్లి'- ప్రధాని నెతన్యాహు గళంలో తొణికిసలాడిన వాత్సల్యమది. 'మరెంతో సాధించాలన్న తపనతో మన మధ్య చర్చలు విస్తృతంగా గంభీరంగా సాగుతున్నాయ్'- భారత ప్రధాని నరేంద్ర మోదీ వాస్తవిక దృక్కోణమిది! అత్యంత ఆప్తమిత్రుడికి ఆలింగనపూర్వక స్వాగతం పలకడం కంటే పండగేముంటుంది? దిల్లీ-టెల్ అవీవ్‌ల మధ్య సంబంధ బాంధవ్యాల రజతోత్సవాలకు స్వర్ణమయ కాంతులద్దేలా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరు రోజుల పర్యటన ఆహ్లాదకరంగా సాగుతోంది. ఏడు దశాబ్దాల్లో ఇజ్రాయెల్ సందర్శించిన మొట్టమొదటి భారత ప్రధానిగా నిరుడు జులైలో మోదీ చరిత్ర సృష్టించారు. 'భారత్‌లో తయారీ' అన్న మా చొరవకు భారత్‌తో కలిసి తయారీ అన్న నా విధానానికి జత కుదిరింది' అని నాడు మహదానందం చెందిన నెతన్యాహు, ప్రపంచ శక్తిగా ఎదిగిన ఇండియాతో సంబంధాలు మెరుగుపరచుకోవడం ఇజ్రాయెల్‌కు వరమని నేడు మనసారా చాటుతున్నారు. తమ దేశానికి చెందిన వందకు పైగా వాణిజ్య సంస్థల అధిపతులతో మొత్తం 130 మంది సభ్యుల ప్రతినిధుల బృందంతో వేంచేసిన నెతన్యాహు- భారత్‌తో జట్టుకట్టి భిన్నరంగాల్లో పరస్పర అభివృద్ధి అవకాశాల్ని ఒడిసిపట్టాలనుకొంటున్నారు. సైబర్ భద్రత, చమురు సహజవాయు రంగం, వైమానిక రవాణా వంటి రంగాల్లో తొమ్మిది అవగాహన ఒప్పందాలపై సంక్రాంతి పర్వదినాన సంతకాలు జరిగాయి. ఇండియా రష్యాల సంయుక్త భాగస్వామ్యంతో బ్రహ్మోస్ క్షిపణి తయారీ అద్భుత విజయం సాధించింది. అదే వరసలో ఇజ్రాయెల్ రక్షణ సంస్థలు ఇండియాతో కలిసి సంయుక్తంగా ఉత్పత్తులు ప్రారంభించాలన్న ప్రధాని మోదీ ఆహ్వానం ఉభయతారకమైనది. వ్యవసాయం, సాంకేతికత, భద్రత రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలన్న ఒప్పందం- 'హిందీ హీబ్రూ భాయి భాయి' తరహాలో రెండు దేశాలు అన్ని విధాలుగా చేరువయ్యేందుకు మేలుబాటలు పరవనుంది. వ్యూహాత్మక భాగస్వామ్యం దిశగా ఉభయ దేశాల ప్రస్థానంలో నెతన్యాహు పర్యటన నిశ్చయంగా మైలురాయి!

యావత్ అరబ్ ప్రపంచానికి ఎదురొడ్డి స్వీయ అస్తిత్వాన్ని నిలబెట్టుకొన్నందుకే కాదు, అత్యద్భుత సాంకేతిక ప్రజ్ఞా పాటవాలతో భిన్న సవాళ్లను అధిగమిస్తున్న దేశంగానూ ఇజ్రాయెల్ ప్రస్థానం స్ఫూర్తిమంతం. యూదు రాజ్యంతో జట్టుకడితే అరబ్బు దేశాలు నొచ్చుకొంటాయేమోనన్న గుంజాటనతో నాలుగున్నర దశాబ్దాలు ఇజ్రాయెల్‌కు ఇండియా దూరంగా మెలిగిందన్నది చారిత్రక వాస్తవం. పీవీ జమానాలో 1992 జనవరినుంచి టెల్ అవీవ్‌తో స్నేహసంబంధాలు పట్టాలెక్కినా- శుభ కామనల పరిధి దాటి వడివడిగా అడుగులు పడనే లేదు. 1993 మే నెలలో భారత్‌లో పర్యటించిన ఇజ్రాయెల్ ఉప ప్రధాని షిమొన్ పెరెజ్- పరిశోధన అభివృద్ధికి సంబంధించి ఇరు దేశాల ఉమ్మడి నిధి ఏర్పాటు, థార్ ఎడారిని సాగులోకి తెచ్చేందుకు తోడ్పాటును ప్రస్తావించారు. పిమ్మట పదేళ్లకు ప్రధానిగా ఏరియెల్ షరాన్ ఇండియా సందర్శించి కీలక ఒప్పందాలు కుదుర్చుకొని విస్తృత అనుబంధానికి కొత్త దారులు పరిచారు. దరిమిలా 15 ఏళ్లకు భారత గడ్డపై కాలు మోపిన ఇజ్రాయెల్ ప్రధానిగా నెతన్యాహు- సహస్రాబ్దాల నాటి వారసత్వం, ఉత్తేజభరిత వర్తమానం, సానుకూల భవిష్యత్తును సొంతం చేసుకోగల అవకాశం- రెండు దేశాల్నీ కలుపుతున్నాయని స్పష్టీకరిస్తున్నారు. టెల్ అవీవ్‌తో కలిసి మూడు విధాలుగా ముందడుగేయాలనుకొంటున్నట్లు చెప్పిన ప్రధాని మోదీ- ఇప్పటికే ఉన్న సహకార బంధాన్ని పటిష్ఠీకరించడం, కొత్త రంగాల్లో ద్వైపాక్షిక తోడ్పాటుకు దోహదపడటం, ఇరు దేశాల ప్రజలు, వారి నవ్యాలోచనలు పరస్పరం కలబోసుకొనేలా అనుసంధాన వేదికల్ని సిద్ధం చెయ్యడంపై దృష్టి సారించాలంటున్నారు. ఇజ్రాయెల్‌తో మైత్రి కొత్త చివుళ్లు తొడుగుతుండటానికిది ప్రబల సూచిక!

ఎవరితో వ్యూహాత్మక నెయ్యానికి ప్రాధాన్యమిచ్చినా, భారత్ ప్రవచిత బాణీ ఒక్కటే. ఒకరికి చేరువ అవుతున్నామంటే అర్థం- వేరొకరికి దూరం జరగడం లేదన్నదే! సంక్లిష్టభరిత అంతర్జాతీయ రాజకీయ యవనిక మీద అన్ని వేళలా ఏ ఒక్క దేశానికో పూర్తిగా అనుకూలంగా వ్యవహరించడం ఇండియాకైనా మరే దేశానికైనా సాధ్యంకాని పని. కాబట్టే, జెరూసలేమ్‌ను రాజధానిగా గుర్తించడాన్ని వ్యతిరేకించే ఐరాస తీర్మానం మీద భారత్ తక్కిన 126 దేశాలతో కలిసి ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇజ్రేలీ సంస్థనుంచి స్పైక్ క్షిపణుల కొనుగోలు వ్యవహారంనుంచి రెండు నెలలక్రితం ఇండియా వైదొలగింది. ఇలాంటివి టెల్ అవీవ్ నేతాగణాన్ని నొప్పించే పరిణామాలే అయినా, భారత్ ప్రయోజనాలకు భంగకరంగా కొన్ని అంశాల్లో ఇజ్రాయెల్ వ్యవహారశైలి ఉంటోంది. చాబహార్ పోర్టు ద్వారా అఫ్గానిస్థాన్, మధ్య ఆసియా, రష్యాలకు రవాణా సదుపాయాల్ని కల్పిస్తున్న ఇరాన్‌ను ఇండియా వ్యూహాత్మక భాగస్వామిగా సంభావిస్తుంటే- దానిపై ఇజ్రాయెల్ కత్తులు దూస్తోంది. చైనా ప్రతిపాదించిన ఒన్ బెల్ట్, ఒన్ రోడ్ (ఓబీఓఆర్) ప్రాజెక్టులో పాల్గొనకూడదని తహతహలాడుతున్న టెల్ అవీవ్- భారత అభ్యంతరాల్ని బేఖాతరు చేస్తోంది. తక్కిన దేశాల విషయంలో ఎవరి వైఖరి ఏమైనా, వాటి తాలూకు నీలినీడలు ద్వైపాక్షిక వాణిజ్య బంధంపై పడకుండా వ్యవహరించే పరిణతిని భారత్- ఇజ్రాయెల్ ఏ మేరకు కనబరుస్తాయన్నదానిపైనే అనితరసాధ్య పర్యటన అంతిమ ఫలితం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం 500 కోట్ల డాలర్లకు అటూ ఇటూగా తారట్లాడుతున్న ద్వైపాక్షిక వాణిజ్యంలో వజ్రాలదే భీమ భాగం. ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలూ ఓ కొలిక్కి వస్తే ఇరు దేశాల దోస్తానా- కలిమిని బలిమిని పెంచగలదన్నది యథార్థం. భవిష్యత్ సవాళ్లను అవకాశాలుగా మలచుకొనే ముందుచూపు రెండు దేశాల్నీ మరింత చేరువ చేస్తోంది!

అనుసంధానానికి అటూఇటూ

దశాబ్దాలుగా చర్చోపచర్చలకే పరిమితమైన నదుల అనుసంధానం వ్యవహారంలో కదలిక కనిపిస్తోంది. గోదావరి నుంచి నీటిని మళ్లించేందుకు కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చిన కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖ, దాని కార్యాచరణపై దృష్టి సారించింది. దశాబ్దాలుగా నదుల అనుసంధానంపై వరస చర్చలే తప్ప అడుగు ముందుకు పడని నేపథ్యంలో- నూతన ప్రతిపాదనపై భాగస్వామ్య రాష్ట్రాలను ఒప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పావు కదుపుతోంది. ఇప్పటివరకు తమ రాష్ట్రంలో మిగులు జలాలు లేవని, ఎగువనుంచి నీటిని మళ్లిస్తే తమకేమీ అభ్యంతరం లేదని చెప్పిన రాష్ట్రాలు, జాతీయ జల అభివృద్ధి సంస్థ తయారుచేసిన ప్రత్యామ్నాయంపై ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పుడు మిగులు జలాలు ఉన్నాయి, వాటిని నదుల అనుసంధానం ద్వారా మళ్లిస్తామని ఆ సంస్థ చెబుతోంది. జాతీయ జల అభివృద్ధి సంస్థ రాష్ట్రాలకు ఉన్న కేటాయింపుల నుంచి నీటిని మళ్లించేలా ప్రతిపాదించింది. దీనిపై భాగస్వామ్య రాష్ట్రాలతో చర్చించేందుకు కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీ నేడు దిల్లీలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రాలు ఎలా స్పందిస్తాయన్నదాన్నిబట్టి ఈ అనుసంధానం ఆధారపడి ఉంది.

ఇందులో భాగంగా ఒడిశాలోని మహానది నుంచి తమిళనాడులోని గుండార్ డ్యాం వరకు మొత్తం తొమ్మిది అనుసంధానాలను జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రతిపాదించింది. మహానది, గోదావరి నుంచి నీటిని మళ్లిస్తే కానీ ఈ అనుసంధానాలు కార్యరూపం దాల్చవు. మహానదిలో మిగులు జలాలు లేవని ఒడిశా చెబుతోంది. గోదావరిలో మిగులు జలాలు లేవని, మహానది నుంచి మళ్లిస్తే తమకేమీ అభ్యంతరం లేదన్న వైఖరిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. పునర్విభజన తరవాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఇదే వైఖరిని కొనసాగించాయి. ఎనిమిది దశకంలో జరిగిన అధ్యయనం ఆధారంగా ఇచ్ఛంపల్లి వద్ద మిగులు జలాలు ఉన్నాయని జాతీయ జల అభివృద్ధి సంస్థ చెబుతోంది. అందువల్ల తిరిగి అధ్యయనం చేయాలని తెలంగాణ కోరింది. తెలంగాణ ఒత్తిడితో జాతీయ జల అభివృద్ధి సంస్థ 2016లో అధ్యయనం నిర్వహించి- నీటి లభ్యత తగ్గిందని పేర్కొంది. ఒడిశాతో పలు దఫాలుగా కేంద్రం చర్చలు జరిపినా ఇప్పటివరకు వ్యవహారం ఓ కొలిక్కి రాలేదు. దీంతో బ్రహ్మపుత్ర-గంగ-మహానది-గోదావరి అనుసంధానంపై జాతీయ జల అభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. ఇది ఎప్పటికి ఓ కొలిక్కి వస్తుందో తెలియదు. అంతర్ రాష్ట్ర సమస్యలు, ముంపు కారణాలతో ఒడిశాలో మహానదిపై మణిభద్ర, తెలంగాణలో గోదావరిపై ఇచ్ఛంపల్లి కార్యరూపం దాల్చలేదు. కాళేశ్వరం, దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ ఎత్తిపోతల మొదలైన పథకాలు కార్యరూపం దాల్చిన దృష్ట్యా తెలంగాణ ఇచ్చంపల్లి గురించి ఆలోచించే పరిస్థితే లేదు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఓ నూతన ప్రతిపాదనను జాతీయ జల అభివృద్ధి సంస్థ ముందుకు తెచ్చింది.



నేడు కీలక సమావేశం

కొత్త ప్రతిపాదన

కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ రాష్ట్రాలతో ప్రాథమికంగా చర్చించిన తరవాత జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రతిపాదనను తయారు చేసింది. వాటిని వివిధ రాష్ట్రాలకు పంపి అభిప్రాయాలను కోరింది. దీని ప్రకారం గోదావరి నదిపై తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తుపాకుల గూడెం బ్యారేజి- దుమ్ముగూడెం ఆనకట్ట మధ్యలో అకినేపల్లి వద్ద 72.50 మీటర్ల పూర్తిస్థాయి నీటిమట్టంతో బ్యారేజి నిర్మాణం చేపడతారు. దీని నిల్వ సామర్థ్యం 20.83 శతకోటి ఘనపుటడుగులు(టీఎమ్‌సీలు). ఇక్కడినుంచి నాగార్జునసాగర్‌కు (పూర్తిస్థాయి నీటిమట్టం 179.85 మీటర్లు) ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తారు. ఈ రెండింటి మధ్య దూరం 341 కి.మీ. మూడు దశల్లో లిఫ్టులు ఉన్నాయి. రోజూ 2.2 టీఎమ్‌సీల చొప్పున 143 రోజుల్లో 247 టీఎంసీల నీటిని అకినేపల్లి నుంచి మళ్లిస్తారు. అకినేపల్లి నుంచి నాగార్జునసాగర్‌కు చేరేలోగా తెలంగాణలో 3,10,200 హెక్టార్ల ఆయకట్టుకు నీరందించేలా ప్రతిపాదన సిద్ధం చేశారు. నాగార్జున సాగర్ నుంచి 393.02 కిలోమీటర్ల దూరం నీటిని తీసుకెళ్లి పెన్నానదిపై ఉన్న సోమశిలకు మళ్లిస్తారు. ఈ మార్గంలో 202.75 కి.మీ. దూరం నాగార్జునసాగర్ కుడికాలువకు సమాంతరంగా 20వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో కాలువను తవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సాగర్ కుడి కాలువ కంటే ఇది పెద్దది. ఆంధ్రప్రదేశ్‌లో 4,04,600 హెక్టార్ల ఆయకట్టుకు నీరందించడం దీని లక్ష్యం. సోమశిల నుంచి 90 టీఎమ్‌సీల నీటిని తమిళనాడుకు మళ్ళిస్తారు. సోమశిలనుంచి 529.19 కి.మీ. దూరం 21,306 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ తవ్వి మార్గమధ్యంలో తమిళనాడులో 4,01,400 హెక్టార్ల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం, కావేరిపై ఉన్న గ్రాండ్ ఆనకట్టకు 57 టీఎమ్‌సీల నీటిని మళ్లించడం దీని లక్ష్యం. భవిష్యత్తులో ఒడిశాలోని మహానది నుంచి నీటిని మళ్లించి పోలవరం ద్వారా సోమశిలకు నీటిని తరలించినప్పుడు ఎక్కువ నీటిని తమిళనాడుకు మళ్లించడానికి వీలుగా సోమశిల నుంచి ఎక్కువ సామర్థ్యంతో కాలువను డిజైన్ చేశారు. ఈ ప్రతిపాదనలో కీలకమైంది తమిళనాడుకు, కావేరి నదిపై ఉన్న గ్రాండ్ ఆనకట్టకు నీటిని మళ్లించడం. ఈ పథకం ద్వారా మళ్లించే 247 టీఎమ్‌సీల్లో 90 టీఎంసీలకు పైగా తమిళనాడుకు తరలుతాయి. భవిష్యత్తులో కావేరి నీటిపై తలెత్తే ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకొని కేంద్రప్రభుత్వం ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చినట్లు కనిపిస్తోంది.

జాతీయ జల అభివృద్ధి సంస్థ తాజా ప్రతిపాదన పట్టాలకు ఎక్కాలంటే రెండు రాష్ట్రాల అంగీకారం కీలకం. ఛత్తీస్‌గఢ్‌కు గోదావరి జల వివాద ట్రైబ్యునల్ ఇంద్రావతి సబ్ బేసిన్‌లో కేటాయించిన నీటిలో ఇప్పటివరకు వినియోగించుకోని జలాలు 70 టీఎమ్‌సీల వరకు ఉన్నాయి. ఈ నీటిని అనుసంధానం కింద వాడుకునేలా ప్రతిపాదించింది. ఇప్పటికిప్పుడే ఆ రాష్ట్రం ఆ నీటిని వినియోగించుకొనే అవకాశం లేదనీ పేర్కొంది. ట్రైబ్యునల్ కేటాయించిన నీటిని వదులుకోవడానికి ఛత్తీస్‌గఢ్ అంగీకరించడం అంత సులభం కాదు. మహానది-గోదావరి అనుసంధానం చేపట్టే వరకు ఈ నీటిని ఛత్తీస్‌గఢ్ వదులుకోవాల్సి ఉంటుంది. మహానది-గోదావరి కార్యరూపం దాల్చడానికి దశాబ్దాల కాలం పట్టవచ్చు. అసలు అది క్షేత్రస్థాయిలో సాకారం కూడా కాకపోవచ్చు. కొన్నేళ్ల తరవాత ఇంద్రావతి నీటిని వినియోగించుకొనేలా ఛత్తీస్‌గఢ్ ఓ ప్రాజెక్టును చేపడితే గోదావరి(అకినేపల్లి)- కృష్ణా(నాగార్జునసాగర్) అనుసంధానమే ప్రశ్నార్థకమవుతుంది. ఇది జరగకూడదంటే ఈ పథకం కోసం చేసుకొనే ఒప్పందంపై ఆ రాష్ట్రం సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ అనుసంధానానికి మొదటి అడ్డంకి ఇది. రెండోది కీలక రాష్ట్రం తెలంగాణ అంగీకారం. బ్యారేజీ నిర్మాణ ప్రాంతం నుంచి నాగార్జునసాగర్ వరకు మొత్తం తెలంగాణలోనే ఉంటుంది. ఆ రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌నుంచి వచ్చేవి కాకుండా గోదావరి నుంచి 177 టీఎమ్‌సీలు మళ్లించాల్సి ఉంటుంది. ఆ మేరకు నీటి మళ్లింపువల్ల దిగువన ఉన్న సీతారామ ఎత్తిపోతలపై ఎలాంటి ప్రభావం ఉంటుందో తెలంగాణ ప్రభుత్వం అధ్యయనం చేయాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టి ప్రస్తుతానికి పక్కనపెట్టిన కంతనపల్లి పథకానికి కార్యరూపం ఇస్తే ఎలా ఉంటుందో చూడాలి. కంతనపల్లి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజీని పునరాకృతిలో భాగంగా తుపాకుల గూడెం వద్దకు మార్చి ప్రభుత్వం చేపట్టింది. మిగిలిన పథకం అలాగే ఉంది.

స్వరూపమిది...

- బ్యారేజీ నిర్మాణ ప్రాంతం: గోదావరి నదిపై అకినేపల్లి వద్ద
- మొత్తం నీటి మళ్లింపు: 247 టీఎమ్‌సీలు
- రోజూ 2.2 టీఎమ్‌సీలు ■ కాలువ దూరం: 1263 కి.మీ.
- జూన్-అక్టోబరు మధ్య 147 రోజుల్లో
- సాగులోకి వచ్చే ఆయకట్టు: 11,16,200 హెక్టార్లు
- అదనంగా కావేరికి 57 టీఎమ్‌సీల మళ్లింపు
- నిర్మాణ వ్యయం అంచనా: రూ.45,049 కోట్లు
- అవసరమైన విద్యుత్తు: 1480 మెగావాట్లు


కావలసింది కార్యాచరణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ టేల్‌పాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రతిపాదించిన అకినేపల్లి-నాగార్జునసాగర్ ప్రత్యామ్నాయానికి దుమ్ముగూడెం-టేల్‌పాండ్‌కు పెద్దగా తేడా లేదు. ఈ కారణంగా ఇటీవల నీటిపారుదల శాఖ నిర్వహించిన సమావేశంలో తెలంగాణలోని సీనియర్ ఇంజినీర్లందరూ తాజా ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఈ అనుసంధానం ద్వారా మళ్లించే 247 టీఎమ్‌సీల్లో తెలంగాణలో 50 టీఎమ్‌సీలకు మించి వినియోగించుకొనే అవకాశం లేదు. భవిష్యత్తులో గోదావరి నీటిపైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. ఏ రకంగా చూసినా ఈ ప్రతిపాదన సరైంది కాదనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనికి ప్రత్యామ్నాయంగా కంతనపల్లి వద్ద నుంచి చేపడితే తెలంగాణకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయమూ వినిపించింది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం తమిళనాడుకు ప్రత్యేకించి కావేరికి నీటిని మళ్లించడం. ఇది జరగాలంటే తెలంగాణ తక్కువ నీటిని వినియోగించుకోవాలి. కాబట్టి ఈ ప్రతిపాదనపట్ల తెలంగాణ ఆచితూచి వ్యవహరించాలి. ఆంధ్రప్రదేశ్ దీనిపట్ల సానుకూలంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో, తమ రాష్ట్రంలో భూసేకరణ ఏమీ లేకుండానే నాగార్జునసాగర్ వరకు, అక్కడి నుంచి సోమశిల వరకు నీళ్లొస్తాయి. చేయాల్సిందల్లా నాగార్జునసాగర్ నుంచి సోమశిల వరకు 393 కి.మీ. దూరం 20వేల క్యూసెక్కుల ప్రవాహానికి తగ్గట్లుగా కాలువ తవ్వకానికి భూసేకరణ చేయాల్సి ఉంటుంది. ఇందులో 202.75 కి.మీ సాగర్ కుడికాలువకు సమాంతరంగానే ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ వరకు ఇదే ప్రధాన సమస్య. అయితే కుడికాలువ ఆయకట్టుకు, కొత్త ఆయకట్టుకు నీరందడం ద్వారా శ్రీశైలం మీద ఒత్తిడి తగ్గుతుందన్నది ఆంధ్రప్రదేశ్ ఆలోచన. గోదావరిపై కొత్తగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులతో పాటు అకినేపల్లి వద్ద రోజూ 25వేల క్యూసెక్కుల నీటిని మళ్లిస్తే జూన్, అక్టోబరు నెలల్లో పోలవరంపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్న దానిపై అధ్యయనం అవసరమని భావిస్తోంది. అధికారికంగా తమ వైఖరి స్పష్టం చేయాల్సి ఉంది. మొత్తమ్మీద ఛత్తీస్‌గఢ్, తెలంగాణల నిర్ణయంపై అకినేపల్లి-నాగార్జునసాగర్ అనుసంధానం ఆధారపడి ఉంది.

నదుల అనుసంధానంపై దశాబ్దాల తరబడి చర్చలు, సంప్రతింపులు, అధ్యయనాలే తప్ప అవి కార్యరూపం దాల్చడం లేదు. కార్యాచరణ ప్రారంభమైనప్పుడే ఫలితం ఉంటుంది. అనుసంధానాల్లో అతి చిన్నది కెన్-బెట్వా. దీన్ని 2009లో అప్పటి కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. అన్ని అనుమతులూ వచ్చాయి. నిరుడు జూన్‌లో పెట్టుబడి అనుమతీ లభించింది. ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని వెనకబడిన ప్రాంతాలు ప్రత్యేకించి బుందేల్‌ఖండ్‌కు ప్రయోజనం కలిగించే ఈ ప్రాజెక్టుపై గతంలో జలవనరుల శాఖ మంత్రిగా ఉమాభారతి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ పథకాన్ని 'ఫాస్ట్‌ట్రాక్'లో పెట్టాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాజెక్టు మాత్రం ప్రారంభం కాలేదు. చివరకు రెండు దశల్లో పథకాన్ని చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ప్రతి రెండు నెలలకోసారి నదుల అనుసంధానంపై జరిగే ప్రత్యేక కమిటీ సమావేశంలో దీని గురించి చర్చిస్తూనే ఉన్నారు. వ్యవహారం కాగితాల దశ దాటడమే లేదు. ఈ పరిస్థితిలో మార్పు వస్తేనే నదుల అనుసంధానంపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది.

– ఎం.ఎల్.నరసింహారెడ్డి

జనగణమన... జయహే



కులదీప్ నయ్యర్

నేను సియాల్‌కోట్‌లో ఉన్నప్పుడు కంటోన్మెంట్‌లోని సినిమాహాళ్లకు తరచుగా వెళ్లేవాణ్ని. (సియాల్‌కోట్ ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది). సినిమా అయిపోయాక 'గాడ్ సేవ్ ద కింగ్...' అనే బ్రిటిష్ జాతీయగీతం వేసేవారు. దాంతో అందరూ లేచి నిలబడాల్సి వచ్చేది. బ్రిటిష్ జాతీయ గీతాన్ని గౌరవిస్తూ లేచి నిలబడటం నాకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఆ గీతం వేస్తున్నప్పుడు సినిమాహాలు తలుపులు మూసేవారు కాదు. నిలబడాలా లేదా అన్నది మన ఇష్టం. తప్పనిసరేమీ లేదు. అయినా సరే, అందరూ నిలబడుతున్నారా లేదా అని గమనించడానికి కొంతమంది ఉండేవారు. దాంతో ఇష్టం ఉన్నా లేకున్నా లేచినిలబడక తప్పేది కాదు. తమ జాతీయగీతం వేస్తున్నప్పుడు అందరూ తప్పనిసరిగా లేచి నిలబడాలని బ్రిటిష్ పాలకులు నిబంధనలేవీ విధించలేదు. నిలబడనివారిమీద చర్యలేవీ చేపట్టలేదు. అంతవరకు నయమే. మానవహక్కుల పట్ల వారికి గౌరవభావం ఉండేదనే అనుకోవచ్చు. భారతీయ సినిమా ప్రదర్శనల చివర్లో బ్రిటిష్ జాతీయ గీతం వేసే పద్ధతికి క్రమంగా తెరపడింది. రాజును, రాణిని ప్రేక్షకులు అగౌరవపరచే పరిస్థితి తలెత్తక ముందే ఆ పరిణామం చోటుచేసుకొంది.

సినిమా థియేటర్లలో జాతీయ గీతం విషయంలో న్యాయస్థానాలు ఇదివరకు పలుమార్లు జోక్యం చేసుకొన్నాయి. సినిమా ప్రారంభానికి ముందు జాతీయగీతం వేయడాన్ని తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర అసెంబ్లీ 2003లో ఆదేశం జారీచేసింది. 1960లో సినిమా చివర్లో జాతీయ గీతం వేసేవారు. కానీ, ప్రజలు పట్టించుకొనక, సినిమా అయిపోగానే బయటికి వెళ్లిపోతుండటంతో ఆ పద్ధతికి స్వస్తిచెప్పారు. జాతీయ గీతం తప్పనిసరిగా పాడాలని కాని, జాతీయగీతం వచ్చినప్పుడు లేచి నిలబడాలని కాని ప్రస్తుత చట్టాలు ఏ వ్యక్తినీ నిర్బంధం చేయడంలేదు. అలా చేయనందుకు శిక్షించడంలేదు. జాతీయ గౌరవానికి భంగం కలిగించకుండా నిరోధించడానికి ఉద్దేశించిన 1971నాటి చట్టం ప్రకారం- జనగణమన పాడకుండా ఉద్దేశపూర్వకంగా నిరోధిస్తే లేదా ఈ గీతం పాడేందుకు గుమికూడినవారికి అవరోధాలు కల్పిస్తే మూడేళ్ల వరకు జైలుశిక్షకాని, జరిమానా కాని లేదా రెండూకాని విధించే అవకాశం ఉంది.

జాతీయ గీతం అధికారిక నిడివి 52 సెకన్లు. కానీ సినిమా హాళ్లలో వేసే జాతీయ గీతం నిడివి అంతకన్నా ఎక్కువగా ఉంటోంది. 2015లో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెలువరించిన ఆదేశం ప్రకారం- జాతీయగీతం పాడినప్పుడు లేదా వేసినప్పుడు ప్రేక్షకులు లేచి నిలబడాల్సి ఉంటుంది. సినిమా వేస్తున్నప్పుడు న్యూస్‌రీల్ లేదా డాక్యుమెంటరీలో భాగంగా జాతీయగీతం వచ్చినప్పుడు మాత్రం ప్రేక్షకులు లేచి నిలబడాల్సిన అవసరం



జాతీయ గీతాన్ని గౌరవిద్దాం

లేదు. దానివల్ల సినిమా ప్రదర్శనకు ఆటంకం కలుగుతుంది. జాతీయ గీతానికి గౌరవం బదులు గందరగోళమే ఏర్పడుతుంది. జాతీయగీతం ఆలపించడం, రికార్డు వేయడం ఎప్పుడు ఎలాగన్న విషయాన్ని చట్టం ప్రజల విచక్షణకే వదిలిపెట్టింది. ఎవరికోసం (ప్రధానమంత్రి కోసం కాకుండా రాష్ట్రపతి కోసం) జాతీయ గీతం వేయాలి, ప్రజలు ఎప్పుడు సామూహికంగా జాతీయ గీతం ఆలపించాలన్నదానిమీద కొన్ని నిర్దిష్ట నిబంధనలూ ఉన్నాయి. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల ప్రకారమైతే సినిమా ప్రదర్శనకు ముందు జాతీయగీతం వేయడం ఇకమీదట తప్పనిసరి కాదు. ఈ మేరకు తన ఆదేశాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల సవరించింది. అంతకుముందు, 2017 అక్టోబరులో దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరిగినప్పుడు- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ తన అభిప్రాయాన్ని కుండ బద్దలుకొట్టారు. 'ప్రజలు లేచి నిలబడి తమ దేశభక్తిని చాటిచెప్పాల్సిన అవసరం ఏముంది? వారు సినిమా థియేటర్‌కు వెళ్లేది పక్కా వినోదం కోసం. సమాజానికి వినోదం కావాలి' అని ఆయన అన్నారు. 2016 నవంబరుకు ముందు సినిమాహాళ్లలో జాతీయగీత ప్రదర్శన తప్పనిసరి కాదు. ఈ మేరకు అప్పటి పరిస్థితినే పునరుద్ధరించే విషయాన్ని పరిశీలించవచ్చునంటూ ప్రభుత్వం న్యాయస్థానానికి తెలిపింది. దాంతో న్యాయస్థానం తన ఆదేశాన్ని సవరించింది. జాతీయ గీతాలాపన అంశం పలుమార్లు వివాదాస్పదంగా మారింది. కొన్నేళ్ల క్రితం జాతీయగీతం ఆలపించనందుకు కేరళలోని ఒక పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులను బహిష్కరించారు. తరవాత సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఆదేశంపై వారిని తిరిగి చేర్చుకొన్నారు. తమ దేవుడైన యెహోవాను ప్రార్థించే సందర్భంలో మినహాయిస్తే, మరే ఇతర క్రతువులో పాల్గొనేందుకు తమ మతం అనుమతించడం లేదంటూ ఆనాడు ఆ విద్యార్థులు జాతీయగీతం ఆలపించేందుకు నిరాకరించారు. జాతీయగీతం పాడి తీరాల్సిందేననడానికి ఎలాంటి చట్టపరమైన నిబంధన లేదని, జాతీయగీతం పాడినప్పుడు గౌరవ సూచకంగా లేచి నిలబడిన వ్యక్తి, మిగతావారితో కలిసి స్వయంగా గీతాలాపన చేయకపోవడం జాతీయగీతం పట్ల అపచారమేమీ కాదని సుప్రీంకోర్టు ఆ కేసులో స్పష్టం చేసింది. జాతీయగీతం ఆలపించినప్పుడు లేచి నిలబడకపోవడం జాతీయగీతాన్ని అగౌరవపరచడం కిందకు వస్తుందా లేదా అన్నది మాత్రం న్యాయస్థానం విడమరచలేదు. 'మన సంప్రదాయం సహనాన్ని బోధిస్తోంది. మన తత్వశాస్త్రం సహనాన్ని ప్రవచిస్తోంది. మన రాజ్యాంగం సహనం పాటిస్తోంది. దీన్ని నీరుగారకుండా చూద్దాం'- సర్వోన్నత న్యాయస్థానం తన తీర్పులో ఇచ్చిన సందేశమిది. మనమందరం సహనంతో ఉందాం. జాతీయగీతాన్ని గౌరవిద్దాం. అదే మన ధర్మం!

(రచయిత– ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్)

ఈనాడు లేఖలు

పరిశ్రమకే నష్టం

ప్రస్తుతం వసూలు చేస్తున్న సినిమా టికెట్ రేటు అధికంగా ఉందని సామాన్యులు భావిస్తున్న నేపథ్యంలో, ధర పెంపుదలకు ఉమ్మడి హైకోర్టు అనుమతి ఇవ్వడం గోరుచుట్టుపై రోకటి పోటు! సినిమా బాలేదన్న ప్రచారం సామాజిక మాధ్యమాల ద్వారా ఊపందుకోనకముందే నష్టాల నుంచి బయటపడటానికి టికెట్ ధర పెంపుదల వారికి అవకాశాన్నిస్తోంది. నిర్మాణ వ్యయం నియంత్రించుకోవడానికి సినీ పరిశ్రమ వర్గాలు తీసుకొంటున్న చొరవ దాదాపు శూన్యం. అధిక టికెట్ల ధరే పైరసీకి కారణమవుతున్నాయి. చక్కని కథాంశంతో తీస్తున్న చిన్న సినిమాలు విజయవంతం అవుతున్నాయి. నటీనటులు, సాంకేతిక నిపుణుల కోట్ల రూపాయల పారితోషికాలే రెండు సినిమాలకు ఉన్న తేడా. కొందరి అనుచిత వ్యాపార దృక్పథం అంతిమంగా చిన్న సినిమాలపట్ల శాపమవుతోంది. ఈ అంశాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోవాలి. టికెట్ ధర పెంపుదల సినిమా పరిశ్రమకు మేలుకన్నా కీడే ఎక్కువ చేస్తుంది. ఖర్చులను నియంత్రించుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకునేలా చక్కటి చిత్రాలు చేయడమే సినిమా పరిశ్రమ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తుంది.

- యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం, తూర్పుగోదావరిజిల్లా

చూసిరాతకు అసలు మందు

పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో చూసిరాతల పెడపోకడలకు తెరదించడానికి ప్రశ్నపత్రాల 'జంబ్లింగ్' విధానం తీసుకురావాలి. పరీక్షల్లో చూసిరాతపై హైకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తంచేసింది. పోటీ పరీక్షల తరహాలో ప్రశ్నపత్రాలను నాలుగు రకాలుగా రూపొందించి ఒక్కొక్కరికి ఒక్కో ప్రశ్న పత్రం ఇవ్వాలి. ఈ పద్ధతి అమలు చేయాలని విద్యావేత్తలు ఎప్పటినుంచో సూచిస్తున్నా, ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా చూసిరాతలకు కళ్లెం వేయాలన్న ఆలోచనా సరికాదు. దీనివల్ల ప్రభుత్వంపై అనవసరపు ఆర్థికభారం పడుతుంది. అందుకు అవసరమైన నిధులూ తమవద్ద లేవని విద్యాశాఖ హైకోర్టుకు నివేదించింది. కాబట్టి, ప్రశ్నపత్రాల కూర్పు, జంబ్లింగ్ విధానాల ద్వారా చూసిరాతల ధోరణికి అడ్డుకట్ట వేయడానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- వాండ్రంగి కొండలరావు, పొందూరు, శ్రీకాకుళంజిల్లా

చేయూత తక్షణావసరం

రాష్ట్ర విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థికసాయం అందజేయడంలో కేంద్రం నుంచి ఆశించినమేర చేయూత అందడం లేదు. ప్రత్యేక హోదా అన్నారు. ప్యాకేజీ అన్నారు. ఆచరణలో అవేవీ కార్యరూపంలోకి రానేలేదు. పథకాలు ఆలస్యమయ్యే కొద్దీ ఆర్థిక భారమూ అధికమవుతుంది. దీనివల్ల రాష్ట్రానికి సమస్యలు పెరుగుతాయే తప్ప తగ్గవు. అందువల్లే ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిసి తాజా పరిస్థితులను వివరించారు. సమావేశం సుహృద్భావంగా జరిగిన నేపథ్యంలో రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, కేంద్ర విద్యాసంస్థలు, ఎయిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాలు చురుకందుకోవాలి. ఆర్థిక లోటు భర్తీకి చర్యలు చేపట్టాలి. అప్పుడే రాష్ట్రం గాడిలో పడుతుంది.

- బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచర్ల, కర్నూలుజిల్లా

ఉషాకిరణాలు

సూర్యుడు ఆది దేవుడు. జ్యోతి స్వరూపుడు. జీవకోటికి నిత్యమూ దర్శనమిస్తున్న ప్రత్యక్ష దైవం. సకల ప్రాణులకు ప్రభాకరుడే జీవశక్తిని, చైతన్యదీప్తిని ప్రసాదిస్తున్నాడు. అందుకే ఆయనను పాలన కర్త శ్రీమన్నారాయణమూర్తితో పోల్చుకొని 'సూర్యనారాయణుడు' అని పిలుచుకుంటారు భక్తులు. భానుడు కాలస్వరూపుడు. కాల విభాగాలైన మాసాలకు, అయనాలకు, రుతువులకు, గ్రహాలకు, శీతోష్ణాదులకు ఆయనే కారణభూతుడు. సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారని; సమస్త జీవజాలానికి, సృష్టివిధానానికి వారే ఆధారమని 'భవిష్య పురాణం' చెబుతోంది.

నవగ్రహాల్లో సూర్యుడే మొదటివాడు. కాలచక్రాన్ని ఆయనే తిప్పుతున్నాడు. సూర్య గతి కారణంగా, కాలం నిరాటంకంగా ముందుకు సాగుతోంది. సూర్యారాధన దేహసంబంధ దోషాల్ని తొలగిస్తుందని 'బ్రహ్మాండ పురాణం' విశదీకరిస్తోంది.

భాస్కరుడు ఉదయిస్తూ చీకటిని తరిమికొడతాడు. ఇది లోకం ప్రత్యక్షంగా చూస్తున్న నిత్యసత్యం. ఉషాకిరణాలు సంపదను, దీర్ఘాయువును, రక్షణను కలిగిస్తాయి. భాను కిరణాల ద్వారా మానసిక నిర్మలత ప్రాప్తిస్తుంది. జీవరాశి అంతటికీ ఆయనే హితుడు కాబట్టి, 'మిత్రుడు' అని సంబోధించింది రుగ్వేదం. ఉపాసన వల్ల వర్చస్సు, దృష్టి, జ్ఞానం లభిస్తాయని 'శుక్ల యజుర్వేదం' మంత్రాలు చెబుతాయి. ఆదిత్యుడు ఆరోగ్యాన్ని, తేజస్సును,

అంతర్యామి

బలాన్ని ప్రసాదిస్తాడని సామవేదం పలుకుతోంది. పలు బాధల్ని నివారిస్తాడంటోంది అధర్వణ వేదం.

ప్రతిరోజూ ఉదయాన స్నానం చేసి, సూర్యుణ్ని ధ్యానిస్తూ జలధారతో అర్ఘ్యమివ్వాలి. అది సప్తవిధ పాపాలూ సమసిపోయేలా చేస్తుందంటారు. మానవాళికి ఆయన భౌతికంగా ప్రేరణశక్తిని కలిగిస్తాడని గాయత్రీ మంత్రం వర్ణిస్తుంది. సూర్యశక్తి అపారం. విశ్వమానవాళికి కావాల్సినంత వర్షం లభించడానికి కారకుడై 'ఘన వృష్టి' అని ఖ్యాతి పొందాడు. లోకులు వర్షం కురిసినప్పటి తడిలోనే ఉండిపోతే, క్రిమికీటకాదులు ప్రబలి వ్యాధులు వ్యాపిస్తాయి. అలా కాకుండా తగినంత ఎండనిచ్చి రోగాల బారినుంచి వారిని కాపాడుతూ 'ఆతపి' అనే పేరు గడించాడు. పాపపుణ్యాలన్నింటికీ లోకసాక్షి అయ్యాడు.



ప్రభాకరుడికి 'వెలుగు నిధి' అనే పేరుంది. వెలుగు లేకుంటే, అంతా చీకటిమయమే. విజ్ఞానానికి వెలుగు, అజ్ఞానానికి చీకటి ప్రతీకలు. విద్య అంటే- చదవటం, రాయటం మాత్రమే కాదు. విజ్ఞానమే విద్య. అందరూ వెలుగునే కోరుకోవాలి. ఆ బాటలోనే పయనించాలి!

– యం.సి.శివశంకరశాస్త్రి

'ఆకర్షణీయ'మేదీ?

- 3 నగరాల్లో మూలుగుతున్న రూ.1200 కోట్లు
- ఖర్చు చేసింది 20శాతమే

ఈనాడు - అమరావతి

ఆకర్షణీయ నగరాల (స్మార్ట్ సిటీ) అభివృద్ధిలో ప్రత్యేక వాహక సంస్థ (ఎస్పీవీ) ఏర్పాటుకే ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం తీసుకోవడంతో గడువులోగా ప్రతిపాదిత పనుల పూర్తి చేయడంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మొదటి దశలో విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, రెండో దశలో అమరావతిని కేంద్ర ప్రభుత్వం ఆకర్షణీయ నగరాలుగా ఎంపిక చేసింది. 2015-16 నుంచి 2019-20 మధ్య ఐదేళ్లపాటు అమలులో ఉండే ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం అమరావతి మినహా మొదటి విడతలో ఎంపికైన ఒక్కో నగరానికి రూ.200 కోట్ల చొప్పున నిధులు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా మరో రూ.200 కోట్ల చొప్పున అందించింది. 3 నగరాల్లో అభివృద్ధి కోసం రూ.1200 కోట్లు సిద్ధంగా ఉన్నా వీటి ఖర్చు గత మూడేళ్లలో 20శాతం దాటకపోవడం గమనార్హం. నిధుల ఖర్చుపై కేంద్ర మార్గదర్శకాల మేరకు కంపెనీ చట్టం కింద ఆకర్షణీయ నగరాల్లో తర్జనభర్జనల తరువాత ఎస్పీవీలను ఏర్పాటు చేశారు. కలెక్టర్లు ఛైర్మన్‌గా, కమిషనర్లతోపాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వశాఖల అధికారులు మరో 14 మంది డైరెక్టర్లుగా ఇందులో ఉన్నారు. తాజాగా వీటిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాతినిధ్యం పెరిగేలా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ, పట్టణ, గ్రామీణ ప్రణాళిక విభాగ సంచాలకులను చేర్చారు. ఎస్పీవీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమావేశమై నిర్వహిస్తున్న పనులపై సమీక్ష, కొత్తగా చేపట్టే పనులపై చర్చించాల్సి ఉండగా వీటిని అరకొరగా నిర్వహిస్తున్నారు. ఇందులో డైరెక్టర్ల హాజరు పూర్తిగా లేకపోవడంతో కీలక నిర్ణయాలు తీసుకోలేక నిధుల ఖర్చులో జాప్యమవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన నిధులపై వినియోగ ధ్రువీకరణ పత్రాలు పంపితే కేంద్రం రెండో విడత నిధులు కేటాయించే అవకాశాలున్నాయి.



విశాఖ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు



ఆకర్షణీయ నగరాల అభివృద్ధి కోసం రూపొందించిన నమూనా చిత్రం

సలహాదారు చేతుల్లోనే ...

ఆకర్షణీయ నగరాల్లో పనుల ప్రతిపాదన, వీటికి సమగ్ర ప్రాజెక్టు తయారీ (డీపీఆర్), టెండర్లు వంటి ప్రక్రియను ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ పేరుతో సలహాదారుకు అప్పగించారు. వివిధ దేశాలకు చెందిన ఈ సలహాదారులకు రుసుముల రూపంలో ఐదేళ్లలో రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు చెల్లిస్తారు. వీటి నియామకం కోసమే ఏడాదికిపైగా సమయం పట్టింది. ఆకర్షణీయ ప్రాజెక్టుల అమలులో నగరపాలక సంస్థ ఇంజినీర్ల ప్రమేయం అంతంత మాత్రమే. క్షేత్ర స్థాయిలో పనుల పర్యవేక్షణకు పరిమితం చేస్తున్నారు. స్థానిక అవసరాలపై అవగాహన లేకపోయినా కన్సల్టెన్సీలు ప్రతిపాదించిన పనులను ఎస్పీవీ సమావేశాల్లో అనుమతిస్తున్నారు. పాలకవర్గాలున్న చోట మేయరు, ఎమ్మెల్యేలకు ఎస్పీవీలో డైరెక్టర్లుగా చోటు కల్పించాలన్న డిమాండు ఉన్నా కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అనుమతించడం లేదు. వీరి ప్రాతినిధ్యంతో ప్రజలకు అవసరమైన ముఖ్యమైన పనులు చేపట్టే వీలుంటుందని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

చేస్తున్న పనులివీ...

విశాఖపట్నంలో ఒక మెగావాట్ సౌర విద్యుత్తు ఉత్పత్తి కోసం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ప్యానళ్లు ఏర్పాటు చేశారు. ఒకే స్తంభం నుంచి నాలుగైదు రకాల సేవలు అందేలా 3 స్మార్ట్ పోళ్లు ఏర్పాటయ్యాయి. డిజిటల్ తరగతుల ఏర్పాటు కోసం తాజాగా టెండర్లు పిలిచారు. తిరుపతిలో ఈ-రిక్షాలు, ఈ-తరగతులు, ఈ-ఆరోగ్య కార్యక్రమాల కోసం టెండర్లు ఇటీవలే ఖరారు చేశారు. కాకినాడలోనూ దాదాపు ఇదే పరిస్థితి. స్మార్ట్ రోడ్లు, సౌర విద్యుత్తు వంటి అనేక ముఖ్యమైన పనులకు టెండర్లు పిలిచారు. ఇంకొన్ని టెండర్ల దశలో ఉన్నాయి.

కొత్త పార్టీపై దినకరన్ నిర్ణయం నేడు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులోని ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ కొత్త పార్టీ ప్రారంభంపై బుధవారం నిర్ణయం తీసుకోనున్నారు. గతేడాది డిసెంబరులో జరిగిన ఆర్కేనగర్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో ఆయన గెలిచి సంచలనం సృష్టించారు. ఒకవేళ ఆయన పార్టీ పెడితే దానిపేరు 'అమ్మా ద్రావిడ మున్నేట్ర కళగం' (అమ్మా డీఎంకే)గా ఉంటుందనే ప్రచారం సాగుతోంది. అన్నా డీఎంకే నుంచి శశికళ, ఆమె అక్క కుమారుడు టీటీవీ దినకరన్‌లను బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ సర్వసభ్య సమావేశంలో ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వర్గం గతంలో తీర్మానం ఆమోదించింది. ఆ తర్వాత దినకరన్ జోరు పెంచారు. జయలలిత మృతితో ఖాళీయైన ఆర్కేనగర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో 40 వేల భారీ ఆధిక్యంతో గెలిచారు. దినకరన్ దూకుడును తమిళనాడులోని అన్ని పార్టీలూ నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన చేయబోయే ప్రకటనపై అంతటా ఆసక్తి నెలకొంది.

ఆర్డీఎస్ పనుల పూర్తికి చొరవ చూపండి

- ఏపీ మంత్రి దేవినేనికి హరీశ్‌రావు లేఖ

ఈనాడు, హైదరాబాద్: అపరిష్కృతంగా ఉన్న రాజోలి బండ నీటి మళ్లింపు పథకం(ఆర్డీఎస్) ఆధునికీకరణ పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలంటూ ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావుకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మంగళవారం లేఖ రాశారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రైతుల ప్రయోజనాలు ముడిపడి ఉన్న ఆర్డీఎస్ పనులను ఈ ఏడాది జులై వరకు పూర్తిచేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని ఈ నెల 4న తెలంగాణ పర్యటనకు వచ్చిన కర్ణాటక మంత్రి ఎంబీ పాటిల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి మూడు రాష్ట్రాల మంత్రుల సమావేశం నిర్వహించాలని ఆయన సూచించారన్నారు. ప్యాకేజీ-1లో ఆర్డీఎస్ ఆనకట్ట ఆధునికీకరణ పనులు సుదీర్ఘ కాలంగా ముందుకు సాగడంలేదని.. అనేక సార్లు సీఈల స్థాయిలో సమావేశాలు నిర్వహించినా ముందడుగు పడలేదన్నారు. కర్ణాటకతో ఉన్న సమస్యలు పరిష్కరించుకుని రైతులకు న్యాయం చేసేందుకు చొరవ చూపాలంటూ దేవినేనిని కోరారు. మూడు రాష్ట్రాల మంత్రులతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న సమావేశానికి తేదీలను ప్రకటించాలని ఆ లేఖలో కోరారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

పోలీసుల అదుపులో ఆదివాసీలు



మావోయిస్టు మృతదేహం

చర్ల, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లా పరిధిలోని జిలిమిలీ అటవీ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు మృతి చెందారు. ఈ ఘటనలో మావోయిస్టులకు సంబంధించిన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు సుకుమా జిల్లా కిష్టారం అటవీ ప్రాంతం ఎల్కనగూడెం సమీపంలో లోలెవల్ చప్టాను మావోయిస్టులు పేల్చివేశారు. ఇదే జిల్లా పరిధిలోని తొట్టెమడుగు అటవీ ప్రాంతంలో కుంట పనులు చేస్తున్న 20 మంది ఆదివాసీలను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పనులు చేస్తున్న తమ వారిపై పోలీసులు కాల్పులు జరిపారని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో దూది దూలయ్య అనే వ్యక్తి చేతికి గాయాలయ్యాయన్నారు.

తమిళనాట సముద్రంలో మునిగి నలుగురి మృతి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులోని నాగపట్టణం సమీప వేదారణ్యం వద్ద సముద్రంలో మునిగి నలుగురు యువకులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం 'తై అమావాస్య' కావడంతో కొందరు యువకులు సముద్రంలో స్నానానికి వెళ్లి, అలల ఉద్ధృతిలో చిక్కుకున్నట్లు డీఎస్పీ దేశ్‌ముఖ్ శేఖర్ సంజయ్ చెప్పారు. భద్రతా సిబ్బంది పది మందిని రక్షించి వేదారణ్యం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. నలుగురు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. ఇంకా ఎవరైనా కొట్టుకుపోయారేమోనని గాలిస్తున్నామని డీఎస్పీ చెప్పారు. వేదారణ్యేశ్వరర్ ఆలయ సమీపంలోని సిద్ధర్ ఘాట్‌లో ఏటా వేల సంఖ్యలో భక్తులు తై అమావాస్య సందర్భంగా స్నానమాచరిస్తుంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు

- విశాఖపట్నం వేదికగా అంతర్జాతీయ కార్యక్రమం
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖలో ఎలీప్, దక్షిణాసియా మహిళాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నేటి నుంచి అంతర్జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు ప్రారంభం కానుంది. మహిళల్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి వీలుగా పలు రంగాల్లో విశిష్ట విజయాలను నమోదు చేసుకున్న పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు, నిపుణులు, నిష్ణాతులు కార్యక్రమానికి హాజరవుతున్నారు. 'ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఇండస్ట్రియలైజేషన్' అంశంపై అంతర్జాతీయ సదస్సుగా నిర్వహించబోతున్న ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై బుధవారం ఉదయం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా దేశాలతోపాటు సార్క్ దేశాల నుంచి సైతం పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు సదస్సుకు హాజరుకానున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా విశాఖ శివారు గిరిజాలలో ఏర్పాటుచేస్తున్న పారిశ్రామికవాడను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఎలీప్ ఏర్పాటుచేసి 25 సంవత్సరాలైన సందర్భంగా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి వీలుగా ఎలీప్ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా 12 సాంకేతిక చర్చలు, 54 మంది నిపుణులు ప్రసంగిస్తారు. ప్రస్తుత సదస్సులో మహిళలు విదేశాల్లో అందుబాటులో ఉన్న వ్యాపారావకాశాలను అందిపుచ్చుకుని రాణించే అంశంపై ప్రధానంగా దృష్టిసారిస్తారు.



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఈస్ట్రన్‌ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ దినేష్‌త్రిపాఠి

ఈస్ట్రన్ ఫ్లీట్ కమాండర్‌గా దినేష్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఈస్ట్రన్ నేవల్ ఫ్లీట్ కమాండర్‌గా రియర్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ఈనెల 15న నియమితులయ్యారు. ఆయన విద్యాభ్యాసం ఖడక్‌వాస్లా ఎన్డీయే కళాశాలలో, డిఫెన్స్ సర్వీసు స్టాఫ్ కళాశాల వెల్లింగ్‌టన్‌లో కొనసాగింది. యూఎస్‌లో అత్యున్నత ప్రమాణం గల నేవల్ కోర్సును పూర్తి చేశారు. అంతర్జాతీయ పురస్కారం 'రాబర్ట్‌బాట్‌మేన్' కైవసం చేసుకున్నారు. గతంలో ఈయన నేవీకి చెందిన ఐఎన్ఎస్ త్రిశూల్, ఐఎన్ఎస్ వినాశ్, ఐఎన్ఎస్ క్రిచ్‌లో సేవలు అందించారు. నేవల్‌బేస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇప్పటివరకు ఫ్లీట్ కమాండర్‌గా పని చేసిన రియర్ అడ్మిరల్ దాసుగుప్తా నుంచి బాటన్‌ని తీసుకుని పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నావికులు అందించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అకినేపల్లిపై ఆచితూచి!

- తెలంగాణ ప్రయోజనాలకు ఇబ్బంది లేకపోతే సానుకూలం
- భాగస్వామ్య రాష్ట్రాలతో నేడు మంత్రి గడ్కరీ సమావేశం

ఈనాడు - హైదరాబాద్

గోదావరిపై అకినేపల్లి నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని మళ్లించే అనుసంధానంపై తెలంగాణ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించనుంది. తెలంగాణకు ఉన్న కేటాయింపులు, ప్రయోజనాలు దెబ్బతినకుండా చేపడితే తమకేమీ అభ్యంతరం లేదన్న అభిప్రాయాన్ని బుధవారం జలవనరుల మంత్రిత్వశాఖ వద్ద జరిగే సమావేశంలో వ్యక్తం చేయనున్నట్లు తెలిసింది. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరిపై అకినేపల్లి వద్ద బ్యారేజి నిర్మించి నాగార్జునసాగర్-సోమశిల-గ్రాండ్ ఆనకట్ట అనుసంధానం ద్వారా 247 టీఎంసీల నీటిని వినియోగించుకొనేలా జాతీయ జల అభివృద్ధి సంస్థ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. దీనిపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ భాగస్వామ్య రాష్ట్రాలతో బుధవారం దిల్లీలో సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, అంతర్ రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీర్ నరసింహారావు హాజరుకానున్నారు. కేంద్ర ప్రతిపాదనపై ఎలా వ్యవహరించాలన్న దానిపై ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా చర్చించినట్లు తెలిసింది. ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించకుండా ఆచితూచి వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ట్రైబ్యునల్ ప్రకారం తెలంగాణకు గోదావరిలో 954 టీఎంసీల కేటాయింపు ఉంది. ఈ నీటి వినియోగానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా, దిగువన చేపట్టిన సీతారామ ఎత్తిపోతల తదితర పథకాలకు నష్టం లేకుండా అనుసంధానం చేపడితే అభ్యంతరం లేదన్న అభిప్రాయాన్ని దిల్లీ సమావేశంలో వ్యక్తం చేయనున్నట్లు సమాచారం. అదనంగా ఎంతో కొంత ప్రయోజనం కలిగేలా ఉండాలని, మిగులు జలాలు, నీటి లభ్యతపై జాతీయ జల అభివృద్ధి సంస్థ అధ్యయనంపై వాప్కోస్ లేదా మరో సంస్థతో పరిశీలింపచేయమని కోరనున్నట్లు తెలిసింది. అకినేపల్లి వద్ద నుంచి కాకుండా మరో ప్రత్యామ్నాయ స్థలం వద్ద నుంచి అనుసంధానం చేపట్టే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరే అవకాశం ఉంది. ప్రతిపాదనను వ్యతిరేకించకుండానే రాష్ట్రం అభిప్రాయాలు చెప్పడం, అదనంగా ప్రయోజనం కలుగుతుందనుకుంటే సానుకూలంగా పరిశీలించడం అన్న పద్ధతిలో పోవాలన్నది ప్రభుత్వ అభిప్రాయంగా ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.

సానుకూలంగా ఆంధ్రప్రదేశ్

అకినేపల్లి బ్యారేజీ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ సానుకూలంగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ టేల్‌పాండ్‌కు తాజా ప్రతిపాదన ప్రత్యామ్నాయంగానే ఏపీ భావిస్తోంది. టేల్‌పాండ్ పథకంలో 165 టీఎంసీలు మళ్లిస్తే, ప్రస్తుతం 247 టీఎంసీలను మళ్లించేలా ప్రతిపాదించారు. పెరిగిన నీటిని తమిళనాడుకు మళ్లిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అంతర్ రాష్ట్ర జలవనరుల విభాగం సాంకేతిక సలహాదారు రామకృష్ణ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, హైడ్రాలజీ విభాగం చీఫ్ ఇంజినీర్ కుమార్ దిల్లీ సదస్సుకు హాజరుకానున్నారు. నదుల అనుసంధానంపై గతంలో జరిగిన సమావేశాల్లో కూడా ఏపీ సానుకూలత వ్యక్తం చేసింది.

మార్కెట్ విలువ నిర్ధారణకు చర్చించండి

- అన్నవరప్పాడు భూవివాదంపై రైల్వేకు హైకోర్టు స్పష్టం

ఈనాడు, హైదరాబాద్: ఒంగోలు రైల్వే స్టేషన్ సమీపంలోని అన్నవరప్పాడు భూవివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని హైకోర్టు పేర్కొంది. మార్కెట్ ధర ఖరారుపై ప్రభుత్వంతో చర్చించాలని రైల్వే అధికారులకు స్పష్టం చేసింది. అన్నవరప్పాడు రైల్వే భూముల్లో నిర్మాణాలపై గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. అన్నవరప్పాడు హట్ పీపుల్స్ అసోసియేషన్, మరో బిల్డింగ్ సొసైటీ హైకోర్టును ఆశ్రయించాయి. ఆ భూముల్ని ఈ అసోసియేషన్‌కు ఇచ్చే నిమిత్తం. . చర్చల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర రైల్వేకు ఆమోదయోగ్యమైతే ఆ భూమిని ప్రభుత్వానికి ఇవ్వాలని పేర్కొంది. ఈ ప్రక్రియను ఆరు మాసాల్లోపు పూర్తి చేయాలని పేర్కొంది. చర్చలు సఫలం కాకపోతే ఆ భూమిని రైల్వే స్వాధీనంలో ఉంచుకోవచ్చని పేర్కొంది. హట్ పీపుల్స్ అసోసియేషన్ 2004లో చెల్లించిన రూ.1.05 కోట్లను వడ్డీతో తిరిగి చెల్లించాలని రైల్వేకు స్పష్టం చేసింది.

7 మిషన్లు కేంద్రంగా సమీక్ష

- రేపటి నుంచి కలెక్టర్ల సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బహుముఖ ప్రగతి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడు మిషన్లు కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై గురువారం నుంచి జరగనున్న కలెక్టర్ల సమీక్షించనుంది. ప్రాథమిక రంగ మిషన్ నుంచి నైపుణ్యాభివృద్ధి మిషన్ వరకూ ప్రతి మిషన్‌పైనా సమగ్ర సమీక్ష జరగనుంది. గురు, శుక్రవారాల్లో ముఖ్యమంత్రి నివాసం దగ్గర కలెక్టర్ల సమావేశం జరగనుంది. రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, శాఖాధిపతులు హాజరవుతారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలకోపన్యాసం ఉంటుంది. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక పరివర్తన అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ నివేదిక సమర్పిస్తారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, జలవనరులు, గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలకు సంబంధించిన అంశాలను ప్రాథమిక రంగ మిషన్‌లో చర్చించనున్నారు. పారిశ్రామిక రంగ మిషన్‌లో గనులు, భూగర్భశాఖతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంపై సమీక్షిస్తారు. మౌలిక సదుపాయాల కల్పన మిషన్‌లో రవాణా, రహదారులు- భవనాలకు సంబంధించిన అంశాలను నివేదిస్తారు. పట్టణాభివృద్ధి మిషన్‌లో భాగంగా రాజధాని వ్యవహారాలతోపాటు పురపాలకశాఖ అంశాలపై సమీక్ష ఉంటుంది. సమావేశాల్లో తొలి రోజు సాయంత్రం నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ ప్రత్యేక ఉపన్యాసం ఉంటుంది.

రెండో రోజు శాంతిభద్రతలపై...: రెండో రోజు సామాజిక సాధికారత మిషన్‌లో పంచాయతీరాజ్, పాఠశాల విద్య, సంక్షేమ శాఖల సమీక్ష ఉంటుంది. ఇందులో భాగంగా చంద్రన్న బీమా, బ్రాహ్మణ, కాపు సంక్షేమాలపైనా సమీక్ష చేస్తారు. సేవా రంగాల మిషన్‌లో పర్యాటకం, ఈ-ప్రగతి, ఆర్టీజీలపై చర్చిస్తారు. నైపుణ్యాభివృద్ధి మిషన్‌లో నైపుణ్యాభివృద్ధి, యువజన, క్రీడల శాఖల నివేదికలుంటాయి. రాష్ట్ర రాబడి శాఖలతోపాటు నియంత్రణ శాఖలు, ఆర్థికాంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్రంలో శాంతి భద్రతల అంశంపై సమీక్ష ఉంటుంది.

చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటినా ఆరోగ్యశ్రీ

- ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ

వడమాలపేట, రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రక్తశుద్ధి(డయాలసిస్) చేయించుకోవాలంటే ఏటా రూ.2లక్షలు ఖర్చవుతోందని, వైకాపా అధికారంలోకి రాగానే చికిత్స వ్యయం రూ.వెయ్యి దాటినా ఆరోగ్యశ్రీ కిందనే పరిగణిస్తామని వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం చిత్తూరు జిల్లా వడమాలపేట మండలంలో ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగసభలో ఆయన పాల్గొన్నారు. తాము అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ కింద ఏ ఆసుపత్రిలోనైనా చికిత్స చేయించుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఆపరేషన్ అనంతరం విశ్రాంతి సమయంలోనూ నగదు చెల్లిస్తామన్నారు. గాలేరు-నగరి కాలువ పనులను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.4వేల కోట్లు వెచ్చించి 80శాతం పనులు పూర్తిచేసినా.. ముఖ్యమంత్రి చంద్రబాబు మిగిలిన పనులూ చేయలేకపోయారని విమర్శించారు. విద్యుత్తు బిల్లులు తగ్గిస్తానని 2014లో చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక మూడుసార్లు ఛార్జీలు పెంచారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రోజా, నారాయణస్వామి పాల్గొన్నారు. అంతకు ముందు రామచంద్రాపురంలోని పారకాల్వ వద్ద విడిది ఆవరణలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి జగన్ నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలోనే గోపూజ చేసి, తన తండ్రిని స్మరించుకుంటూ ఆవులకు అరటిపండ్లు తినిపించారు. అనంతరం సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు.



పారకాల్వలో గోపూజ చేస్తున్న జగన్

రాజ్యాంగం మార్పునకు ఆర్ఎస్ఎస్ కుట్ర

అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం ఆరోపణ



రాజారత్నం అశోక్ అంబేడ్కర్

ఉలవపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) సంస్థను దేశవ్యాప్తంగా రద్దు చేయాలని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం అశోక్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఉలవపాడులో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్, భాజపాలు తమకు అనువుగా మార్చాలని చూస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులను వ్యతిరేకించే ఇటీవల నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు గతానికి భిన్నంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. దీనికంతకూ కారణం ఆర్ఎస్ఎస్ తన రహస్య అజెండాను అమలుచేసేలా కుట్ర పన్నడమేనని ఆయన ఆరోపించారు. ఆ సంస్థను రద్దుచేసి లౌకిక వాదాన్ని సంరక్షించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలను అనేక రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్, భాజపాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. భాజపాతో పొత్తు పెట్టుకున్న ఏపీలోనూ తదనుగుణంగానే పాలన సాగుతోందన్నారు. ఇలాంటి విధానాలను జనాల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపరిచి సంఘటితం చేస్తామన్నారు.

ముగ్గుర్ని కాల్చిచంపిన ఐఆర్‌బీ అధికారి

మహారాష్ట్రలో దారుణం

ముంబయి, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో 'భారత రిజర్వు పటాలం(ఐఆర్‌బీ)' అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ బలిరామ్ శిందె మంగళవారం ముగ్గురిని కాల్చిచంపడం కలకలం సృష్టించింది. దౌండ్ పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో సంజయ్ ఈ దారుణాలకు పాల్పడ్డాడు. తొలుత నగర్‌మోరి చౌక్‌లో గోపాల్ శిందె, ప్రశాంత్ పవార్‌లను కాల్చిచంపిన సంజయ్.. అనంతరం బోరవకేనగర్‌లో నివాసముంటున్న అనిల్ విలాస్ జాదవ్ ఇంటికెళ్లి కాల్చి చంపేశాడు. ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన విభేదాలే ఈ దారుణానికి కారణమని తెలిసింది. సంజయ్‌ని పోలీసులు అరెస్టు చేశారు.



అవయవ మార్పిడిలో తమిళనాడు భేష్

ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ఈనాడు డిజిటల్, చెన్నై: అవయవ మార్పిడిలో దేశంలోనే తమిళనాడు అగ్ర తాంబూలం అందుకొని, మార్గదర్శిగా నిలుస్తోందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మంగళవారం చెన్నైలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్లోబల్ ఆస్పత్రికి చెందిన వైద్యనిపుణుడు మహ్మద్ రేలా ఏడేళ్లలో వెయ్యి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తిచేసిన క్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవయవ మార్పిడి విషయంలో ఇతర రాష్ట్రాలు కూడా తమిళనాడును అనుసరించాలని సూచించారు. దేశంలో అనేక నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఒకప్పుడు కాలేయ మార్పిడి చేసుకోవాలంటే విదేశాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది శస్త్రచికిత్సల కోసం మన దేశానికే వస్తున్నారని పేర్కొన్నారు.

నీటి వెలుగులెప్పుడో..?

ఓ భారీ హామీ ఇచ్చారు.. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు.. నిధులూ బాగానే ఖర్చు చేశారు.. 43.5 టీఎంసీల నీటిని ఒడిసిపడతామన్నారు.. నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగు నీరిస్తామన్నారు. 15లక్షల మంది గొంతు తడుపుతామన్నారు.. కానీ 20ఏళ్లయినా ఆ హామీ నెరవేరలేదు.. సాగుకు నీళ్లివ్వలేదు. తాగు నీటి కరవుతో అల్లాడుతున్న ప్రకాశం ప్రజల గొంతు తడిపింది లేదు. ఇంకా పనులు చేస్తూనే సాగుతూనే ఉన్నాయి. సొరంగం తవ్వుతూనే ఉన్నారు. మరోవైపు చేసిన పనులు చెత్త మొక్కల పాలవుతున్నాయి. అత్యంత నిరసంగా సాగుతున్న ఆ ప్రాజెక్టు పేరే వెలిగొండ. ఈ ప్రాజెక్టు పరిస్థితిపై 'ఈనాడు' క్షేత్ర స్థాయిలో పరిశీలించి అందిస్తున్న ప్రత్యేక కథనమిది...

వెలిగొండ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

• వెలిగొండ ప్రాజెక్టులో కీలక పనుల్లో జాప్యం • 'ఈనాడు' క్షేత్ర స్థాయి కథనం...

కరవు పీడిత ప్రాంతం ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో దుర్భిక్షాన్ని నివారించేందుకు, లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికీ ఆపసోపాలు తప్పడం లేదు. ఎప్పుడో రెండు దశాబ్దాల కిందట శంకుస్థాపన రాయి పడింది. జలాశయం నిర్మాణం దాదాపు పూర్తయింది. అక్కడికి నీరు చేర్చే వరద కాలువా కొంత మేర సిద్ధమైంది. ఆయకట్టుకు నీటిని తీసుకువెళ్లే ప్రధాన కాలువలు, ఉప కాలువలు కొంత మేర పూర్తయ్యాయి. శ్రీశైలం జలాశయం నుంచి ఈ పథకానికి నీళ్లు మళ్లించే టన్నెళ్ల నిర్మాణం పూర్తి కావడం లేదు. ముఖ్యమంత్రి ఎన్ని సమీక్షలు జరిపినా పనులు ఆశించినంత వేగం అందుకోలేదు. టన్నెళ్ల పనులు ప్రత్యామ్నాయ గుత్తేదారులకు అప్పజెప్పేలా కొత్తగా టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేశారు. వీటి అంచనాలు కోటలు దాటుతున్నాయి. టన్నెళ్ల నుంచి జలాశయానికి నీటిని తీసుకెళ్లేందుకు తవ్విన కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోతున్నాయి.



ఎప్పుడో తవ్విన కాలువల్లో ఇలా మొక్కలు

ఏం జరగాలి?

- ■ ఈ ప్రాజెక్టులో టన్నెళ్ల నిర్మాణమే కీలకం. ఒక టన్నెల్ మొత్తం 18.820 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ఇందులో కేవలం 15 కిలోమీటర్లే పూర్తయింది.
- ■ మరో టన్నెల్ 18.838 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా, కేవలం 9 కిలోమీటర్ల నిర్మాణమే జరిగింది.

టన్నెళ్ల నిర్మాణంలో జాప్యానికి కారణాలివీ..

- ■ నల్లమల అటవీ ప్రాంతంలో పర్యావరణ, అటవీ నిబంధనలను అనుసరించి నిర్మాణం చేపట్టాల్సి రావడం.
- ■ ఎప్పుడో విదేశాల నుంచి తీసుకొచ్చిన టన్నెల్ బోరింగ్ మిషన్ల సాయంతో పనులు చేస్తుండటం.
- ■ మిషన్లకు ఎదురయ్యే సాంకేతిక సమస్యలను సకాలంలో పరిష్కరించుకోలేకపోవడం.
- ■ హెడ్‌రెగ్యులేటర్ నిర్మించే కొలంవాగు ప్రాంతానికి రోడ్డు సౌకర్యమే లేదు. అక్కడికి ఏ యంత్రాలు, ఏ సామగ్రి తీసుకెళ్లాలన్నా జలాశయంలో పడవల్లోనే తీసుకెళ్లాలి. అక్కడ క్యాంపు ఏర్పాటు చేసుకున్నా వన్యప్రాణుల భయముంది.

ప్రధాన డ్యాం దాదాపు పూర్తి..

- ■ వరద కాలువ ద్వారా నీరు తీసుకొచ్చి నింపేందుకు వీలుగా జలాశయం నిర్మాణం దాదాపు పూర్తయింది.
- ■ టన్నెళ్ల నుంచి వచ్చే నీటిని జలాశయానికి తీసుకువెళ్లే వరద కాలువ మొత్తం 21.60 కిలోమీటర్లు. ఇందులో మట్టి పనుల ప్రధాన భాగం పూర్తయింది. కట్టడాల నిర్మాణాలు ఇప్పుడిప్పుడే జరుగుతున్నాయి.
- ■ జలాశయం నుంచి నీటిని తీగలేరు కాలువ, గొట్టిపడియ కాలువ, తూర్పు ప్రధాన కాలువల ద్వారా మళ్లిస్తారు. ఇందులో ఒక గొట్టిపడియ ప్రధాన కాలువ పని పూర్తయింది. మిగిలిన కాలువల్లో మట్టి పనులు కొలిక్కి వచ్చినా కట్టడాల నిర్మాణాలు కొన్ని చోట్లే చేపట్టారు. తూర్పు ప్రధాన కాలువ చివరన పెద్దరెడ్డిపల్లి రిజర్వాయరు నిర్మాణం సాగుతోంది. దీని నుంచి ఉపకాలువ తవ్వి నెల్లూరు జిల్లాకు నీళ్లిస్తారు.

ప్రాజెక్టులో ఖర్చు తీరిదీ...

2015 మార్చి వరకూ: **రూ.3730 కోట్లు**

2015 నుంచి 2017 మార్చి వరకూ: **రూ.566.05 కోట్లు**

అప్పటి నుంచి డిసెంబరు వరకూ: **రూ.200 కోట్లు**

ఈ ప్రాజెక్టుకు 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్టు పనులు వివిధ కారణాలవల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. ఇప్పటికీ కొలిక్కి రాలేదు.

ప్యాకేజీల వారీగా పూర్తయిన పనులు

ప్యాకేజీ 1లో: **80%**, ప్యాకేజీ 2లో ఫీడర్ కాలువ, తీగలేరు కాలువ, సుంకేశుల డ్యాం: **75%**, ప్యాకేజీ 3లో గొట్టిపాడు ప్రధాన కాలువ, గొట్టిపాడు డ్యాం: **పనులు పూర్తి.**

ప్యాకేజీ 4లో లింకు కాలువ, తూర్పు ప్రధాన కాలువ పనులు, కాకర్ల డ్యాం: **85%**, ప్యాకేజీ 5లో రెండో టన్నెల్ నిర్మాణం: **65%**, ప్యాకేజీ 6లో తూర్పు ప్రధాన కాలువలో కొంత మట్టి పని, పెద్దరెడ్డిపల్లి జలాశయం, 3 టన్నెళ్ల నిర్మాణం: **60%**, ప్యాకేజీ 7లో పశ్చిమ బ్రాంచి కాలువ తవ్వకం, తురిమెళ్ల, గుండ్లబ్రహ్మేశ్వరం, రాళ్లవాగు, సీతారాంసాగర్ జలాశయాల నిర్మాణం, రేవర్ల చెరువు అభివృద్ధి: **70%**

ప్యాకేజీ 8లో హెడ్‌రెగ్యులేటర్లు అప్రోచ్ చానల్, ట్రాష్ రాక్, కన్వెన్షనల్ పద్ధతిలో రెండోవైపు నుంచి కొంత ప్రధాన టన్నెల్ పనులు: **2017 ఆగస్టులో పనులు ప్రారంభించారు.**

■ తూర్పు ప్రధాన కాలువలో మళ్లీ 24.45 కి.మీ. నుంచి వెళ్లే అప్రోచ్ చానల్ ద్వారా వెళ్లే నీటిని వివిధ చోట్ల ఎత్తిపోతల పంపులు ఏర్పాటుచేసి తురిమెళ్ల జలాశయం, రాళ్లవాగు చెరువు సీతారాంసాగర్ జలాశయం నింపుతారు. వీటి గుండా ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలకు వివిధ మార్గాల్లో కొంత ఆయకట్టుకు నీరిస్తారు. ఈ పనులన్నీ వేగం పుంజుకోవాలి.

నేడు విజయవాడకు నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు

రేపు పోలవరం సందర్శన

ఈనాడు, దిల్లీ: నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ బుధవారం సాయంత్రం 8 గంటలకు విజయవాడలో అడుగుపెట్టనున్నారు. ఆయన గురువారం అంతా వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నెల 12వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరిన నేపథ్యంలో రాజీవ్‌కుమార్ ఏపీ షెడ్యూల్ ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకొంది. చంద్రబాబు సమర్పించిన 17 పేజీల వినతిపత్రంలోని అన్ని అంశాలపై తాను వ్యక్తిగత శ్రద్ధతీసుకొని పరిష్కరించే ప్రయత్నం చేస్తానని మోదీ హామీ ఇచ్చారు. ఆ క్రమంలోనే ఈ పర్యటన ఉండొచ్చని ఆంధ్రప్రదేశ్ అధికారులు అంచనా వేస్తున్నారు. నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌కుమార్ అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తూ వస్తున్నారని, అందులో భాగంగానే ఏపీకి వెళ్తున్నారన్న వాదనా ఉంది. అయితే నీతి ఆయోగ్ ప్రధానమంత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్నందున రాష్ట్రంలోని పరిస్థితులను ఆయన మోదీ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి కార్యాలయంకూడా ఆయనకు ఏయే అంశాలు నివేదించాలన్న దానిపై కసరత్తు చేస్తోంది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి గురువారం రాత్రి 8.40 గంటల వరకు రాజీవ్‌కుమార్ ఏపీలోనే గడపనున్నారు. ఈ పర్యటనలో ఆయన పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. రాష్ట్రపతి మెచ్చుకున్న రియల్‌టైం గవర్నెన్స్ సెంటర్‌ను చూస్తారు

టెట్ అభ్యర్థుల్లో గందరగోళం

ముసునూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణపై అభ్యర్థుల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఈ పరీక్షను తొలుత ఫిబ్రవరి 7 నుంచి నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. ఇటీవల పలు మార్పుచేర్పులు చేయడంతో షెడ్యూల్ ప్రకారం పరీక్ష జరుగుతుందా? లేదా? అనే సందేహం నెలకొంది. పండిట్లకు నిర్వహించే పరీక్ష పేపరును మారుస్తున్నట్లు పేపరు-3ని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెట్టారు. దీనికి పాఠ్యప్రణాళిక పూర్తిగా ప్రకటించలేదు. గతంలో పేపరు-2కు దరఖాస్తు చేసిన వారు ఇప్పుడు పేపరు-3కి మార్చుకోవాలా? లేదా దానంతట అదే మారుతుందా? అనే సందేహం అభ్యర్థుల్లో ఉంది. మరోవైపు కొందరికి పేపరు మార్చుకోవాలంటూ చరవాణులకు సంక్షిప్త సందేశాలు వస్తున్నాయి. మారిన విధానం ప్రకారం పండిట్లకు (ముఖ్యంగా తెలుగు, హిందీ భాషలకు) టెట్ 150 మార్కుల్లో పరీక్ష ఉంటుంది. మనస్తత్వ శాస్త్రం (సైకాలజీ), ఆంగ్లానికి 60మార్కులు పోను 90మార్కులకు భాషాసబ్జెక్టే ఉంటుందా? లేదా 30మార్కులకు సోషల్ ఉంటుందా? అనే అయోమయానికి గురవుతున్నారు. తెలుగుకు మొదటి ప్రాధాన్యమిచ్చి రెండో సబ్జెక్టుగా డీఎస్సీలో సోషల్ అసిస్టెంట్ కూడా రాయాలనుకునే వారు మరోమారు దరఖాస్తు చేయాలా? అనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఈ విద్యా సంవత్సరంలో బీఈడీ, డీఎడ్ విద్యార్థులకు టెట్ రాయడానికి అవకాశం ఇచ్చింది. సమయం సరిపోతుందా? పెంచే సూచనలున్నాయా? పరీక్ష ఆన్‌లైన్‌లోనా? ఆఫ్‌లైన్‌లోనా? అనే ప్రశ్నలు సైతం ఉదయిస్తున్నాయి. వీటిపై వెబ్‌సైట్లలో వస్తున్న విభిన్న ప్రచారాలతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. విద్యాశాఖ అధికారులు వీటిపై స్పష్టతనివ్వాల్సి ఉంది.

ఇక్రిశాట్ మాజీ డీడీజీ యశ్వంత్ లక్ష్మణ్ కన్నుమూత

ఈనాడు, హైదరాబాద్: ఇక్రిశాట్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(డీడీజీ) యశ్వంత్ లక్ష్మణ్ నెనె(81) కన్నుమూశారు. నాలుగు దశాబ్దాలపాటు శాస్త్రవేత్తగా సేవలందించిన ఆయన సోమవారం సాయంత్రం బోయిన్‌పల్లిలోని తన నివాసంలో అనారోగ్యంతో మరణించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన లక్ష్మణ్.. 1963 నుంచి మూడేళ్లపాటు వరిపై పరిశోధనలు చేసి 'ఖైరా' అనే రుగ్మతను గుర్తించి విరుగుడును కనిపెట్టారు. ఇందుకుగాను ఐక్యరాజ్య సమితి నుంచి ప్రశంసలు పొందారు. 1974లో ఇక్రిశాట్‌లో ప్లాంట్ పాథాలజీ విభాగాధిపతిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి వివిధ హోదాల్లో పనిచేసి డీడీజీగా పదవీ విరమణ చేశారు. 1998లో ఏషియన్ అగ్రి-హిస్టరీ ఫౌండేషన్ పేరుతో సంస్థను స్థాపించారు.





జగ్గన్నతోట ప్రభల తీర్థానికి పోటెత్తిన భక్తజనం ★ తీర్థంలో కనువిందు చేసిన వాకలగరువు, తొండవరం ప్రభలు

కోనసీమలో వైభవంగా ప్రభల తీర్థాలు

సంక్రాంతి సందర్భంగా కనుమ రోజున నిర్వహించే ప్రభల తీర్థాలు తూర్పుగోదావరి జిల్లాలో మంగళవారం ఘనంగా జరిగాయి. కోనసీమలోని పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, అల్లవరం, రాజోలు ప్రాంతాల్లో ప్రభల తీర్థాలు వైభవంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గన్నతోట ప్రభల తీర్థానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. టన్నులకొద్దీ బరువైన గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలను యువకులు భుజాలపై మోసుకుంటూ అప్పర్‌కౌశిక నదిని దాటించి జగ్గన్నతోట తీర్థానికి తీసుకు వచ్చారు. ఈ దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. ఎత్తయిన ప్రభలను వాకలగరువు, తొండవరం గ్రామాల్లో నిర్మించారు. వాకలగరువు ప్రభ ఎత్తు 47 అడుగులు ఉంది. తొండవరం ప్రభను కొబ్బరి తోటలు, పంట కాలువ మీదుగా తీసుకు వచ్చారు.

– న్యూస్‌టుడే, అంబాజీపేట

శ్రీశైల క్షేత్రంలో వైభవంగా పూలపల్లకి సేవ

శ్రీశైలం, న్యూస్‌టుడే: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఐదో రోజు మంగళవారం శ్రీపార్వతీ సమేత మల్లికార్జునస్వామికి వైభవంగా పుష్పపల్లకి సేవ నిర్వహించారు. భక్తజనం, కళాకారుల సందడి నడుమ ఈ ఉత్సవం కోలాహలంగా జరిగింది. మకర సంక్రాంతి పర్వదినం రోజు సోమవారం ఆలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ మండపంలో శ్రీపార్వతీ మల్లికార్జునస్వామివార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహించారు.



పూలపల్లకిలో ఉత్సవమూర్తులు

కోలాహలంగా పార్వేట ఉత్సవం

• శ్రీవారికి పంచాయుధాలు అలంకరణ

తిరుమల – న్యూస్‌టుడే

కనుమ పండుగ సందర్భంగా కోనేటిరాయుని పార్వేట ఉత్సవాన్ని తితిదే మంగళవారం తిరుమలలో అత్యంత కోలాహలంగా నిర్వహించింది. జగత్ప్రభువైన శ్రీనివాస చక్రవర్తి పాంచజన్య శంఖం, సుదర్శన చక్రం, కౌమోదకి గద, శార్ఙ్గమనే ధనస్సు, నందక ఖడ్గం అనే పంచాయుధాలను ధరించి వన విహారార్థం వెళ్లి దుష్ట మృగాలను వేటాడి విజయగర్వంతో తిరిగివచ్చే సందర్భమే పార్వేట ఉత్సవం. పంచాయుధాలతో పాటు వేట పరికరాలైన డాలు, కత్తి, ఈటె తదితరాలను స్వీకరించి శ్రీమలయప్పస్వామి శ్రీపీఠాన్ని అధిరోహించి ఆలయం వెలుపలికి విచ్చేశారు. శ్రీకృష్ణస్వామి మరో పీఠాన్ని అధిరోహించి శ్రీవారిని అనుసరించారు. శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణస్వామి ఆలయం వెలుపలికి వచ్చి భాజా భజంత్రీలతో పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపానికి వేంచేశారు. అక్కడ సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం నివేదనలు, హారతులు అందచేశారు. ఉత్సవ ఉభయదారులైన తాళ్లపాక వారికి పరివట్టం కట్టి, శఠారి మర్యాదలు చేసి, ప్రసాదంతో సత్కరించారు. అనంతరం శ్రీకృష్ణస్వామి పార్వేట మండపం నుంచి వెలుపలికి వచ్చారు. సన్నిధి గొల్లల నుంచి పూజా నివేదనలు అందుకుని వెన్నను ఆరగించి శ్రీవారి చెంతకు చేరుకున్నారు. శ్రీనివాసుడు రౌద్రాకారంతో వీరావేశంతో పరుగెత్తుతూ మృగాలను వేటాడే సన్నివేశాలను శ్రీవారి తరపున అర్చకులు రక్తి కట్టించారు. మూడు సార్లు వేటాడే దృశ్యాలను కనువిందుగా ఆవిష్కరించారు. తిరిగి పూజా నివేదనలు, హారతులు ఘనంగా జరిగాయి. అనంతరం స్వామివార్లు ఆలయానికి తిరుగు ప్రవేశం చేశారు. అంతకుముందు ఉదయం.. గోదాదేవి పరిణయోత్సవం సందర్భంగా తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని గోదాదేవి పూలమాలలను తిరుమలకు తీసుకువచ్చి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయంలోని స్వామివారికి బహూకరించారు. పరిణయోత్సవంలో పెద్దజీయర్, చిన్నజీయర్, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.





గోదాదేవి అమ్మవారి నుంచి విచ్చేసిన పుష్పమాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న పెద్దజీయంగార్. చిత్రంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ★ పార్వేట ఉత్సవంలో భాగంగా ఈటెను విసురుతున్న అర్చకులు

పండగ వెళ్లింది.. ప్రయాణం మొదలైంది

• కిటకిటలాడుతున్న బస్సులు, రైళ్లు

ఈనాడు అమరావతి: సంక్రాంతి సందడితో కళకళలాడిన పల్లెల్లో మంగళవారం సాయంత్రం నుంచి తిరుగు ప్రయాణాల ఏర్పాట్లు మొదలయ్యాయి. తెలంగాణలో బుధవారం నుంచే పాఠశాలలు తిరిగి తెరుస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చినవాళ్లలో ఎక్కువ మంది కనుమ రోజే తిరిగి వెళ్తున్నారు. అమావాస్య, మంగళవారం అనే పట్టింపులు ఉన్నవాళ్లు బుధవారంనాడు ప్రయాణానికి సిద్ధమయ్యారు. తిరుగు ప్రయాణాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. విజయవాడ, విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి బస్సుల్లో రద్దీ కనిపించింది. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని నడుపుతున్న ప్రత్యేక బస్సుల్లో సైతం సీట్లకు నిరీక్షణ జాబితా కనిపిస్తోంది. ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సులో రూ.15వందల నుంచి రూ.2వేల వరకూ వసూలు చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే మంగళవారంతోపాటు బుధవారం కూడా కాకినాడ నుంచి జనసాధారణ్ ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసింది.

అన్ని దారులూ హైదరాబాద్ వైపే

మంగళవారం సాయంత్రం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్లు రద్దీగా మారిపోయాయి. వ్యక్తిగతంగా కార్లలో హైదరాబాద్‌కు చేరుకొనేవారితో సందడిగా ఉన్నాయి. టోల్ గేట్ల దగ్గర వాహనాల బారులు కనిపిస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ అన్ని టోల్ గేట్ల దగ్గర నెలకొనే రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు.



కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లులో కోడి పందేల కోసం వేసిన షామియానాలు, పందేల కోసం వచ్చిన వారి వాహనాలు



చిత్తూరు జిల్లా రంగంపేటలో నిర్వహిస్తున్న పశువుల పందేలు

తమిళనాట జల్లికట్టు.. ముగ్గురి మృతి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళుల వీరోచిత సంప్రదాయ క్రీడగా పేరొందిన జల్లికట్టును పొంగల్ సందర్భంగా మంగళవారం పెద్దఎత్తున నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అలంగానల్లూర్‌లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మదురై జిల్లాలోని ఈ ఊరిలో ఉదయం పోటీలను ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వంలు ప్రారంభించారు. తర్ఫీదు పొందిన వెయ్యి ఎద్దులను ఒక్కొక్కటిగా రంగంలోకి దించారు. 1,241 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 'వాడివాసల్' నుంచి మైదానంలోకి దూసుకొచ్చే ఎద్దులను అణచేందుకు వారు వీరోచితంగా పోరాడారు. ఉదయం 8 గంటలకు మొదలైన జల్లికట్టు సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. విజేతలకు రూ.లక్ష విలువైన బహుమతులు అందించారు. పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా జల్లికట్టుతో పాటు మంజువిరట్టు(జల్లికట్టు తరహా క్రీడ)లో పాల్గొన్న ముగ్గురు ఎద్దులు పొడవడంతో మృతిచెందారు. సుమారు 50 మంది గాయపడ్డారు.



మదురై జిల్లా అలంగానల్లూర్‌లో జల్లికట్టు ఆడుతున్న యువకులు

రంగంపేటలో పరుష పందేల హోరు

చంద్రగిరి, న్యూస్‌టుడే: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా కనుమనాడు మంగళవారం చిత్తూరు జిల్లా రంగంపేటలో పశువుల పందేలను నిర్వహించారు. డప్పుల చప్పుళ్ల మధ్య కోడెగిత్తలను వీధుల్లో పరుగెత్తించారు. కోడెగిత్తల కొమ్ములకు కట్టి ఉంచిన నగదు, పంచె, రుమాలు, పలకలను సొంతం చేసుకోడానికి యువకులు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు యువకులకు గాయాలయ్యాయి.

ఉత్తుత్తి హామీలతో కాంగ్రెస్ వంచన

- గొప్పలు చెప్పుకోవడానికి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు
- అవి అమల్లోకి వచ్చేవి కావు
- మాది ఆచరణ ప్రభుత్వం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- రాజస్థాన్‌లో చమురుశుద్ధి కర్మాగార నిర్మాణ పనులకు శ్రీకారం



బాడ్‌మేడ్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

పచ్‌పాద్రా (రాజస్థాన్)

భారీ హామీలు ఇచ్చి, క్షేత్రస్థాయిలో పనులేమీ చేయకుండా ప్రజలను కాంగ్రెస్ వంచించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. రూ.43,129 కోట్ల విలువైన బాడ్‌మేడ్ చమురు శుద్ధి ప్రాజెక్టు నిర్మాణపనులను ఆయన మంగళవారం ఇక్కడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజస్థాన్‌లో కరవు, కాంగ్రెస్ కలిసి సాగాయన్నారు. ఆ పార్టీని సాగనంపాకే కరవు కోరల నుంచి రాష్ట్రానికి విముక్తి లభించిందని చెప్పారు.

ఈ చమురు శుద్ధి కర్మాగారం ఘనతపై భాజపా, కాంగ్రెస్‌ల మధ్య వివాదం తలెత్తింది. ఈ ప్రాజెక్టుకు 2013 సెప్టెంబర్ 22న కాంగ్రెస్ పార్టీ నాటి అధ్యక్షురాలు సోనియా గాంధీ శంకుస్థాపన చేశారు. తాజాగా మళ్లీ మోదీ.. ఆ పని చేయడాన్ని ఆ పార్టీ తప్పుపడుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ ప్రయోజనం కోసమే కాంగ్రెస్.. శంకుస్థాపన చేసిందని భాజపా విమర్శిస్తోంది. ప్రాజెక్టు కోసం అంగుళం భూమి కూడా సేకరించకుండానే, పర్యావరణ అనుమతులు రాకుండానే ఈ పని చేసిందని దుయ్యబట్టింది. ఈ అంశాలను తాజా కార్యక్రమంలో మోదీ ప్రస్తావించారు. "ప్రజలను కాంగ్రెస్ వంచించింది. ప్రాజెక్టుల సంబంధించిన ఘనత తమదిగా చెప్పుకోవడానికి వాటికి శంకుస్థాపన చేయడమో, కొత్త రైళ్లపై ప్రకటనలు చేయడం వంటివి చేసేది. అయితే ఇవేమీ ఆచరణలోకి వచ్చేవి కావు" అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఒట్టి ప్రకటనలకే పరిమితం కాకుండా.. ప్రాజెక్టుల సాకారానికి కృషి చేస్తోందన్నారు. తమ లక్ష్యాలను గుర్తించి, వాటిని 2022 నాటికి సాకారం చేసేందుకు శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఏటా 9 మిలియన్ టన్నుల సామర్థ్యంతో కూడిన ఈ ప్రాజెక్టును 2022 నాటికి పూర్తిచేస్తామన్నారు.

కాగితాలపై కూడా లేదు..

2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సైనిక సిబ్బంది కోసం 'ఒకే హోదా-ఒకే పింఛను' (ఓఆర్‌ఓపీ) పథకం కోసం తాత్కాలిక బడ్జెట్‌లో కేవలం రూ.500 కోట్లు కేటాయించిందని మోదీ విమర్శించారు. "బాడ్‌మేడ్ చమురు శుద్ధి కర్మాగారం కనీసం కాగితాలపైన ఉండేది. ఓఆర్‌ఓపీ మాత్రం ఆ దశలో కూడా లేదు. లబ్ధిదారుల సంఖ్య, వ్యయంపై క్షేత్రస్థాయి కసరత్తు జరగలేదు. లబ్ధిదారుల జాబితాను రూపొందించడానికి, అమలు ఖర్చు రూ.12వేలుగా నిర్ధరించడానికి మాకు ఏడాదిన్నర సమయం పట్టింది. ఇందులో నాలుగు విడతల్లో రూ.10,700 కోట్లు ఇప్పటికే విడుదల చేశాం. మిగతాది కూడా త్వరలోనే చెల్లిస్తాం" అని చెప్పారు.

నినాదాలకే పరిమితం..

'గరీబీ హటావో' (పేదరిక నిర్మూలన) అంటూ కాంగ్రెస్ కేవలం నినాదం మాత్రమే ఇచ్చిందని ప్రధాని దుయ్యబట్టారు. "గత 4 దశాబ్దాల్లో పేదల పేరుతో ఎన్నిసార్లు ఎన్నికలకు వెళ్లలేదు? అయినా వారి కోసం ఒక్క పథకమైనా తెచ్చారా? పేదల సాధికారత ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యం. నినాదాల ద్వారా కాదు" అని పేర్కొన్నారు. అభివృద్ధి పట్ల కాంగ్రెస్‌కు ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా.. పేదల పరిస్థితి మెరుగ్గా ఉండేదన్నారు. బ్యాంకులను జాతీయం చేసినప్పటికీ పేదల కోసం వాటి తలుపులను తెరవలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో తాను అధికారంలోకి వచ్చాక ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన కింద 32 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిచామని చెప్పారు. అలాగే 3.3 కోట్ల కుటుంబాలకు ఉచిత వంట గ్యాస్ కనెక్షన్ ఇచ్చామన్నారు. విద్యుత్ సౌకర్యం లేని 4 కోట్ల కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నామని చెప్పారు.

ఐఐటీ-బొంబాయిలో ప్రత్యేక ప్లేట్ల విన్నపంతో దుమారం

ముంబయి: ఐఐటీ-బొంబాయిలోని ఓ వసతిగృహంలో విద్యార్థులకు భోజనశాల మండలి పంపిన ఈమెయిల్ లేఖ వివాదానికి తెరలేపింది. మాంసాహారం భుజించేవారు ప్రత్యేక ప్లేట్లలో తినాలని ఈ నెల 12న పంపిన లేఖలో భోజనశాల మండలి విద్యార్థులను కోరింది. ప్రధాన ప్లేట్లను మాంసాహారులు వినియోగించొద్దని చాలామంది విద్యార్థులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపింది. తదనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్లేట్లలోనే మాంసం భుజించాలని సూచించింది. దీనిపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవ్వడంతో భోజనశాల మండలి తాజాగా వివరణ ఇచ్చింది. మాంసాహారం భుజించేవారు ప్రత్యేక ప్లేట్లలో తినాలనే నిబంధన ఎప్పటి నుంచో ఉన్నదేనని స్పష్టం చేసింది.

ఉత్తర కొరియా క్షిపణి దాడి చేసింది

పొరపాటు హెచ్చరిక జారీచేసిన జపాన్ వార్తాసంస్థ

టోక్యో: జపాన్ వార్తాప్రసారాల సంస్థ 'ఎన్‌హెచ్‌కే' మంగళవారం జారీ చేసిన ఓ హెచ్చరిక తీవ్ర కలకలం రేపింది. ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిందని.. ప్రజలు భవనాలు, భూగర్భ ప్రాంతాలను వెంటనే ఖాళీ చేసి బయటకు రావాల్సిందిగా ప్రభుత్వం చెప్పిందని తమ వార్తాసంస్థ యాప్‌ను వినియోగిస్తున్నవారికి 'ఎన్‌హెచ్‌కే' సందేశం పంపించింది. అనంతరం కొన్ని నిమిషాల్లోనే దాన్ని పొరపాటు హెచ్చరికగా గుర్తించి.. ప్రజలను క్షమాపణలు కోరింది. బాలిస్టిక్ క్షిపణి దాడి జరగబోతోందంటూ విడుదలైన పొరపాటు హెచ్చరిక హవాయిలో శనివారం కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే.

భారత్‌తో డీజీఎంవో స్థాయి చర్చల అంశాన్ని పరిశీలిస్తున్న పాక్

ఇస్లామాబాద్: నియంత్రణ రేఖ వెంబడి ఆందోళనకర వాతావరణానికి కళ్లెం వేయడమే లక్ష్యంగా భారత్‌తో సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) స్థాయి చర్చలను జరపాలనే ప్రతిపాదనను పాకిస్థాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. రక్షణ వ్యవహారాలపై ఏర్పాటుచేసిన సెనెట్ కమిటీకి పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఈ విషయం చెప్పినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. సరిహద్దుల వెంబడి కాల్పుల్లో తమ దేశానికి చెందిన నలుగురు సైనికులు చనిపోయారని పాక్ సోమవారం వెల్లడించింది. మరోవైపు నలుగురు కాదు ఏడుగురిని హతమార్చామని భారత్ చెబుతోంది. ఈ నేపథ్యంలో సరిహద్దుల వెంబడి కాల్పుల విరమణ వివరాలను సెనెట్ కమిటీకి పాక్ రక్షణ శాఖ అధికారి తెలియజేశారు. రెండు దేశాల మధ్య విశ్వాసం పాదుగొలిపే చర్యల్లో భాగంగా చర్చల అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. చివరిసారిగా 2013 డిసెంబరులో డీజీఎంవో స్థాయి చర్చలు జరిగాయి.

రూ.3.5 వేల కోట్ల తుపాకుల కొనుగోలుకు కేంద్రం ఆమోదం

దిల్లీ: సరిహద్దుల్లో మోహరించిన సేనల తక్షణ అవసరాలు తీర్చేందుకు. రూ.3,547 కోట్ల విలువైన తుపాకులను త్వరితగతిన కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఆమోదించింది. ఇందులో భాగంగా 72వేల అసాల్ట్ రైఫిళ్లు, 93,895 కార్బైన్‌లను సమకూర్చుకోనున్నట్లు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) తెలిపింది. కేంద్ర రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసినట్లు పేర్కొంది. సాయుధ బలగాలు ఎదుర్కొంటున్న చిన్న ఆయుధాల కొరతను తీర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే టెండర్లను పిలిచే ప్రక్రియ మొదలవుతుందని.. ప్రభుత్వాల స్థాయిలో కూడా ఈ ఆయుధాల కొనుగోలు జరిగేందుకు అవకాశముందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

లాలూ నాలుగో అల్లుడికీ ఈడీ పిలుపు

దిల్లీ: రైల్వే హోటళ్ల కేటాయింపుల్లో అవినీతి కేసుకు సంబంధించి ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ నాలుగో అల్లుడు రాహుల్ యాదవ్‌కూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీచేసింది. లాలూ సతీమణి రబ్రీదేవి, రాహుల్ బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి నగదు అటూఇటూ మారిందంటూ అనుమానం రావడంతో... బుధవారం విచారణకు రావాలని రాహుల్‌కు అధికారులు సూచించారు. లాలూ నాలుగో కుమార్తె రాగిణి భర్తే రాహుల్.

తిరుమల తరహాలో శబరిమల అభివృద్ధి

- త్వరలోనే నిపుణులతో అధ్యయనం జరిపించనున్న కేరళ ప్రభుత్వం

తిరువనంతపురం: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తరహాలో శబరిమలలోనూ యాత్రికులకు సకల సదుపాయాలు కల్పించాలని కేరళ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు తిరుమల నమూనా అభివృద్ధి ప్రాజెక్టులపై అధ్యయనం చేసేందుకుగాను త్వరలోనే నిపుణుల బృందాన్ని పంపించనున్నట్లు రాష్ట్ర దేవస్థాన, పర్యాటకశాఖ మంత్రి సురేంద్రన్ మంగళవారం తెలిపారు. నిపుణుల బృందానికి పూర్తిగా సహకరించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకొచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఈ నెల 14 వరకు శబరిమల ఆలయానికి రూ.255 కోట్ల ఆదాయం వచ్చిందని సురేంద్రన్ వెల్లడించారు.

మేధో వలసలపై ప్రణబ్ ముఖర్జీ విచారం

ఢాకా: ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు అద్భుతమైన వృత్తి నిపుణులను తయారుచేస్తున్నాయని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అన్నారు. అయితే, వారు జాతి నిర్మాణంలో పాలుపంచుకోకుండా.. బహుళజాతి సంస్థల్లో 'సేల్స్‌మెన్(విక్రయదారులు)'గా తయారవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలంటూ మేధావులకు పిలుపునిచ్చారు. మేధో వలసలపై విచారం వ్యక్తంచేశారు. బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ 'డి లిట్(డాక్టర్ ఆఫ్ లెటర్స్)' స్వీకరించిన అనంతరం ప్రణబ్ మంగళవారం ఈ మేరకు ప్రసంగించారు.

నెతన్యాహు కోసం గుజరాత్‌లో భారీ ఏర్పాట్లు

- మోదీతో కలసి నేడు అహ్మదాబాద్‌లో రోడ్‌షో

అహ్మదాబాద్: ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమెన్ నెతన్యాహు పర్యటన కోసం గుజరాత్‌లో భారీగా ఏర్పాట్లు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీతో కలసి ఆయన బుధవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

తొలుత అహ్మదాబాద్‌లో విమానాశ్రయం నుంచి సబర్మతీ ఆశ్రమం వరకూ జరిగే రోడ్‌షోలో నెతన్యాహు దంపతులు, మోదీ పాల్గొంటారు. 8 కిలోమీటర్ల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రోడ్డుపక్కన 50 వేదికలను ఏర్పాటు చేశారు. భిన్నరాష్ట్రాల నుంచి వచ్చిన సాంస్కృతిక బృందాలు అక్కడ ప్రదర్శనలు ఇస్తాయి. భారత యూదులు కూడా నేతలిద్దరికీ స్వాగతం పలుకుతారు. మహాత్మా గాంధీ సుదీర్ఘకాలం పాటు గడిపిన సబర్మతీ ఆశ్రమాన్ని మోదీ, నెతన్యాహు సందర్శిస్తారు. నేతలిద్దరికీ అక్కడ ఘన స్వాగతం లభించనుంది. అక్కడి నుంచి వారు అహ్మదాబాద్‌కు సమీపంలోని బవ్లా పట్టణంలో ఉన్న 'ఐక్రియేట్' కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఆ తర్వాత సబర్‌కాంతలో ఇజ్రాయెల్ ఏర్పాటు చేసిన వ్యవసాయ విశిష్ట కేంద్రానికి ఇద్దరు నేతలు వెళతారు. సబర్‌కాంత నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా కచ్‌లో సాగు పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

అద్భుత కానుక..: ఈ పర్యటనలో నెతన్యాహు.. మోదీకి 'గాల్-మొబైల్' నీటి నిర్లవణీకరణ, శుద్ధి జీపును కానుకగా అందించనున్నారు. గత ఏడాది మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించినప్పుడు ఇద్దరు నేతలు ఈ జీపులో ప్రయాణించారు. ఈ జీపు ఖరీదు 1.11 లక్షల డాలర్ల మేర ఉంటుంది.

మోదీ ప్రభుత్వ కృషి భేష్: బెంజమిన్ నెతన్యాహు మంగళవారమిక్కడ భౌగోళిక, రాజకీయ సదస్సు 'రైసీనా డైలాగ్'ను ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ హాజరయ్యారు. అధికార అలసత్వం తగ్గించేందుకు, సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరిచేందుకు మోదీ ప్రభుత్వం చేసిన కృషిని నెతన్యాహు తన ప్రారంభోపన్యాసంలో ప్రశంసించారు. బలమైన దేశంగా అవతరించేందుకు ఆర్థిక, సైనిక అభివృద్ధి, రాజకీయ అధికారం అవసరమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సవాళ్లుగా మారిన అంశాలపై చేపట్టిన ఈ మూడో సదస్సును విదేశీ వ్యవహారాల శాఖ, అబ్జర్వర్ రీసెర్చి ఫౌండేషన్(ఓఆర్‌ఎఫ్) సంయుక్తంగా ఏర్పాటు చేశాయి.



తాజ్‌మహల్ వద్ద సరదాగా ఫొటో దిగుతున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దంపతులు

తాజ్‌మహల్‌ను సందర్శించిన నెతన్యాహు

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భార్య సారాతో కలిసి మంగళవారం చారిత్రక కట్టడం తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఖేరియా విమానాశ్రయంలో నెతన్యాహుకు యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్ స్వాగతం పలికారు.

ముంబయి వచ్చిన మోషే

ముంబయి: తొమ్మిదేళ్ల క్రితం 26/11 ముంబయి దాడుల్లో తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఇజ్రాయెల్ బాలుడు మోషే హోల్ట్జ్‌బెర్గ్ మంగళవారం ఇక్కడకు వచ్చాడు. ప్రస్తుతం అతడికి 11ఏళ్లు. తాతయ్య షిమోన్ రోజెన్‌బెర్గ్‌తో కలిసి ఉదయమే అతడు నగర సందర్శన మొదలుపెట్టాడు. 'చాలా సంతోషంగా ఉన్నాను. మా కుటుంబాన్ని దాడులు కుదిపిన తర్వాత భారత్‌కు రావడం ఇదే తొలిసారి'అని అతడు విలేకరులతో చెప్పాడు. తన అమ్మానాన్నలు ప్రాణాలు కోల్పోయిన నారీమన్ హౌస్‌ను అతడు సందర్శించాడు. గత జులైలో ప్రధాన మంత్రి మోదీ ఇజ్రాయెల్‌కు వెళ్లినప్పుడు.. మోషేతోపాటు అతడి తాతయ్య, అమ్మమ్మను కలిశారు.



ముంబయిలో నారీమన్ హౌస్ వద్ద మోషే

బోఫోర్స్ కేసుతో సంబంధం ఏమిటి?

- అప్పీలు దాఖలు చేసిన భాజపా నేతను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ

రాజకీయంగా సునిశితమైన బోఫోర్స్ ముడుపుల కేసులో అప్పీలు దాఖలు చేసిన భాజపా నేత అజయ్‌అగర్వాల్‌ను సుప్రీంకోర్టు వివరణ అడిగింది. ఈ కేసుతో మీకేం సంబంధమని ప్రశ్నించింది. తృతీయపక్షం జోక్యాన్ని ఎలా అనుమతిస్తామంది. 2005, మే 31న దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ.. సుప్రీంకోర్టులో ఎలాంటి అప్పీలు చేయలేదనీ, ప్రైవేటు వ్యక్తి అప్పీలు ఎలా దాఖలు చేస్తారనీ, ఈ కేసులో పిటిషనర్‌కున్న సంబంధాన్ని వివరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర పేర్కొన్నారు. కేసు గడిచి 31 ఏళ్లయ్యాయనీ ఎవరూ సవాలు చేయలేదనీ, తృతీయపక్షమైన మీరు ఈ విషయంలో తమను సంతృప్తి పరచాలని ధర్మాసనం పేర్కొంది. గత 12-13 ఏళ్ల కాలంలో ఎలాంటి అప్పీలు దాఖలు చేయలేదనీ, ఇప్పుడేం చెప్పదలచుకున్నారని సీబీఐ తరపున హాజరైన ఏఎస్‌జీ మణిందర్‌సింగ్‌ను ప్రశ్నించింది. ఏఎస్‌జీ స్పందిస్తూ హైకోర్టు తీర్పుపై



సవాలు చేయాలా వద్దా అనేది దానిపై చర్చలు సాగాయన్నారు. ప్రతివాదుల్లో ఒకరిగా సీబీఐ కోర్టుకు హాజరైంది. కోర్టులో ఉన్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా అప్పీలుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ ఏఎంఖన్విల్కర్, జస్టిస్ డీవైచంద్రచూడ్ కూడా ఉన్న ఈ ధర్మాసనం కేసును ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. 2005, మే 31న దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ సోధి బోఫోర్స్ కేసులో హిందూజా సోదరులు, బోఫోర్స్ కంపెనీకి వ్యతిరేకంగా ఉన్న అభియోగాలన్నింటినీ కొట్టివేశారు. కేసు విషయంలో సీబీఐ వ్యవహరించిన తీరుపై తీవ్రంగా మందలించారు. అంతకుముందు 2004లో నాటి దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేడీకపూర్ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని నిర్దోషిగా ప్రకటించారు. బోఫోర్స్ కంపెనీపై ఫోర్జరీ అభియోగాలు మోపాలని ఆదేశించారు. 2005 నాటి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ అగర్వాల్ సుప్రీంకోర్టు అప్పీలు దాఖలు చేశారు. ఆయన 2014 లోక్‌సభ ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీపై రాయబరేలీలో పోటీ చేశారు.

సీబీఐ సిట్‌పై మండిపడిన సుప్రీంకోర్టు

దిల్లీ: తీవ్రవాద ప్రభావిత మణిపూర్‌లో సైన్యం, అసోం రైఫిల్స్, పోలీసుల నకిలీ ఎదురుకాల్పులు, చట్ట వ్యతిరేక హత్యలకు పాల్పడ్డారనే ఆరోపణలపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన సీబీఐ సిట్ పనితీరుపై సుప్రీంకోర్టు మండిపడింది. గతంలో తాము ఆదేశించిన మేరకు తగినన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 28న దర్యాప్తు బృందం హాజరవ్వాలనీ, 12 కేసులపై తుది నివేదికల్ని సమర్పించాలని జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ యూయూ లలిత్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. సిట్ దాఖలు చేసిన తొలి నివేదికను పరిశీలించి, అన్ని ఎఫ్ఐఆర్‌లనూ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించింది. దర్యాప్తును పర్యవేక్షించాలని సీబీఐ సంచాలకులకు స్పష్టంచేసింది. తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది.

ఖాప్ పంచాయతీల దాడులు అక్రమమే

కుటుంబ/సామాజిక వర్గ పరువును మంటగలిపారంటూ కులాంతర వివాహాలు చేసుకున్న జంటలపై ఖాప్ పంచాయతీలు జరిపే దాడులు చట్టవిరుద్ధం, అక్రమమైనవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యుక్తవయస్సు (మేజర్లయిన) యువతీ యువకులు తమంతట తాము ఇష్టపడి చేసుకునే పెళ్లిళ్లను ఎవరూ ప్రశ్నించలేరని, అటువంటి వివాహాలు చెల్లుబాటుకావని చెప్పే అధికారం ఖాప్ పంచాయతీలకు కానీ, ఏ సంస్థకు కానీ ఉండదని ధర్మాసనం పేర్కొంది. పరువు పేరుతో దాడులు, హత్యలు సమర్థనీయం కాదంది. కులాంతర/ప్రేమ వివాహాలు చేసుకున్న దంపతులపై దాడులను నిరోధించేందుకు కోర్టు సహాయకుడు(అమికస్ క్యూరీ) రాజు రామచంద్రన్ చేసిన సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం తన స్పందనను తెలియజేయాలని ధర్మాసనం కోరింది. కోర్టు సహాయకుడు చేసిన సిఫార్సుల్లో జోక్యం తాము చేసుకోవటంలేదని, ఆ సిఫార్సుల ఆధారంగా ఉత్తర్వును మాత్రమే ఇస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది.

ఆధ్యాత్మిక వీసాగా మార్చుకోవచ్చా?



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

■ **రానున్న రోజుల్లో విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేయాలనుకుంటున్నాను. ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం? - శాంతి కిరణ్**

విద్యార్థి వీసా ఇంటర్వ్యూ అపాయింటుమెంటు ఖరారు చేసుకునే ముందు వీసా దరఖాస్తు(డీఎస్-160)ను ఫొటోతోపాటు ఎస్ఈవీఐఎస్ రుసుం రశీదును అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూ సమయంలో విద్యార్థి పాస్‌పోర్టు, ఐ-20 దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. అమెరికాలో చదువుకునేందుకు విద్యార్హత, అవసరమై ఫీజు తదితరాలు సిద్ధం చేసుకున్నట్లు రుజువులు చూపాల్సి ఉంటుంది. ఐ-20తోపాటు అనుబంధ ధ్రువపత్రాలున్నంత మాత్రాన వీసా వస్తుందని కాదు. చదువు పూర్తయిన తరవాత మాతృదేశానికి తిరిగి వస్తానని స్పష్టం చేసే అంశాలను ఇంటర్వ్యూ సమయంలో కాన్సులర్ అధికారితో చర్చించేందుకు సిద్ధంగా ఉండండి. విద్యార్థి వీసా(ఎఫ్-1)కు ఎలా దరఖాస్తు చేయాలి తదితర సమాచారం కోసం https://www.ustraveldocs.com/in ను చూడండి.

■ **నాకు పర్యాటక వీసా ఉంది. ఆధ్యాత్మిక వీసాగా మార్చుకోటం ఎలా? - తేజాబ్**

ఒక విభాగంలో జారీ చేసిన వీసా మరో విభాగానికి మార్చటం సాధ్యం కాదు. మీరు ఆర్-1 వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్-1 విభాగంలో ఆధ్యాత్మిక ఉపాధిని అమెరికాలో మీకు కల్పిస్తున్నట్లు మీ పక్షాన ఆ సంస్థ యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్)లో పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. యూఎస్‌సీఐఎస్ ఆ పిటిషన్‌ను ఆమోదిస్తే మీరు నాన్ ఇమిగ్రెంట్ ఆర్-1 వీసా కోసం స్థానికంగా ఉన్న కాన్సులేట్ లేదా రాయబార కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం www.uscis.gov ను చూడండి.

■ **గతేడాది జూన్‌లో వీసా ఇంటర్వ్యూకు హాజరయ్యాను. ఇప్పటి వరకు రాలేదు. వీసా దరఖాస్తు స్థితిని తెలుసుకోవడమెలా? - కృష్ణమూర్తి ఆర్వీ**

వీసా దరఖాస్తుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అధిక శాతం దరఖాస్తులకు పరిపాలనా ప్రక్రియ నిర్వహించటం పరిపాటి. ఆ ప్రక్రియ ఎంత కాలంలో పూర్తవుతుందనేది స్పష్టంగా చెప్పలేము. మీరు అసౌకర్యం కలుగుతున్న అంశాన్ని గుర్తించాం. సాధ్యమైనంత త్వరితంగా దాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. మీ దరఖాస్తు స్థితిని తెలుసుకునేందుకు https:// ceac.satge.gov ను పరిశీలించండి.

■ **2013లో నాకు హెచ్1బి వీసా జారీ చేశారు. అమెరికా వెళ్లే క్రమంలో అబుదాబీలో అధికారులు పరిశీలించి నాకు తప్పు విభాగంలో వీసాను మంజూరు చేసినట్లు గుర్తించి రద్దు చేశారు. ఆరు నెలలపాటు చెల్లుబాటయ్యే తాత్కాలిక వీసాను ఇచ్చారు. నా కుమారుడి స్నాతకోత్సవం త్వరలో క్యాలిఫోర్నియాలో జరగనుంది. దానికి హాజరయ్యేందుకు వీసాను పొందడమెలా? - ఎమ్వీ శంకరరావు**

మీ ప్రయాణంతో సంబంధంలేని వీసాతో మీరు అమెరికాలో ప్రవేశించేందుకు ప్రయత్నం చేయకూడదు. పర్యాటకం కోసం మీరు అమెరికా వెళ్లాలనుకుంటే మీరు బి1/బి2 వీసాకు స్థానికంగా ఉన్న కాన్సులేట్ లేదా రాయబార కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్వ్యూ సమయంలో గతంలో వీసా రద్దుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండటంతోపాటు ఆయా పత్రాలను అందజేయండి.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.
- సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

మోదీతో మొదలై.. ట్రంప్‌తో ముగింపు!

దిల్లీ/దావోస్: దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సు ప్రారంభ సమావేశంలో ఈనెల 23న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించనున్నారు. ఈనెల 22 నుంచి జరిగే సదస్సు చివర్లో 26న ముఖ్య ప్రసంగాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేయనున్నారు. డబ్ల్యూఈఎఫ్ అధికారిక కార్యక్రమాల వివరాల్ని మంగళవారం జెనీవాలో ప్రకటించారు. 5 రోజులపాటు నిర్వహించే 2018 డబ్ల్యూఈఎఫ్ 48వ వార్షిక సదస్సులో 70 దేశాల నేతలు, 38 మంది అంతర్జాతీయ సంస్థల అధినేతలు, 2 వేల మంది సీఈవోలు పాల్గొననున్నారు. 400కుపైగా సెషన్లలో చర్చలు నిర్వహించనున్నారు. 'ముక్కలైన ప్రపంచంలో భాగస్వామ్య భవిష్యత్తు సృష్టించాలి' అనేది ఈసారి సదస్సు ముఖ్యాంశంగా నిర్ణయించారు. మహిళా నేతల భాగస్వామ్యమూ అధిక స్థాయిలో ఉండనుందని డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. ప్రధాని మోదీ వెంట పలువురు కేంద్రమంత్రులు హాజరవనున్నారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, ఏపీ సీఎం చంద్రబాబు, 100 మంది సీఈవోలతోపాటు మొత్తం 129 మంది భారత్ తరపున పాల్గొననున్నారు.

నన్ను చంపేందుకు కుట్ర

- వీహెచ్‌పీ నేత ప్రవీణ్ తొగాడియా సంచలన ఆరోపణ
- రామమందిరం, గోవధపై మాట్లాడకుండా గొంతు నొక్కుతున్నారని ఆవేదన

అహ్మదాబాద్: విశ్వహిందూ పరిషద్(వీహెచ్‌పీ) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా సంచలన ఆరోణలు చేశారు. తనను చంపేందుకు కొందరు కుట్ర పన్నారని పేర్కొన్నారు. రామమందిరం, గోవధ వంటి అంశాలపై మాట్లాడకుండా గొంతు నొక్కుతున్నారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం కొద్దిసేపు కనిపించకుండాపోయిన తొగాడియా.. అహ్మదాబాద్‌లో మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. తనను ఎన్‌కౌంటర్ చేసి చంపేందుకు రాజస్థాన్ పోలీసులు వచ్చారంటూ సోమవారం సందేశాలు వచ్చాయని తెలిపారు. దీంతో రాజస్థాన్‌లోని గంగాపుత్‌లోగల



న్యాయస్థానం ఎదుట హాజరయ్యేందుకుగాను అహ్మదాబాద్ విమానాశ్రయానికి ఆటోలో వెళ్తుండగా దారిలోనే స్పృహ కోల్పోయానని చెప్పారు. స్పృహలోకి వచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నట్లు పేర్కొన్నారు. తనపై కుట్రలు పన్నుతున్నవారి పేర్లను సరైన సమయంలో బయటపెడతానన్నారు. పదేళ్ల క్రితం నాటి ఓ కేసులో తొగాడియాను అరెస్టు చేసేందుకు రాజస్థాన్ పోలీసులు సోమవారం అహ్మదాబాద్ వెళ్లగా.. ఆయన తన నివాసంలో కనిపించలేదు. దీంతో ఆయన అదృశ్యంపై కలకలం రేగింది. అనంతరం షాహిబాగ్ ప్రాంతంలోని ఓ ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో తొగాడియా కనిపించారు. మరోవైపు, తనను చంపేందుకు కుట్ర జరుగుతోందంటూ తొగాడియా చేసిన ఆరోపణ తీవ్రమైన అంశమని.. దానిపై దర్యాప్తు జరిపించాలని గుజరాత్ రాష్ట్ర కాంగ్రెస్ నేత అర్జున్ మొధ్వాడియా డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్‌లో మూడేళ్ల డిగ్రీ కోర్సులు

- న్యాక్ ఉన్నత గ్రేడింగ్ గల విద్యాసంస్థలకు అవకాశమివ్వనున్న కేంద్రం

దిల్లీ: 'జాతీయ మదింపు, గుర్తింపు మండలి(న్యాక్)' ఉన్నత గ్రేడింగ్ కలిగి ఉన్న విద్యాసంస్థలు త్వరలోనే మూడేళ్ల డిగ్రీ కోర్సులను ఆన్‌లైన్ విధానంలో అందించనున్నాయి. వీటికి సాధారణ డిగ్రీలతో సమాన విలువ ఇవ్వనున్నారు. ఈ మేరకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. 'కేంద్ర విద్యా సలహా మండలి(సీఏబీఈ)' 65వ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 'ఏ ప్లస్', 'ఏ ప్లస్‌ప్లస్' న్యాక్ స్కోరు ఉన్న 15 శాతం విద్యాసంస్థలకు మూడేళ్ల ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు అందించే అవకాశం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ప్రశ్నపత్రాలు తయారుచేసుకునే స్వేచ్ఛ విశ్వవిద్యాలయాలకే ఇస్తామని.. అయితే, అవి తాము రూపొందించే ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్న సంస్థలు కూడా తాము రూపొందించే ప్రమాణాలను రెండేళ్లలో అందుకోవాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో వాటి కోర్సులను మూసివేస్తామని స్పష్టం చేశారు.



13 మంది సొంత పిల్లల్నే చిత్రవధ చేసిన తల్లిదండ్రులు

- అమెరికాలో దంపతుల అరెస్టు

పెర్రిస్: ఆహారం సరిగా పెట్టకుండా 13 మంది సొంత పిల్లల్నే చిత్రవధ చేసిన అమెరికా దంపతులు పోలీసులకు చిక్కారు. కొందరు చిన్నారులను వీరు చీకట్లో మంచాలకేసి గొలుసులతో కట్టేశారట. బాధిత పిల్లల్లో రెండేళ్ల పాప నుంచి 29ఏళ్ల యువతి వరకూ ఉన్నారు. వీరిలో 17ఏళ్ల బాలిక తప్పించుకొని ఆదివారం కాలిఫోర్నియా పోలీసులకు ఫోన్‌చేసింది. పెర్రిస్‌లోని ఓ ఇంట్లో తమ తల్లిదండ్రులే తమని చిత్రహింసలు పెడుతున్నారని తెలిపింది. అక్కడకు చేరుకున్న పోలీసులకు చీకట్లో గొలుసులతో కట్టేసిన పిల్లలు కనిపించారు. వీరిని ఎందుకు కట్టేశారనే ప్రశ్నకు డేవిడ్ ఎలెన్ టూర్పిన్, లూయిస్ అన్నా దంపతులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని అధికారులు తెలిపారు. వారిద్దరినీ అరెస్టుచేశామని పేర్కొన్నారు. 'వారి పిల్లల్లో ఏడుగురు 18 నుంచి 29 ఏళ్ల వయసున్నవారు. వారంతా బాగా బక్కచిక్కిపోయారు. 17ఏళ్ల అమ్మాయిని చూసి 10ఏళ్ల బాలికగా పొరబడ్డాం. అంతలా వారు శుష్కించిపోయారు'అని పేర్కొన్నారు.



ఈనాడు బిజినెస్

నిర్మాణదార్లలో (బిల్డర్లు) కొందరు సొంత స్థలాల్లోనే ఫ్లాట్లు లేదా ఇళ్లు నిర్మించి విక్రయిస్తుంటారు. మరికొందరేమో ఇతరులతో సంయుక్త అభివృద్ధి ఒప్పందం (జేడీఏ) చేసుకుని, వారి స్థలాల్లో ఫ్లాట్లు లేదా ఇళ్లు నిర్మించి అమ్ముతుంటారు. జేడీఏ కుదుర్చుకున్న సందర్భంలో నిర్మాణదార్లకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ఏవిధంగా వర్తిస్తుందో గత వారం వ్యాసంలో చెప్పాం. జేడీఏ కుదుర్చుకున్నప్పుడే కాకుండా అసలు ఏయే సందర్భాల్లో నిర్మాణదార్లు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది? ఎప్పుడెప్పుడు మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఈవారం తెలుసుకుందాం.

ఫ్లాట్ పూర్తయ్యాక కొంటే కట్టక్కర్లేదు!

జీఎస్టీ

● ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ రాకముందు లావాదేవీలకే వర్తింపు ● అల్మారాలు, ఫ్లోరింగ్ పనులకు 18%



సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్

జీఎస్టీ చట్టం ప్రకారం నిర్మాణదార్లు ఫ్లాట్లను నిర్మించి అమ్మడం 'సరఫరా' కిందకు వస్తుంది. ఈ తరహా కార్యకలాపాలను వ్యాపార లావాదేవీగా పరిగణిస్తారు. అంతమాత్రాన ప్రతి లావాదేవీకీ జీఎస్టీ వర్తించదు. కొన్ని సందర్భాల్లో మినహాయింపు కూడా ఉంది. ఒకవేళ పన్ను వర్తించినా.. చెల్లించాల్సిన పన్ను రేట్లు కూడా రెండు రకాలుగా ఉంటాయి. అవి.. 12%, 18%. ఫ్లాటు విలువలో స్థలం విలువ కలిసి ఉంటే 12% జీఎస్టీ చెల్లించాలి. అదే స్థలం విలువ కలవకుంటే 18% జీఎస్టీ వర్తిస్తుంది.

ఉదాహరణకు ఓ వ్యక్తి రూ.40 లక్షలకు ఫ్లాట్ కొన్నారనుకుందాం. ఇందులో స్థలం విలువ రూ.10 లక్షలు కాగా.. నిర్మాణ వ్యయం రూ.30 లక్షలు. ఇందులో అమ్మకపు విలువలో స్థలం విలువ (రూ.10 లక్షలు) కలిసి ఉన్నందున 12% జీఎస్టీ కింద రూ.4,80,000 చెల్లించాల్సి వస్తుంది. ఒకవేళ స్థలం విలువ కలవకుంటే రూ.30 లక్షలపై 18 శాతం జీఎస్టీ చొప్పున రూ.5,40,000 కట్టాల్సి ఉంటుంది.

ఎప్పుడెప్పుడు వర్తింపు..

'ఆక్యుపెన్సీ సర్టిఫికేట్' లేదా 'కంప్లీషన్ సర్టిఫికెట్' లేదా 'ఫస్ట్ ఆక్యుపెన్సీ' పొందడానికంటే ముందే నిర్మాణదారు ఫ్లాటును అమ్మితే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఫ్లాట్ అమ్మినప్పుడు కొనుగోలుదార్ల నుంచి కొంత డబ్బును ముందస్తుగా (అడ్వాన్స్) నిర్మాణదార్లు తీసుకుంటారు. ఇలాంటప్పుడు కూడా జీఎస్టీ వర్తిస్తుంది.

ఎప్పుడెప్పుడు మినహాయింపు..

కొనుగోలుదార్ల నుంచి అడ్వాన్స్ తీసుకోకుండా, కంప్లీషన్ సర్టిఫికెట్ పొందిన తరవాతే ఫ్లాటును విక్రయిస్తే జీఎస్టీ వర్తించదు. ఎందుకంటే ఈ తరహా లావాదేవీలను 'స్థిరాస్తి (ఇమ్మూవబుల్) క్రయవిక్రయాలు'గా భావిస్తారు. జీఎస్టీ చట్టంలో వీటికి మినహాయింపు ఉంది.

ఎప్పుడెప్పుడు చెల్లించాలి..

నిర్మాణదార్లకు జీఎస్టీ వర్తింపు 'సరఫరా సమయం (టైమ్ ఆఫ్ సప్లయ్)' నిబంధనలపై ఆధారపడి ఉంటుంది. కొనుగోలుదార్ల నుంచి ముందస్తు డబ్బులు తీసుకున్నప్పుడు, అనంతర చెల్లింపులు జరిగినప్పుడు, కొనుగోలుదారు పేరు మీద సేల్ డీడ్‌ను (అసంపూర్తి నిర్మాణం లేదా పూర్తి నిర్మాణం) మార్చినప్పుడు, ఫ్లాట్‌ను కొనుగోలుదారుకు స్వాధీనం చేశాక అమ్మకపు విలువలో రావాల్సిన మొత్తం బకాయిని పొందినప్పుడు నిర్మాణదారు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఫ్లాట్‌ను స్వాధీనం చేసినప్పుడు ఎంత మేర పన్ను చెల్లించాల్సి ఉంటుందో నిర్మాణదారు లెక్కించుకోవాలి. తదనుగుణంగా వివిధ సందర్భాల్లో చెల్లించిన పన్ను మొత్తాన్ని మినహాయించుకొని, ఇంకా ఎంత కట్టాలో ఆ మొత్తంపై 18% లేదా 12% జీఎస్టీ కింద ప్రభుత్వానికి చెల్లిస్తే సరిపోతుంది.

ముందే ప్రారంభమైతే..

జీఎస్టీ అమలుకు (01.07.2017) ముందే ఫ్లాట్ల నిర్మాణం ప్రారంభమై, ఆ తర్వాత కూడా కొనసాగితే జీఎస్టీ చట్టం ప్రకారం ఆ ఫ్లాట్ల అమ్మకాలకు ఏవిధంగా పన్ను వర్తిస్తుందో చూద్దాం.

- ☛ జీఎస్టీ అమలుకు ముందే ఫ్లాట్ల విక్రయం, కొనుగోలుదార్లకు అప్పగించడం, పన్ను చెల్లింపులను పూర్తి చేసి ఉంటే ఆ లావాదేవీలపై జీఎస్టీ వర్తించదు.
- ☛ జీఎస్టీ అమలుకు ముందు కొంత పన్ను చెల్లించి, కొనుగోలుదారుకు ఫ్లాట్‌ను అప్పగించని పక్షంలో చెల్లించిన ఆ పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద నిర్మాణదారు పొందే వీలుంటుంది. ఇలా పొందిన పన్ను ప్రయోజనాన్ని అమ్మకపు విలువను తగ్గించడం ద్వారా కొనుగోలుదార్లకు నిర్మాణదార్లు బదిలీ చేయాలి.
- ☛ జీఎస్టీ అమలైన తరవాత ఫ్లాట్‌ను అమ్మడం లేదా అప్పగించడం చేస్తే అమ్మకపు విలువపై కొనుగోలుదార్ల నుంచి వసూలు చేసిన జీఎస్టీని నిర్మాణదారు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.
- ☛ జీఎస్టీ అమలుకు కొన్ని రోజుల ముందు నిర్మాణం ప్రారంభమైతే.. అప్పటివరకు ఎలాంటి పన్నులు చెల్లించనకుంటే, ఆ తరవాత నుంచి జరిగే ఒక్కో లావాదేవీకి నిబంధనలకు అనుగుణంగా పన్నులు వర్తిస్తాయి.

విక్రయ ఒప్పందం..

నిర్మాణదారు నుంచి ఓ వ్యక్తి రూ.80 లక్షలకు ఫ్లాట్ కొన్నారనుకుందాం. ఇందులో స్థలం విలువ కూడా కలిసి ఉంది. తొలుత రూ.50 లక్షలకు సెమీ-ఫినిష్డ్ సేల్ డీడ్‌ను తయారు చేసుకున్నారు. రూ.30 లక్షలకు మిగిలిన పనులు పూర్తి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలాంటి సందర్భంలో రూ.80 లక్షలకు విక్రయం ఒప్పందం కుదుర్చుకుంటే 12% జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఒప్పందం అలా లేకుంటే, పూర్తి చేయాల్సిన పనులకు చేసే చెల్లింపులకు 18% జీఎస్టీ వర్తిస్తుంది. ఎందుకంటే దీనిని వేరే లావాదేవీ కింద ప్రభుత్వం పరిగణించే అవకాశం ఉంది.

మూడో వ్యక్తికి అప్పగిస్తే..

కొన్ని సందర్భాల్లో చివర్లో చేయాల్సిన పనులను (ఫినిషింగ్ వర్క్స్) భవన నిర్మాణదార్లకు కాకుండా మూడో వ్యక్తికి (థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లకు) కొనుగోలుదార్లు అప్పగిస్తుంటారు. ఇలాంటప్పుడు ఆ వ్యక్తులకు చెల్లించే మొత్తంపై 18% జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఎందుకంటే వీరికి చేసే చెల్లింపుల్లో స్థలం విలువ కలిసి ఉండదు.

సబ్ కాంట్రాక్టర్లకిస్తే తప్పదు..

టైల్స్ అతికించడం, రంగులు వేయడం, అల్మారాల (కప్‌బోర్డులు) నిర్మాణం లాంటి కొన్ని పన్నులను సబ్ కాంట్రాక్టర్లకు నిర్మాణదార్లు అప్పగిస్తుంటారు. ఈ పనులకు చెల్లించే మొత్తంపై నిర్మాణదార్ల నుంచి 18% జీఎస్టీని సబ్ కాంట్రాక్టర్లు వసూలు చేయొచ్చు. అయితే ఈ మొత్తాన్ని తిరిగి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద నిర్మాణదార్లు పొందే వీలుంది. కొనుగోలుదార్ల విషయంలో ఆయా సందర్భానికి అనుగుణంగా పన్ను వర్తింపు. . మినహాయింపు ఉంటుంది. అయితే సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించే పనులకు మాత్రం ఫలానా సందర్భంతో సంబంధం లేకుండా నిర్మాణదార్లు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

అన్నింటిలోనూ జాగ్రత్త..

'కొనుగోలుదార్లూ.. పారాహుషార్' అనే హెచ్చరికను మనం ప్రతిసారి వింటూనే ఉంటాం. ఇక్కడ జాగ్రత్తగా ఉండటమంటే.. అన్ని విషయాల్లోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని అర్థం. నిర్మాణదారుతో ఒప్పందం కుదుర్చుకుంటే.. ఆ ఒప్పందంలోని ప్రతి ఒక్క విషయాన్ని క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. చట్టాలు ఏం చెబుతున్నాయి? నిర్మాణదారు అనుభవం ఎంత? ఒప్పంద షరతులు ఏమిటి? ఇలా అన్ని అంశాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. ఎటువంటి మోసానికి గురికాకుండా తమను తాము కాపాడుకునేందుకు కొనుగోలుదార్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి.

హెచ్‌యూఎల్‌కు 'యాంటీ ప్రాఫిటరింగ్' నోటీసు

దిల్లీ: వినియోగదార్లకు పన్ను తగ్గింపు ప్రయోజనాన్ని బదిలీ చేయడం లేదన్న ఆరోపణలపై హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్)కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సేఫ్‌గార్డ్స్ (డీజీఎస్) నోటీసులు జారీ చేసింది. స్టాండింగ్ కమిటీ ఈ విషయాన్ని డీజీఎస్‌కు సిఫారసు చేయడంతో, వినియోగదారులకు పన్ను ప్రయోజనాలను బదిలీ చేస్తున్నారా? లేదా? అనే అంశంపై వివరణ కోరుతూ హెచ్‌యూఎల్‌కు నోటీసులు పంపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సంబంధిత పత్రాలతో వివరణ సమర్పించేందుకు 15 రోజుల సమయాన్ని కంపెనీకి ఇచ్చింది. ఈనెల 16న డీజీఎస్ నుంచి నోటీసులు అందుకున్నట్లు హెచ్‌యూఎల్ తెలిపింది. 'నోటీసులపై త్వరలోనే స్పందిస్తామ'ని పేర్కొంది. 'జీఎస్టీ రేట్లతో వినియోగదారులకు చేకూరే ప్రతి ప్రయోజనాన్ని బదిలీ చేసేందుకు మేం కట్టుబడి ఉన్నాం. పన్ను ప్రయోజనాన్ని బదిలీ చేయాల్సిన విషయాన్ని వ్యాపారులకు కూడా ఇప్పటికే చెప్పామ'ని వివరించింది.

ఇ- వేబిల్లుల వినియోగానికి మరో 6 రాష్ట్రాలు సిద్ధం

ఇ-వేబిల్లులను వినియోగించే రాష్ట్రాల జాబితాలోకి మరో ఆరు చేరాయి. గుజరాత్, మహారాష్ట్ర, సిక్కిం, ఝార్ఖండ్, బిహార్, హరియాణాలు జీఎస్టీ నెట్‌వర్క్‌పై ఇ-వే బిల్లుల కోసం ప్రయోగాత్మక ప్రక్రియను (ట్రయల్ రన్) ప్రారంభించాయి. రూ.50,000 విలువైన వస్తువులను 10 కి.మీ మించి అంతరాష్ట్ర రవాణాకు ఇ-వేబిల్లుల వినియోగం ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరి కానుంది. ఇప్పటికే కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరాఖండ్, కేరళలు ఇ-వేబిల్లుల వినియోగాన్ని ప్రారంభించాయి. కొత్తగా 6 రాష్ట్రాల చేరికతో ఇ-వేబిల్లులను వినియోగిస్తోన్న రాష్ట్రాల సంఖ్యకు పదికి చేరినట్లయ్యింది. 'త్వరలోనే మరి కొన్ని రాష్ట్రాలు కూడా ఇ-వేబిల్లులను వినియోగించడం ప్రారంభించే అవకాశం ఉంది. వీటి కోసం ఏ పన్నుల కార్యాలయానికి కాని.. చెక్‌పోస్టులకు కాని వెళ్లనవసరం లేదు. ఎలక్ట్రానిక్ రూపంలో పొందొచ్చ'ని జీఎస్టీఎన్ సీఈఓ ప్రకాశ్ కుమార్ తెలిపారు. ఇ-వేబిల్లులు పొందాలనుకునే వ్యాపారులు 'ఇవేబిల్.నిక్.ఇన్' పోర్టల్‌కు వెళ్లి, జీఎస్టీ సంఖ్యతో నమోదు చేసుకోవచ్చు.

జీఎస్టీఎన్ సమస్యలపై నేడు మంత్రుల బృందం భేటీ

జీఎస్టీ నెట్‌వర్క్ (జీఎస్టీఎన్) విషయంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారంపై నేడు మంత్రుల బృందం సమావేశం కానుంది. 2017 సెప్టెంబరులో ఈ మంత్రుల బృందం ఏర్పాటైంది. నేడు జరగబోయే సమావేశం ఆరోది. బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ ఈ మంత్రుల బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. జీఎస్టీఎన్ పనిచేస్తున్న తీరు, వినియోగదారులు సాఫీగా పోర్టల్‌ను వినియోగించేందుకు ఇన్ఫోసిస్ చేపడుతోన్న చర్యలపై సమావేశంలో సమీక్ష నిర్వహిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 1 నుంచి ఇ-వే బిల్లుల వినియోగం అమల్లోకి రానున్నందున ఇందుకు పోర్టల్ ఎంత మేర సిద్ధంగా ఉందనే అంశంపైనా నేటి సమావేశంలో చర్చ జరగొచ్చు.

ఇసుజు కొత్త డి-మ్యాక్స్ వి-క్రాస్



ధర రూ.14.31 లక్షలు

దిల్లీ: ఇసుజు మోటార్స్ ఇండియా తమ స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) డి-మ్యాక్స్ వి-క్రాస్ మోడల్‌లో నవీకరించిన వెర్షన్‌ను విపణిలోకి ప్రవేశపెట్టింది. రెండు వేరియంట్లలో లభించే ఈ ఎస్‌యూవీ రూ.14.31-15.81 లక్షల (ఎక్స్-షోరూమ్ దిల్లీ) ధరల శ్రేణిలో లభిస్తుందని కంపెనీ తెలిపింది. 2016 మేలో కంపెనీ డి-మ్యాక్స్ వి-క్రాస్ తొలి వెర్షన్‌ను విడుదల చేసింది. 2018 ఎడిషన్‌లో కొత్త ఫీచర్లను జత చేశామని కంపెనీ వెల్లడించింది. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ వ్యవస్థ, పగటిపూట వెలిగే దీపాలు, ఎల్ఈడీ టెయిల్ దీపాల వంటి కొత్త ఫీచర్లు ఇందులో ఉన్నాయని ఇసుజు వివరించింది.

1.20 లక్షలకు పైగా కంపెనీల గుర్తింపు రద్దు!

దిల్లీ: నల్లధనం నిర్మూలనలో భాగంగా నిబంధనలను పాటించని మరో 1.20 లక్షలకు పైగా కంపెనీలను అధికారిక రికార్డుల నుంచి తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే 2.26 లక్షల కంపెనీల నమోదును ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు ఈ సంస్థలకు సంబంధించిన దాదాపు 3.09 లక్షల మంది డైరెక్టర్లపై అనర్హత వేటు వేసింది. గత వారం నమోదు రద్దు చేసిన సంస్థలపై జరిగిన సమీక్షా సమావేశం అనంతరం తాజా నిర్ణయం వెలువడింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి పీపీ చౌధరి, ప్రభుత్వ రికార్డుల నుంచి ఇటువంటి కంపెనీల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. డిసెంబరు చివరకు నిబంధనలు పాటించని, చాలాకాలం పాటు ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించని 2.26 లక్షల కంపెనీల నమోదును ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే నమోదు రద్దు చేసిన కంపెనీల గుర్తింపు పునరుద్ధరించాలంటూ.. దాదాపు 1,157 కేసులు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) దగ్గర నమోదయ్యాయి. ఇందులో 180 కంపెనీల పునరుద్ధరణకు ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు ఇవ్వగా.. 992 కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

పారిశ్రామికవేత్తలకు పెద్ద చదువులు అక్కర్లేదు

ఫిక్కీ ఎఫ్ఎల్ఓ సదస్సులో వక్తలు

ఈనాడు, హైదరాబాద్: పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు పెద్ద చదువులు అవసరం లేదని కమానీ ట్యూబ్స్ ఛైర్‌పర్సన్ కల్పనా సరోజ్ అన్నారు. ఏ వ్యాపారం చేసినా అందులో విజయం సాధించాలంటే పట్టుదల, కష్టపడే మనస్తత్వం ఉండాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం హైదరాబాద్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) సదస్సులో ఆమె ప్రసంగించారు. నష్టాల్లో ఉన్న కంపెనీని చేజిక్కించుకొని, దానిని రూ.11.2 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన సంస్థగా మలిచేందుకు తాను చేసిన కృషిని వివరించారు. ప్రైవేటు విమాన సేవల అగ్రిగేటర్ జెట్‌సెట్‌గో సీఈఓ కనికా టేక్రివాల్ మాట్లాడుతూ.. నాణ్యమైన ఉత్పత్తులు, సేవలకు ఎప్పుడూ మంచి మార్కెట్ ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో మొదటి ఎంబీఏ సర్పంచిగా పేరుపొందిన రాజస్థాన్‌లోని సోదా గ్రామ సర్పంచి ఛావి రాజావత్ మాట్లాడుతూ.. స్మార్ట్ నగరాలను సృష్టించాలంటే ముందుగా స్మార్ట్ గ్రామాల ఏర్పాటు జరగాలని తెలిపారు. ఫిక్కీ ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ విభాగం ఛైర్‌పర్సన్ కామినీ సరాఫ్ పాల్గొన్నారు.

రూ.10 వేలకే ప్రైవేట్ జెట్ ప్రయాణం: దేశీయంగా ప్రస్తుతం 32 ప్రైవేటు జెట్లతో ఒప్పందం కుదుర్చుకొని సేవలందిస్తున్నామని, 2018లో వీటి సంఖ్య 50 కి పెంచాలనే లక్ష్యంతో ఉన్నట్లు జెట్‌సెట్‌గో సీఈఓ కనికా టేక్రివాల్ తెలిపారు. ప్రస్తుతం 6 నుంచి 28 సీట్ల విమానాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. 2017లో లక్ష మందికి పైగా తమ సంస్థ ద్వారా ప్రయాణించారని తెలిపారు. జెట్ షటిల్ పేరుతో రూ.10వేలతో కూడా ప్రైవేటు జెట్‌లలో ప్రయాణించే వీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆన్‌లైన్‌లో పతంజలి ఉత్పత్తుల విక్రయాల ప్రారంభాన్ని ప్రకటిస్తున్న బాబారాందేవ్, ఆచార్య బాలకృష్ణ

ఆన్‌లైన్‌లో పతంజలి ఉత్పత్తులు

● అగ్రగామి ఇ-కామర్స్ సంస్థలతో జట్టు

దిల్లీ: బాబా రామ్‌దేవ్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న పతంజలి ఆయుర్వేద్ ఉత్పత్తులన్నీ ఆన్‌లైన్‌లోనూ లభించనున్నాయి. ఇందుకోసం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, గ్రోఫెర్స్, షాప్‌క్లూస్, బిగ్‌బాస్కెట్, 1ఎంజీ, పేటీఎం మాల్, నెట్‌మెడ్స్ వంటి ఇకామర్స్ పోర్టళ్లతో పతంజలి భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఏడాదిలో రూ.1000 కోట్లకు పైగా అమ్మకాలే లక్ష్యమని పతంజలి వెల్లడించింది. దివ్య జల్ బ్రాండ్ కింద బాటిల్డ్ నీరు, పరిధాన్ బ్రాండ్ కింద పాదరక్షలు, దుస్తులను విపణిలోకి ప్రవేశ పెట్టనున్నట్లు పతంజలి పేర్కొంది.

మూడేళ్ల గరిష్ఠానికి వాణిజ్యలోటు

- ✦ డిసెంబరులో 72 శాతం పెరిగిన పసిడి దిగుమతులు
- ✦ ఎగుమతుల్లో వృద్ధి 12.36 శాతం



దిల్లీ: ఇంజినీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల అండతో గత డిసెంబరులో దేశీయ ఎగుమతులు 12.36 శాతం పెరిగి 27.03 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.73 లక్షల కోట్లు)కు చేరాయి. ఇదే నెలలో బంగారం, ముడిచమురు బిల్లు భారం వల్ల దిగుమతుల విలువ 21.12 శాతం పెరిగి 41.91 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.68 లక్షల కోట్ల)కు చేరింది. ఫలితంగా వాణిజ్య లోటు 14.88 బిలియన్ డాలర్ల (రూ.95,000 కోట్లకు పైగా)కు చేరింది. 2016 డిసెంబరు కంటే ఇది 41 శాతం అధికం కాగా, మూడేళ్ల గరిష్ఠస్థాయి అని వాణిజ్య శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. 2016 ఆగస్టు నుంచి ఎగుమతుల్లో వృద్ధి లభిస్తోందని, 2017 అక్టోబరులో మాత్రమే 1.1 శాతం తగ్గాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. వరుసగా రెండో నెలా ఎగుమతులు పెరగడం సానుకూల పరిణామమని ఎగుమతిదారుల సంఘం ఎఫ్ఐఈఓ పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లోనే 224 బిలియన్ డాలర్ల (సుమారు రూ.14.34 లక్షల కోట్ల) విలువైన ఉత్పత్తులు ఎగుమతులు జరిగాయని, మరో 3 నెలలు గడువున్నందున 300 బిలియన్ డాలర్ల (సుమారు రూ.19.20 లక్షల కోట్ల) కీలకస్థాయికి చేరగలమనే అంచనాను ఎఫ్ఐఈఓ అధ్యక్షుడు గణేశ్ కుమార్ గుప్తా వ్యక్తం చేశారు.

3.39 బి.డాలర్ల పసిడి దిగుమతి: గత డిసెంబరులో 3.39 బి.డాలర్ల (సుమారు రూ.21,700 కోట్ల) విలువైన పసిడి దేశంలోకి దిగుమతైంది. 2016 డిసెంబరులో దిగుమతి అయిన 1.97 బి.డాలర్ల (సుమారు రూ.12,600 కోట్ల) విలువైన పసిడితో పోలిస్తే, ఈసారి 71.52 శాతం అధికమైంది.

3 నెలల కనిష్ఠానికి..

డిసెంబరులో టోకు ద్రవ్యోల్బణం 3.58%

దిల్లీ: ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం డిసెంబరులో 3.58 శాతంగా నమోదైంది. ఇది మూడు నెలల కనిష్ఠం కావడం గమనార్హం. డబ్ల్యూపీఐ తగ్గిన నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో చర్యలు ప్రకటించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. గత నవంబరులో 3.93 శాతంగా నమోదైన ద్రవ్యోల్బణం, 2016 డిసెంబరులో 2.10 శాతంగా నమోదైంది.



- ✦ నవంబరులో 6.06% గా ఉన్న ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం.. డిసెంబరులో 4.72 శాతానికి తగ్గింది.
- ✦ ఉల్లి ధరలు ఏకంగా 197.05 శాతం మేర పెరిగాయి. కూరగాయల ధరల్లో వృద్ధి 56.46 శాతానికి పరిమితమైంది. ప్రోటీన్లు అధికంగా ఉండే గుడ్లు, మాంసం, చేపల ధరలు 1.67% వరకు తగ్గాయి. పండ్ల ధరలు 11.99 శాతం ఎగిశాయి.

ఆర్థిక వృద్ధితో పసిడికి మరింత గిరాకీ

ప్రపంచ స్వర్ణ మండలి

ముంబయి: ఆర్థిక వృద్ధితో పాటు పారదర్శకత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల పసిడికి గిరాకీ పెరుగుతుందని ప్రపంచ స్వర్ణమండలి (డబ్ల్యూజీసీ) పేర్కొంది. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు వల్ల తొలుత ప్రతికూల ప్రభావం పడినా, దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పసిడిపై ప్రభావానికి సంబంధించి నివేదికను సంస్థ ఆవిష్కరించింది. ఆర్థిక వృద్ధి వల్ల పసిడిపై సానుకూల ప్రభావం ఉంటుందని, ఆదాయాలు పెరిగితే, బంగారు ఆభరణాలు, స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్ల వంటి వాటికి గిరాకీ పెరుగుతుందని వివరించింది. 2017లో ప్రపంచ వృద్ధి సాధ్యమైందని, 2018లోనూ ఇది కొనసాగుతుందనే అంచనాను వ్యక్తం చేసింది. అమెరికా, ఐరోపాల వృద్ధి వల్ల మేలు జరుగుతుందని పేర్కొంది.



టెలికాంలో మరో 50,000 ఉద్యోగాల కోత!

- ● రాబోయే 6-9 నెలల్లోనే
- ● లాభదాయకత, మార్జిన్లు తగ్గడం వల్లే
- ● ఇప్పటికే 40,000 మందిపై వేటు
- ● సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ నివేదిక



ముంబయి: అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న టెలికాం రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగే పరిస్థితులు ఇంకా రాలేదని, ఉన్నవారి తొలగింపులే మరో 6-9 నెలలు కొనసాగవచ్చని ఒక నివేదిక పేర్కొంది. 2017 నుంచి ఇప్పటివరకు టెలికాం రంగంలో 40,000 మంది ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారని, రాబోయే 6-9 నెలల్లో మరో 50,000 మంది ఉపాధి కోల్పోయే పరిస్థితులున్నాయని బెంగళూరుకు చెందిన సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ తన తాజా నివేదికలో పేర్కొంది. మొత్తం మీద టెలికాం రంగంలో 80,000-90,000 ఉద్యోగాలపై వేటు పడినట్లవుతుందని తెలిపింది. టెలికాం సంస్థలకు సేవలందించే 65 టెలికాం, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాల కంపెనీల్లోని 100 మంది సీనియర్, మధ్యస్థాయి ఉద్యోగుల నుంచి సేకరించిన అంశాలతో ఈ నివేదికను రూపొందించినట్లు వివరించింది. కొంతకాలం గడిచాక టెలికాం సంస్థలు కూడా కళాశాల ప్రాంగణాల నుంచి అధిక నియామకాలు చేపడతాయని, వీరంతా కొత్తవారే అవుతారని నివేదిక వివరించింది.

లాభదాయకత, మార్జిన్లు తగ్గడం వల్లే

- ✦ పోటీ తీవ్రమవడం వల్ల లాభదాయకత బాగా తగ్గడం, మార్జిన్లు హరించుకుపోవడమే టెలికాం రంగంలో ఉద్యోగాల కోతకు ప్రధాన కారణాలని పేర్కొంది.
- ✦ రుణ సేవల ఖర్చు అధికమవ్వడం, విపణిలో వాటా పెంచుకునేందుకు సంస్థల మధ్య అధిక పోటీ, విలీనాలపై నెలకొన్న అనిశ్చితి వల్ల కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు టెలికాం సంస్థలు వెనుకంజ వేస్తున్నాయి. ఇందువల్ల ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతోంది.
- ✦ 69 శాతం మందికి వార్షిక వేతనంలో పెరుగుదల 7 శాతంగా నమోదైంది. వీరిలోనూ మూడోవంతు మందికి వేతన పెరుగుదల 5 శాతంలోపే ఉంది.

కొత్త రంగాలకు తరలిపోతున్నారు: టెలికాం రంగంలో నెలకొన్న అనిశ్చితి వల్ల భవిష్యత్తు భద్రంగా ఉండదనే భావన ఉద్యోగుల్లో నెలకొంది. ఫలితంగా ఈ రంగాన్ని వీడి, కొత్త రంగంలో ఉపాధి చూసుకునే వారి సంఖ్య పెరుగుతోంది.

- ✦ టెలికాం సంస్థల్లో ఉద్యోగం కోల్పోతున్న వారిలో, రాజీనామా చేస్తున్న వారిలో 25 శాతం మందికి కొత్త ఉద్యోగం సిద్ధంగా ఉండటం లేదు. అయినా ఇతర రంగాల్లో ఉపాధి పొందు తామనే ధీమాను 69 శాతం మంది వ్యక్తం చేస్తున్నారు. నైపుణ్యం గలవారే ఈ ధోరణిలో ఉంటున్నారు. అందువల్ల నిపుణులు తమ సంస్థల్లో కొనసాగేలా చూసుకోవడం టెలికాం సంస్థలకు సవాలుగా మారుతోంది.
- ✦ ప్రస్తుత సంస్థలో తమ ఉద్యోగ భద్రతపై ఉద్యోగులు ఆందోళనతో ఉన్నారని, ఇవే ఊహాగానాలకు మరింత కారణమవుతున్నాయని నివేదిక విశ్లేషించింది. ఫలితంగా ఒక సంస్థ నుంచి మరో సంస్థలోకి ఉద్యోగులు మారడం (వలసలు) కూడా రాబోయే 3 త్రైమాసికాల్లో అత్యధికంగా ఉంటాయని అంచనా వేసింది.
- ✦ తప్పనిసరైతే మినహా, కొత్తగా ఎవరినీ టెలికాం సంస్థలు నియమించుకోవడం లేదు. ఫలితంగా కొత్త నైపుణ్యాలేమీ ఈ రంగంలోకి వచ్చే పరిస్థితులు అడుగంటుతున్నాయి.

సెన్సెక్స్ ▼ 72 **34771** | **నిఫ్టీ** ▼ 41 **10700** | **రూపాయి** 64.04 ▼ (ఒక అమెరికా డాలరుకు) 55 పైసలు | **బంగారం** 30,210 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 60 | **వెండి** 38,890 ▼ ముంబయిలో కిలో రూ.లలో 320 | **ముడి చమురు** 69.38 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,926	+127
నాస్‌డాక్	7,229	+08
నిక్కీ 225 (జపాన్)	23,952	+237
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,550	+14
షాంఘై (చైనా)	3,437	+27
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,756	−13
డాక్స్ (జర్మనీ)	13,246	+46

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు)


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	57.88	67.12
పౌండ్ స్టెర్లింగ్	79.84	92.59
యూరో	71.00	82.34
జపనీస్ యెన్/100	52.18	60.53
ఆస్ట్రేలియా డాలర్	46.12	53.36
సింగపూర్ డాలర్	43.77	51.86
థాయ్ బాట్/100	181.30	216.84
బహ్రెయిన్ దీనార్	156.76	179.64
కువైట్ దీనార్	174.87	217.90
సౌదీ రియాల్	15.39	18.25
యూఏఈ దిర్హమ్	15.75	18.42
మలేషియా రింగిట్	14.33	17.62
చైనీస్ యువాన్	7.00	11.36



మంగళవారం నిఫ్టీ కదలికలు



ఈనాడు బిజినెస్

మార్కెట్ కబుర్లు

- బ్రిటన్, ఐరోపాలలో పొదుపు, మదుపు వ్యాపారాలు నిర్వహించే ఎం అండ్ జీ ప్రుడెన్షియల్‌తో 690 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,400 కోట్లు) ఒప్పందం చేసుకున్నట్లు **టీసీఎస్** తెలిపింది.
- ఐపీఓ ద్వారా రూ.1,000 కోట్ల సమీకరణకు ప్రత్యేక రసాయనాల తయారీ సంస్థ **గెలాక్సీ సర్ఫాక్టంట్స్**, రూ.700 కోట్ల సమీకరణకు **బార్బిక్యూ నేషన్** సెబీ ఆమోదం పొందాయి.
- మొబైక్విక్‌లో 12.6 శాతం వాటా స్వాధీనం చేసుకున్నట్లు **బజాజ్ ఫైనాన్స్** తెలిపింది.
- తమ నిర్మాణ విభాగం రూ.1,310 కోట్ల ఆర్డర్లు పొందినట్లు **ఎల్ అండ్ టీ** ప్రకటించింది.
- ప్రభుత్వం రూ.2,257 కోట్ల మూలధనం సమకూర్చుస్తుండగా, క్యూఐపీ పద్ధతిలో రూ.3,000 కోట్ల సమీకరణ యత్నాలు వాయిదా వేస్తున్నట్లు **బ్యాంక్ ఆఫ్ ఇండియా** తెలిపింది.
- **న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్** ఐపీఓ తొలి రోజు 19 శాతానికి సమానమైన బిడ్లు దాఖలయ్యాయి.
- రూ.166 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను తమ బోర్డు ఆమోదించినట్లు **బీఎస్ఈ** తెలిపింది. షేరుకు రూ.1,100 చొప్పున 15.09 లక్షల షేర్లను కొనుగోలు చేయనుంది.
- మోన్‌శాంటో కొనుగోలుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదాన్ని మే నెలలోగా పొందగలమని **బేయర్** అంచనా వేస్తోంది.

ఏటా బి.డాలర్ల ఆదాయం!

• రూ.3,800 కోట్లతో సముద్రగర్భ కేబుల్ • ఆర్‌కామ్ కొత్త ప్రణాళిక



ముంబయి: సముద్రం అడుగున 68,000 కిలోమీటర్ల పొడవునా నిర్మించే కేబుల్ ద్వారా ఏటా బిలియన్ డాలర్ల (సుమారు రూ.6,400 కోట్లు) ఆదాయం లభించగలదని అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) అంచనా వేస్తోంది. వైర్‌లెస్ వ్యాపారాన్ని మూసివేస్తున్నామని, వ్యాపార సంస్థలకు (బీ 2 బీ) సేవలందించడంపైనే దృష్టి సారిస్తామని సంస్థ ఇటీవలే ప్రకటించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే కొత్త పెట్టుబడి ప్రణాళికలను కొత్త ఆర్‌కామ్ వెల్లడించింది. తమ ప్రధాన కార్యాలయం నుంచి హాంకాంగ్, ఐరోపా దేశాలకు డేటా బదిలీకి కల్పించేలా సముద్రం అడుగున కేబుల్ నిర్మాణానికి 600 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నామని సంస్థ ప్రకటించింది. ఇది పూర్తయితే ఏటా రూ.6,400 కోట్ల ఆదాయం లభిస్తుందన్నది సంస్థ అంచనా. వైర్‌లెస్ వ్యాపారాన్ని మూసివేస్తే, వ్యాపార సంస్థలకు సేవలందించే ఎంటర్‌ప్రైజ్ కంపెనీని ప్రారంభించనుండటం సవాలేనని ఆర్‌కామ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బిల్ బార్నీ విలేకరులతో అన్నారు. మొత్తం వ్యాపారంలో ఎంటర్‌ప్రైజ్ కంపెనీ వాటా 10-15 శాతమేనని తెలిపారు. విరివిగా డేటా సేవలందించే కంపెనీలతో పాటు ఎంటర్‌ప్రైజ్ సంస్థలూ ఉండటం పోటీ సంస్థలకు కలిసి వస్తుందని అంగీకరించారు. డేటా రంగంలో అధిక పెట్టుబడులు పెడుతున్నాం, గత 3-5 ఏళ్లలో ఇది మరింత ఎక్కువైందని వివరించారు.

తమ కేబుల్ భారత్ నుంచి ఇటలీకి, హాంకాంగ్‌కు ఉంటుందని, రాబోయే ఆయిదేళ్లలో నిర్మాణం పూర్తయ్యాక, అధిక ఆదాయం ఆర్జిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2020 మూడో త్రైమాసికం నుంచి ఆదాయం లభిస్తుందని, ఏడాదికి బి.డాలర్ల (సుమారు రూ.6,400 కోట్లు) ఆదాయం ఆర్జించే సామర్థ్యం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టులో 30 మంది వరకు భాగస్వాములుంటారని, అందువల్ల ముందస్తు విక్రయాల ద్వారానే 700 మి.డాలర్ల (సుమారు రూ.4,500 కోట్లు) ఆర్జించగలమని పేర్కొన్నారు. ఇప్పటికే అలీబాబా సహా ఆరుగురితో ఒప్పందం చేసుకున్నామని, 300 మి.డాలర్ల పెట్టుబడికి హామీలు లభించాయన్నారు.

అనిల్ అంబానీ తెలుగు సినిమాలు!

దిల్లీ: రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలుగు సహా దక్షిణ భారతీయ భాషల్లో సినిమాలు నిర్మించనుంది. ఇందుకోసం వై నాట్ స్టూడియోస్, ఏపీ ఇంటర్నేషనల్‌తో సంయుక్త సంస్థను ఏర్పాటు చేసింది. ఎస్.శశికాంత్ స్థాపించిన వై నాట్ స్టూడియోస్ తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో 12 సినిమాలు నిర్మించింది. గతేడాది ఈ సంస్థ విక్రమ్ వేద సినిమాను నిర్మించింది. ఏపీ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ సంస్థ విదేశాల్లో 700 సినిమాలు పంపిణీ చేసింది. బ్రిటన్, గల్ఫ్ దేశాల్లో థియేటర్లు నిర్వహిస్తోంది. తమిళం, మలయాళ సినిమాల కాపీరైట్ హక్కులు అత్యధికంగా కలిగి ఉన్న సంస్థ ఏపీ ఇంటర్నేషనల్ అని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. అధిక నాణ్యత కలిగిన దక్షిణభారత చిత్రాలు నిర్మించేందుకు ఈ ఒప్పందం రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు ఉపకరిస్తుందన్నారు.

ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీకి ఎన్‌సీఎల్‌టీ నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో ఉన్న ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ లిమిటెడ్‌కు మంగళవారం జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. రుణ బకాయిలు చెల్లించకపోవడంతో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ లిమిటెడ్‌పై దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వేర్వేరుగా దరఖాస్తు చేశాయి. వీటిపై మంగళవారం ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యుడు రాజేశ్వరరావు విచారణ చేపట్టారు. మొత్తం రుణం రూ.733.72 కోట్లు కాగా, వడ్డీ రూ.178.47 కోట్లతో కలిపి రూ.952.47 కోట్లు బకాయి ఉందని ఎస్‌బీఐ తరఫున ఇండియాలా ఎల్ఎల్‌పీ సంస్థకు చెందిన న్యాయవాది వి.కె.సాజిత్ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. నోటీసులు ఇచ్చినా ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ స్పందించలేదన్నారు. ప్లాంట్ నిర్మాణం, నిర్వహణ నిమిత్తం తీసుకున్న రుణం రూ.1407 కోట్లు చెల్లించలేదని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది తెలిపారు. తమకు ప్రధాన రుణదాతగా ఉన్నామని, హామీదారుగా ఎవెనా ఎనర్జీ వెంచర్, ఏసియన్ జెన్‌కో పీటీఈ లిమిటెడ్, ఏబీపీ పవర్ లిమిటెడ్, ఏబీటీఎల్ హైడ్రో పవర్, అటిర్ ఇన్‌ఫ్రా, కోబాల్ట్ పవర్ లిమిటెడ్ తదితర కంపెనీలున్నాయన్నారు. వెయ్యి ఎకరాల దాకా భూమిని హామీగా చూపినట్లు పేర్కొన్నారు. వాదనలను విన్న సభ్యులు రాజేశ్వరరావు ఈస్ట్ కోస్ట్ ఎనర్జీకి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేశారు.

నేటి మార్కెట్

నేడు సూచీలు ఓ మోస్తరు లాభాలు నమోదుచేసే అవకాశం ఉంది. అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు దన్నుగా నిలవొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చని అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సాధారణ బడ్జెట్ ఫిబ్రవరి 1న ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో మదుపర్లు కొత్త కొనుగోళ్ల విషయంలో ఆచితూచి వ్యవహరించొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. త్రైమాసిక ఫలితాల సీజన్ నడుస్తుండటంతో మార్కెట్లు ఒడుదొడుకుల మధ్య కదలాడొచ్చని అంటున్నారు. నేడు నిఫ్టీ 10690- 10750 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు భావిస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ఆదాయాలు తిరిగి పుంజుకోవచ్చన్న అంచనాలతో ఐటీ షేర్ల జోరు కొనసాగొచ్చని విశ్లేషిస్తున్నారు. చమురు ధరలు దూసుకెళ్తుండటంతో ప్రభుత్వ రంగ మార్కెటింగ్ కంపెనీల నష్టాలు కొనసాగొచ్చు. నేడు ఫలితాలు వెలువరించనున్న హెచ్‌యూఎల్, జీ ఎంటర్‌టైన్‌మెంట్, భారతీ ఇన్‌ఫ్రాటెల్ షేర్లపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు.



ఇండోనేషియాలోని జకార్తా స్టాక్ ఎక్స్ఛేంజీ భవనంలో ఒక అంతస్తు ఆకస్మాత్తుగా కుప్పకూలడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం చోటుచేసుకున్న ఈ దుర్ఘటన కారణంగా ట్రేడింగ్ కొంతసేపు నిలిచిపోయింది. అయితే వ్యవస్థలకు ఎటువంటి నష్టం జరగకపోవడంతో మధ్యాహ్నం తరవాత ట్రేడింగ్ తిరిగి ప్రారంభమైంది.

డివిడెండ్ పంపిణీ పన్ను రద్దుకు వీలు

బడ్జెట్‌పై ఈవై ఇండియా అంచనా

దిల్లీ: రాబోయే బడ్జెట్లో డివిడెండ్ పంపిణీ పన్నును (డీడీటీ) ప్రభుత్వం తొలగించవచ్చని ఈవై ఇండియా అంచనా వేస్తోంది. 'కార్పొరేట్లకు డీడీటీ భారంగా మారింది. పన్ను రేటు అధికంగా ఉండటం సహా పలు అంశాలు ఇబ్బంది పెడుతున్నాయి. పైగా దీనివల్ల ప్రయోజనం కూడా పరిమితమే' అని ఈవై పేర్కొంది. 'స్టాక్ మార్కెట్ ప్రస్తుతం దూకుడు మీద ఉంది. ఈక్విటీ మార్కెట్‌పై దీర్ఘకాలిక పన్నును ప్రవేశపెట్టడం ద్వారా ఆ జోరును తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నించకపోవచ్చ'ని ఇవై ఇండియా పార్ట్‌నర్ అండ్ నేషనల్ లీడర్ గరిమా పాండే తెలిపారు. 'ద్రవ్యపరమైన అవరోధాలు, జీఎస్‌టీ వసూళ్లలో స్తబ్ధత కారణంగా కార్పొరేట్ ఆదాయపు పన్నును ప్రభుత్వం తగ్గించకపోవచ్చ'ని పాండే చెప్పారు.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
ఐసీఐసీఐ లాంబార్డ్	231.76	220.30	2,019.77	1,842.93
రిలయన్స్ నిప్పన్	130	----	470	----
డెన్ నెట్‌వర్క్స్ (కన్సా)	1.73	(38.75)	328.22	298.83
నెట్‌వర్క్ 18	11.43	(77.82)	439.23	353.42
టీవీ 18	15.87	17.27	27.37	254.73
ఎంసీఎక్స్	18.77	34.04	76.52	99.88
ఫెడరల్ బ్యాంక్	260.00	205.65	2,729.83	2556.83

రికార్డులకు విరామం

● లాభాల స్వీకరణతో స్వల్ప నష్టాలు
● కళకళలాడిన ఐటీ షేర్లు

సమీక్ష

సూచీల రికార్డులకు విరామం ఏర్పడింది. వరుసగా మూడు రోజుల లాభాలకు అడ్డుకట్ట పడింది. వాణిజ్య లోటు పెరగడంతో ఐటీ మినహా అన్ని రంగాల్లో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో, సూచీలు గరిష్ఠాల నుంచి వెనక్కి వచ్చాయి. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలకు చమురు ధరల సెగ తగిలింది. ఒపెక్, రష్యా దేశాల ఉత్పత్తి కోత వల్ల బ్యారెల్ ముడిచమురు లభ్యత మూడేళ్ల కనిష్ఠానికి చేరడంతో హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు 3.35 శాతం వరకు నష్టాలు నమోదు చేశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం కూడా సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. విదేశీ కాల్స్ అనుసంధాన ఛార్జీల తగ్గింపు నేపథ్యంలో టెలికాం షేర్ల నష్టాలు కొనసాగాయి. అంతర్జాతీయంగా చూస్తే, ఆసియా, ఐరోపా మార్కెట్లు రాణించాయి.

దేశీయంగా సెన్సెక్స్ ఉదయం 34,877.71 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ 34,936.03 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. అయితే మదుపర్ల లాభాల స్వీకరణతో డీలాపడిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 34,735.55 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 72.46 పాయింట్ల నష్టంతో 34,771.05 వద్ద ముగిసింది. గత మూడు సెషన్లలో సూచీ 410.44 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. నిఫ్టీ సైతం 41.10 పాయింట్లు తగ్గి 10,700.45 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,687.85- 10,762.35 పాయింట్ల మధ్య కదలాడింది.

జీఎన్ఎఫ్‌సీ కుదేల్: గ్యాస్ లీకేజీ నేపథ్యంలో దహేజ్ ప్లాంట్‌ను నిరవధికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో గుజరాత్ నర్మదా వ్యాలీ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ (జీఎన్ఎఫ్‌సీ) షేర్లు కుదేలయ్యాయి. ఇంట్రాడేలో 11.01 క్షీణించిన షేరు.. చివరకు 10.23 శాతం నష్టంతో రూ.485.25 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.859.47 కోట్లు తగ్గి రూ.7,541.70 కోట్లకు చేరింది.


- ఇజ్రాయెల్ సంస్థ కాంటెక్ట్స్‌స్పేస్‌తో జట్టు కట్టినట్లు వెల్లడించడంతో టెక్ మహీంద్రా షేరు 2.56 శాతం పెరిగి రూ.557.80 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టపోయాయి. కోల్ ఇండియా 4.57%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.54%, టాటా మోటార్స్ 2.30%, టాటా స్టీల్ 2.16%, ఐటీసీ 2.06%, ఎస్‌బీఐ 2.02%, పవర్‌గ్రిడ్ 1.66%, భారతీ ఎయిర్‌టెల్ 1.43%, ఎం అండ్ ఎం 1.40%, హెచ్‌డీఎఫ్‌సీ 1.14%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1%, ఏషియన్ పెయింట్స్ 0.94% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. విప్రో 4.88%, ఇన్ఫోసిస్ 3.93%, టీసీఎస్ 3.77%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.43%, డాక్టర్ రెడ్డీస్ 1.17%, హిందుస్థాన్ యునిలీవర్ 1.04%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 3.51% నీరసపడింది.

నేటి బోర్డు సమావేశాలు


★ హిందుస్థాన్ యునిలీవర్ ★ భారతీ ఇన్‌ఫ్రాటెల్ ★ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ★ అదానీ పవర్ ★ అదానీ ట్రాన్స్‌మిషన్ ★ డీసీబీ బ్యాంక్ ★ జుబిలెంట్ లైఫ్ సైన్సెస్ ★ మైండ్ ట్రీ ★ శ్రేయీ ఇన్‌ఫ్రా ★ స్టెరిలైట్ టెక్నాలజీస్ ★ టాటా స్పాంజ్ ఐరన్ ★ తిరుమలాయ్ కెమికల్స్

విప్రో



రూ.316.90 వద్ద ప్రారంభమై రూ.316- 334 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.315తో పోలిస్తే రూ.16.95 (5.38%) లాభంతో రూ.331.95 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 61,66,445.

కోల్ ఇండియా



రూ.305.90 వద్ద మొదలై రూ.290.60- 305.90 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.305.90తో పోలిస్తే రూ.14.30 (4.67%) నష్టంతో రూ.291.60 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 40,69,770 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1910.00	రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్	874.00
హిందుస్థాన్ యునిలీవర్	1389.50	జస్ట్ డయల్	647.00
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్	1360.80	గృహ్ ఫైనాన్స్	554.00
ఇన్ఫోసిస్	1134.80	బజాజ్ కార్ప్	525.00
సన్‌టీవీ నెట్‌వర్క్	1097.80		
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	955.00		


52 వారాల కనిష్ఠం (రూ.లలో)

ఎంసీఎక్స్	875.10

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
16/01	8,203	7,510	693	4,003	4,249	−246
12/01	5,857	6,015	−158	3,264	2,568	696
11/01	4,978	5,601	−624	3,636	2,866	770
10/01	3,797	4,369	−572	3,943	3,343	600
09/01	4,872	5,176	−304	4,018	3,495	523

16వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో) కోడిగుడ్లు

హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	410
బెంగళూరు	405	చెన్నై	405
17న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	410	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 423.55 (420.60) 2318100
AMBUJA CEMEN 277.85 (276.95) 2689358
ASIAN PAINTS 1188.75 (1204.05) 557253
AUROBIND PHA 641.10 (658.00) 2167758
AXIS BANK LT 563.20 (560.55) 5993564
BAJAJ AUTO L 3160.05 (3166.00) 175692
BAJAJ FINANC 1687.35 (1738.15) 1076581
BHARTI AIRTE 497.25 (504.50) 5786478
BHARTI INFRA 367.95 (370.50) 1797985
BOSCH LTD 19859.00 (19903.65) 12326
BPCL 479.45 (487.20) 4661889
CIPLA 601.40 (610.25) 1088762
COAL INDIA L 291.60 (305.90) 4069770
DR. REDDYS 2468.70 (2431.75) 372133
EICHER MOTOR 27891.20 (27981.50) 46537
GAIL 478.40 (489.25) 2123599
HCL TECH 949.25 (909.25) 4481702
HDFC 1845.95 (1871.20) 5373079
HDFC BANK 1900.15 (1897.75) 1611346
HERO MOTOCOR 3586.10 (3628.80) 271813
HINDALCO IND 260.55 (266.70) 8447591
HINDUSTAN UN 1382.00 (1367.20) 896453
HPCL 410.40 (426.05) 5555482
ICICI BANK 334.10 (329.30) 26707100
INDIABULLS H 1204.90 (1225.15) 1179430
INDIAN OIL 384.15 (390.85) 2903042
INDUSINDBANK 1664.60 (1682.40) 829183
INFOSYS LTD 1122.85 (1081.15) 11323483
ITC 261.70 (267.60) 12935712
KOTAK MAHIND 1033.25 (1038.35) 1158187
LARSEN & TOU 1326.20 (1325.95) 3139385
LUPIN 906.75 (916.55) 963028
M&M 746.70 (759.20) 1611817
MARUTI SUZIK 9322.05 (9358.45) 364816
NTPC LTD 173.25 (172.95) 8448334
ONGC 197.20 (196.60) 5778244
POWER GRID C 196.20 (199.30) 7428122
RELIANCE IND 922.95 (949.15) 4948895
SBI 296.15 (302.60) 18040940
SUN PHARMA 577.70 (576.45) 4868363
TATA CONSULT 2850.85 (2746.10) 2133876
TATA MOTORS 421.90 (432.35) 5623745
TATA STEEL L 765.75 (783.50) 2791328
TECH MAHINDR 557.65 (543.75) 4791310
ULTRATECH 4545.10 (4520.15) 315736
UPL LIMITED 766.85 (774.35) 1222684
VEDANTA LIMI 330.15 (339.20) 8117693
WIPRO 331.95 (315.00) 6166445
YES BANK LTD 334.85 (336.00) 7296505
ZEE ENTERTAI 613.40 (606.15) 4805427

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1509.25 (1514.80) 131256
ACC 1850.25 (1830.00) 386131
ASHOK LEYLAN 122.30 (126.10) 11527983
AVENUE SUPER 1187.00 (1228.85) 409503
BAJAJ FINSER 4956.80 (5010.35) 124186
BANK OFBAROD 156.95 (164.40) 15621689
BEL 173.20 (178.60) 4534786
BHEL 99.00 (101.45) 9669560
BRITANNIA 4677.35 (4719.85) 168099
CADILA HEALT 436.10 (440.20) 347544
COLGATE PALM 1131.15 (1140.70) 292396
CONTAINER 1412.15 (1422.05) 278149
CUMMINS INDI 935.90 (935.95) 226349
DABUR INDIA 358.40 (361.25) 919047
DLF LIMITED 257.55 (266.85) 5899206
EMAMI LIMITE 1274.10 (1292.55) 101042
GLAXOSMI CON 6507.05 (6506.45) 4909
GLAXOSMI PHA 2469.75 (2475.05) 15130
GLENMARK PHA 625.85 (624.40) 1200060
GODREJ CONSU 1005.65 (1000.70) 378901
HAVELLS INDI 556.70 (558.50) 818384
HINDUSTAN ZI 315.45 (322.05) 1785116
ICICI PRU LI 412.25 (417.90) 1902052
IDEA CELLULR 102.80 (104.60) 16051660
INTERGLOBE A 1181.90 (1223.80) 561337
JSW STEEL LT 281.20 (285.00) 3107547
LIC HOUS.FIN 553.70 (568.65) 1324693
MARICO LIMIT 313.65 (311.40) 608077
MCDOWELL 3693.50 (3790.50) 343436
MOTHERSON 377.80 (383.10) 1445648
MRF 70284.55 (71534.00) 7410
NHPC LTD 30.30 (31.60) 9769565
NMDC LTD 148.35 (154.45) 5107267
OIL INDIA 378.60 (378.40) 425674
ORACLE FIN S 4091.05 (4068.45) 25793
P&G HYG&HEAL 9374.30 (9298.80) 12409
PETRONET LNG 238.65 (248.75) 4417779
PIDILITE IND 900.25 (904.65) 475519
PIRAMAL ENTE 2799.25 (2844.00) 150242
PNB 165.55 (172.15) 11916843
POWER FIN CO 121.00 (124.60) 4442672
RURAL ELEC C 153.95 (160.30) 4605921
SAIL 94.30 (100.35) 18073465
SHREE CEMENT 19104.25 (19081.50) 11820
SHRIRAM TRAN 1510.95 (1499.70) 606477
SIEMENS 1291.55 (1305.15) 212742
SUN TV LTD 1079.15 (1073.50) 1403769
TATA POWER 93.65 (97.95) 9672170
TITAN IND 889.40 (918.25) 2383484
TORRENT PHAR 1400.80 (1416.30) 70705

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 258.55 (262.95) 5005903
ADANI ENTERP 194.60 (198.20) 7331265
ADANI POWER 42.25 (44.20) 10240202
ALL BANK 68.80 (72.05) 2553713
AMARA RAJA 856.85 (864.20) 705166
ANANT RAJIND 77.50 (80.90) 2856655
ANDHRA BANK 55.20 (57.40) 2030382
APOLLO HOSPI 1147.20 (1179.45) 161108
APOLLO TYRES 271.70 (278.70) 2962659
APTECH 370.80 (372.10) 930680
BAJAJ ELECT. 549.50 (547.45) 480453
BAJAJ HIND 15.40 (16.40) 6017164
BAJAJ HOLDIN 2776.70 (2808.90) 7785
BALAJI TELE 159.10 (158.65) 417831
BALLARPUR IN 17.25 (18.25) 4094751
BALRAMPUR CH 130.55 (135.85) 2001619
BANK OF MAHA 21.80 (22.10) 771690
BANK OFINDIA 156.90 (162.40) 3986223
BATA INDIA 727.60 (746.15) 436470
BGR ENERGY S 143.55 (150.95) 209865
BHARAT FORGE 715.20 (730.75) 778726
BHUSHAN STEE 68.15 (72.10) 1847654
BIOCON LTD 534.80 (539.00) 854040
BOMBAY DYE 266.10 (283.45) 3345053
CANARA BANK 339.50 (354.35) 1900129
CEAT LIMITED 1905.40 (1973.05) 349799
CENTRAL BANK 73.60 (74.80) 335864
CHAMBAL FERT 152.60 (156.60) 555785
CHENNAI PETR 453.10 (460.80) 393294
CITY UNIBANK 174.60 (178.20) 343170
CORPO BANK 39.40 (40.05) 217229
COX & KINGS 264.00 (267.25) 143621
D B REALTY L 72.05 (74.70) 2275122
DELTA CORP L 328.60 (317.85) 14884470
DENA BANK 25.40 (26.10) 1671668
DHANALAKBANK 28.45 (29.65) 737761
DIVIS LAB 1092.75 (1078.35) 804279
EDELWEISS CA 273.90 (278.70) 1458618
EID PARRY 366.55 (374.65) 99803
EIH 216.15 (193.00) 2161455
ESSAR SHIPPI 29.75 (30.80) 185425
ESTER INDUST 65.65 (71.25) 392764
EXIDE INDUST 228.30 (232.10) 3110314
FEDERAL BANK 104.75 (113.60) 42036861
FINOLEX CABL 713.10 (718.95) 54798
G E SHIP LTD 438.15 (444.00) 94214
GAMMON INFRA 4.25 (4.45) 26173333
GATI LIMITED 149.00 (143.70) 9726893
GAYATRI PROJ 213.30 (218.60) 899882
GITANJALIGEM 76.35 (81.15) 5181405
GMR INFRASTR 22.50 (22.10) 142090074
GODREJ IND 616.05 (618.75) 424725
GRASIM IND 1229.00 (1242.85) 857580
GUJ ALK&CHEM 891.10 (919.10) 404076
GUJ NRE COKE 1.45 (1.45) 8716100
HCL INFOSYS 59.25 (60.55) 4224672
HDFC BANK 1920.00 (1857.80) 210000
HEXA TECH 357.75 (358.80) 913451
HIMACHAL FUT 32.35 (34.70) 11986013
HINDU MOTORS 11.45 (12.70) 2479019
HOUSING DEV 63.85 (65.55) 25543720
IDBI 59.60 (62.90) 3808915
IDFC 59.90 (63.95) 15936686
IFCI 31.25 (32.65) 30829852
IL&FS TRANS 84.30 (87.25) 615280
INDBULLS REL 241.85 (256.60) 9536204
INDIA CEM 195.40 (201.40) 11320651
INDIAN BANK 370.00 (382.30) 743640
INDO RAMA SY 50.95 (53.30) 537726
INDRAPRASTHA 316.80 (323.65) 1502117
INGERSOLL-R 848.40 (871.30) 36405
IOB 22.95 (23.45) 641309
IPCA LAB 574.15 (568.90) 143947
IRB INFRA DE 241.75 (249.35) 1110778
J&K BANK 78.05 (79.75) 388127
JAI CORP 200.95 (209.50) 2317778
JAIN IRRIGAT 138.50 (143.30) 13564775
JAYPEE INFRA 18.30 (20.30) 9401888
JET AIRWAYS 790.35 (821.00) 3326799
JINDAL SAW 169.35 (175.15) 2793807
JINDAL STEEL 270.70 (267.30) 18387871
JK LAKSHMI C 448.30 (438.45) 191934
JK PAPER LIM 156.40 (158.70) 781479
JM FINANCIAL 163.70 (168.55) 1159325
JP ASSOCIATS 21.40 (23.00) 63848493
JSW ENERGY L 92.00 (95.60) 12751222
JUBILANT FOO 1899.55 (1894.90) 723285
JUBILANT ORG 810.85 (835.15) 1241327
JYOTHY LABS 369.35 (371.70) 56628

ఘనం (+)

నిఫ్టీ	16న	మార్పు %
WIPRO	331.95	5.38
HCL TECH	949.25	4.40
INFOSYS	1122.85	3.86
TCS	2850.85	3.81
TECH MAHINDRA	557.65	2.56
DR. REDDYS LAB	2468.70	1.52
ICICI BANK	334.10	1.46

గ్రహణం (-)

నిఫ్టీ	16న	మార్పు %
COAL INDIA	291.60	-4.67
HPCL	410.40	-3.67
BAJAJ FINANCE	1687.35	-2.92
RELIANCE IND	922.95	-2.76
VEDANTA	330.15	-2.67
AUROBINDO PHA	641.10	-2.57
TATA MOTORS	421.90	-2.42

JYOTI STRUC 13.30 (14.00) 826590
KARNATA BANK 153.45 (160.90) 4554446
KEC INTL LTD 373.50 (384.75) 424385
KOLTE PATIL 374.10 (383.30) 390402
KPIT CUMMINS 201.65 (201.15) 2410213
L&TFIN.HOLD 173.80 (178.90) 4574298
LAK VIL BANK 137.15 (141.55) 483344
M & M FINANC 480.75 (488.35) 2336943
MANAPPURAM G 118.00 (123.50) 6838517
MMTC LIMITED 66.05 (67.95) 1364761
MOSER-BEAR 5.80 (6.30) 2572781
MPHASIS LTD 741.55 (748.90) 255128
MRPL 129.95 (132.50) 2711450
MTNL 28.35 (29.10) 5368572
NCC LIMITED 126.95 (133.75) 7242526
NETWORK18 FI 56.85 (60.85) 9645731
NEULAND LAB 893.40 (887.50) 60047
NIIT LTD 111.85 (113.65) 2126786
NIIT TECHNOL 708.85 (700.85) 964464
OMAXE LTD 228.85 (230.45) 563004
ONMOBILE GLO 60.05 (63.40) 911219
ORIENTALBANK 117.15 (122.30) 2605675
PARSVNATH DE 27.85 (29.30) 265404
PATEL ENGG 85.15 (90.10) 1072114
PFIZER 2028.50 (2032.25) 40413
POLARIS SOFT 409.75 (414.25) 362724
POWERTRADING 116.40 (119.95) 1785636
PRAJ IND 117.55 (124.25) 1639110
PRISM CEMENT 148.65 (139.60) 11043599
PUNJ LLOYD 25.10 (26.70) 3362069
PUNJAB & SIN 47.60 (49.30) 167337
PURAVANKARA 156.80 (163.20) 469415
PVP VENTURES 9.80 (10.10) 2443339
PVR LIMITED 1438.20 (1459.35) 97676
RADICO KHAIT 316.15 (326.15) 1948029
RAJESH EXPOR 852.15 (844.60) 545527
RALLIS INDIA 271.60 (276.60) 1291727
RAMCO IND 309.05 (319.80) 667056
RAMCO SYS 537.15 (552.40) 51975
RAMKY INFRA 220.40 (230.70) 178648
RAYMOND 1092.85 (1128.90) 516303
RELIANCE CAP 578.15 (602.15) 7398286
RELIANCE COM 31.20 (31.55) 144438289
RELIANCE INF 536.50 (557.85) 2982930
RELIANCE POW 51.20 (54.00) 18749286
ROLTA INDIA 75.30 (75.00) 4827059
SAGAR CEMENT 1058.15 (1070.15) 24029
SAREGAMA 814.00 (827.95) 171566
SHANTHI GEAR 162.95 (167.15) 36523
SHIPPNG CORP 93.15 (96.00) 1227929
SHREE RENUKA 16.15 (16.60) 2490114
SINTEX IND 24.65 (25.40) 4594975
SOBHA DEVELO 583.00 (594.45) 293897
SOUTHINDBANK 31.85 (32.65) 8959096
SRS LIMITED 1.90 (1.85) 316414
STERLITE TEC 363.30 (371.35) 1717226
SUN PHARMA 507.65 (519.35) 291886
SUND FASTNER 561.60 (575.40) 134514
SUZLON ENERG 15.25 (16.05) 49819568
SYND. BANK 74.80 (78.35) 3695531
TATA CHEM 740.95 (766.50) 698181
TATA COFFEE 162.60 (168.50) 700086
TATA COMMUN 651.85 (673.30) 569013
TATA GLOBAL 316.40 (323.00) 4683847
TATA METALIK 899.65 (931.75) 166613
TATA MOT DVR 243.70 (246.45) 2970779
THE INDIAN H 144.55 (141.15) 2917868
TORRENT POWE 281.55 (291.60) 759804
TRIVENI ENGG 74.00 (75.80) 613924
TTK PRESTIGE 7979.60 (8024.50) 3264
TV TODAY NET 431.50 (459.25) 235032
TV18 BROADCA 62.45 (65.45) 23720594
TVS MOTOR 722.55 (740.45) 835847
UCO BANK 30.85 (31.60) 1062909
UNION BANK 136.35 (139.55) 5469268
UNITECH 8.55 (9.30) 60676540
UNITED BANK 17.85 (18.35) 733144
UNITED BREWE 1087.05 (1146.95) 323975
USHA MARTIN 27.45 (29.25) 3122100
VADILAL INDU 959.15 (954.10) 29404
VENKYS 2553.50 (2579.55) 162898
V-GUARD IND 233.00 (231.95) 1198721
VIJAYA BANK 65.50 (67.40) 1073046
VIP 360.75 (367.45) 454261
VOLTAS 623.05 (632.45) 921801
ZEE LEARN LI 46.50 (46.80) 8356259
ZUARI GLOBAL 225.05 (236.55) 89606
ZYDUS WELLNE 1105.85 (1117.55) 11438

ALPHAGEO 942.90 (976.70) 5925
AMAR RAJA BA 854.85 (863.30) 45831
ANDHRA BANK 55.15 (57.35) 217626
ANDHRA CEMEN 13.77 (14.41) 161044
ANDHRA PAPER 375.65 (402.10) 53118
ANDHRA PETRO 60.10 (62.95) 91772
ANDHRA SUGAR 639.05 (636.25) 18376
ANJANI PORTL 251.45 (252.85) 3301
ASTRA MICROW 121.75 (123.50) 458348
AUROBINDO PH 641.95 (657.95) 143997
AVANTEL SOFT 526.50 (554.20) 12069
AVANTI FEEDS 2506.95 (2545.85) 12984
BALAJI AMIN 714.35 (740.90) 14268
BARTRONICS 14.93 (15.47) 29334
BHAGIRA CHEM 345.05 (346.35) 1628
BHAGYA NAG 47.55 (49.50) 22448
BRILLIANT SE 18.72 (18) 8433030
CAMBRIDGE TE 98.95 (97.05) 3895
COMBAT DRUGS 27.40 (27.40) 1953
CONT COFFEE 297.35 (302.20) 8939
COROMAN FERT 560.50 (573.75) 49769
CYIENT LIMIT 582.35 (590.20) 5476
DECCAN CEMEN 619.70 (630.20) 4864
DIVI'S LAB 1093.55 (1079.75) 107737
DR REDDY 2461.70 (2433.25) 34158
FOUR SOFT 104 (105.35) 10354
GATI CORPN 148.95 (143.65) 1371042
GAYATRI PROJ 212.75 (218.25) 89254
GMR INFRASTR 22.50 (22.10) 11602749
GRANULES (I) 139.60 (144.75) 255337

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 25.55 (26.85) 778302
HBL NIFE POW 68.45 (71.50) 284404
HERITAGE FOO 821.85 (830.90) 8772
HYD INDUS 1628.10 (1690.80) 1913
IDL INDUSTRS 657.40 (661.30) 3855
INNAREDY COM 6.43 (6.57) 256046
IVRCL INFRAS 6.44 (6.77) 399006
KAKATIYA CEM 401.95 (403.70) 30460
KAVERI SEED 514.45 (519.55) 57367
KERNEX MICRO 60.20 (57.35) 200829
KNR CONSTRUC 313.20 (317) 16258
LANCO INDUS 407.40 (428.45) 39922
LANCO INFRAT 2.34 (2.24) 9583264
LAURUS LABS 533.75 (545.35) 6924
LOKESH MACH 73.10 (75.75) 65434
MADHUCON PRO 35.50 (37.30) 50836
MIC ELECTRON 9.44 (9.33) 245030
MOLD-TEK.TEC 73.85 (74.65) 2400
MOLDTK PLA 331.40 (337.05) 10174
NAGARJAGRICH 58.10 (60.90) 78646
NATCO PHARMA 1018.10 (1036.25) 11070
NAVA BH VENT 171.35 (181.35) 212234
NCC 126.90 (133.70) 815624
NCL IND 270 (271.75) 13511
NEHA INTER 8.99 (9.79) 96106
NEULAND LAB 892.05 (890.80) 5946
NIHAR INFO 13.80 (14.21) 1950
PANYAM CEMEN 63.65 (64.15) 52686
PENNER IND 68.35 (71.75) 139924
PHYTOCHEM I 72.35 (73.70) 13502
PIONEER DIST 206.75 (217.25) 7688
PITTI LAMIN 99.60 (105.10) 32991
POKARNA 231.40 (250.30) 50397
PRISM CEMENT 148.30 (139) 1639634
PRUDENTL PHA 5.54 (5.71) 216576
RAIN INDUSTR 419.85 (439) 410880
SAGAR CEM 1059.60 (1061.55) 4726
SAMKRG PIST 356.80 (370.65) 8537
SATVAH. ISPA 32.75 (33.85) 9725
SMS PHARMA 101.65 (105.10) 9543
SPHERE GLOBA 43.40 (46.65) 16931
STEEL EXCHAN 36.20 (38.05) 157546
SUJANA METAL 1.83 (1.92) 79132
SUJANA TOWER 5.15 (5.41) 21180
SUJANA UNIVE 1.27 (1.21) 283633
SURYALAKSH.C 102.10 (106.90) 10283
SUVEN PHARMA 199.35 (207.50) 52480
TAJ GVK HOTE 176.80 (177.45) 19374
TANLA 40.90 (43.35) 310145
TERA SOFTWAR 67.95 (70.90) 6030
VICEROY HOTE 19.95 (20.55) 229508
VIMTA LABS 174.65 (182.55) 20026
VISTA PHARMA 45.40 (47.05) 31281
VIVIMED LABS 101.90 (104.95) 155981
VJIL CONSULT 17.95 (17.10) 600
YBRANT DIGIT 7.14 (7.93) 1527082
ZENTECH 135.60 (137.45) 88841


ఛాంపియన్స్

ఇక కష్టమే! బౌలర్లు రాణించినా.. బ్యాట్స్‌మెన్‌తో మళ్లీ నిరాశే.

అసాధారణంగా పోరాడితే తప్ప, అద్భుతంగా ఆడితే తప్ప, సిరీస్‌ను నిలుపుకోడం కోహ్లీసేనకు కష్టమే. సెంచూరియన్ టెస్టులో ఓటమి ముప్పు పొంచి ఉంది. అస్థిరమైన బౌన్స్‌తో బ్యాటింగ్‌కు కష్టంగా ఉన్న పిచ్‌పై దక్షిణాఫ్రికా పేస్ దళం చెలరేగిపోతుంటే 287 పరుగుల లక్ష్యం అందనంత దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. నాలుగో రోజు ఆట ఆఖరుకే టాప్ లేచిపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో గొప్పగా పోరాడిన కెప్టెన్ కోహ్లి సహా భారత్ మూడు వికెట్లు చేజార్చుకుంది. స్కోరు 35 పరుగులే. 2-0 ఆధిక్యానికి దక్షిణాఫ్రికాకు కావాల్సింది ఏడు వికెట్లే. భారత్ నెగ్గాలంటే ఇంకా 252 పరుగులు చేయాలి. ఆఖరి రోజు చేతిలో ఉన్న ఏడు వికెట్లతో టీమ్‌ఇండియా ఏమాత్రం పోరాడుతుందో చూడాలి.

సెంచూరియన్‌లో రెండో టెస్టు

ఓటమి తరుముకొస్తోంది



రాహుల్ వికెట్ తీసిన ఆనందంలో ఎంగిడి

సెంచూరియన్

రెండో టెస్టులో భారత జట్టు ఓటమికి ఎదురీదుతోంది. మంగళవారం, నాలుగో రోజు 287 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. ఆట ముగిసే సమయానికి 35 పరుగులకే మూడు వికెట్లు చేజార్చుకుంది. కెప్టెన్ కోహ్లి (5) కూడా ఔట్ కావడం భారత్ ఆశలకు కోలుకోలేని దెబ్బ. పుజారా (11), పార్థివ్ పటేల్ (5) క్రీజులో ఉన్నారు. ఉదయం 90/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 258 పరుగులకు ఆలౌటైంది. మహ్మద్ షమి (4/49) ఆతిథ్య జట్టును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. డివిలియర్స్ (80), ఎల్గర్ (61), డుప్లెసిస్ (48) రాణించారు. కోహ్లి అద్భుత శతకం (153; 217 బంతుల్లో 15×4)తో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 307 పరుగులు చేసింది.

ఛేదనలో వేదన: లక్ష్యం 287. చిన్నదేమీ కాదు. అందునా దక్షిణాఫ్రికా గడ్డపై. అదే సమయంలో అసాధ్యమైందేమీ కాదు. కానీ అస్థిరమైన బౌన్స్ బ్యాట్స్‌మెన్‌కు పెను సవాల్‌ను విసురుతోంది. బ్యాటింగ్‌కు కష్టంగా ఉన్న పిచ్‌పై భారత్ త్వరగానే కష్టాల్లోకి కూరుకుపోయింది. విలువైన కోహ్లి వికెట్ సహా కీలకమైన మూడు వికెట్లు చేజార్చుకుంది. విజయ్‌ను ఔట్ చేయడం ద్వారా ఎనిమిదో ఓవర్లో భారత్ పతనాన్ని రబాడ (1/5) ఆరంభించాడు. తక్కువ ఎత్తులో వచ్చిన బంతిని విజయ్ (9) వికెట్ల మీదికి ఆడుకున్నాడు. ఆ తర్వాత ఎంగిడి రెండు వికెట్లతో భారత్‌ను గట్టి దెబ్బతీశాడు. రాహుల్ (4) మరోసారి పేలవ షాట్‌కు నిష్క్రమించాడు. ఆఫ్‌స్టంప్ ఆవల ఎంగిడి (2/14) బంతిని కట్‌చేయబోయిన అతడు.. నేరుగా బ్యాక్‌వర్డ్ పాయింట్లో మహారాజ్‌కు చిక్కాడు. క్రీజులో కోహ్లి ఉండుంటే ఐదో రోజు అవకాశాలు భిన్నంగా ఉండేవే. కానీ ఫామ్‌లో ఉన్న అతణ్ని ఎంగిడి ఎక్కువసేపు నిలువనివ్వలేదు. బంతి ఎక్కువ ఎత్తులో వస్తుందనుకొని ఎగిరి అడ్డంగా అడబోయిన కోహ్లి.. అది కాస్త తక్కువ ఎత్తులో రావడంతో వికెట్ల ముందు దొరికిపోయాడు. సమీక్ష కోరినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత పుజారా, పార్థివ్ పటేల్ కష్టపడి మరో వికెట్ పడకుండా అడ్డుకున్నారు.


కోహ్లి

విజృంభించిన షమి: అంతకుముందు షమి విజృంభించడంతో భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికాను 258 పరుగులకు కట్టడి చేయగలిగింది. ఓవర్‌నైట్ స్కోరు 90/2తో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ కొనసాగించింది. మూడో రోజు బుమ్రా ధాటికి 3 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన జట్టును ఆదుకున్న డివిలియర్స్, ఎల్గర్ మంగళవారం కూడా చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించారు. దీంతో దక్షిణాఫ్రికా ఓ దశలో 144/2తో అత్యంత పటిష్ట స్థితిలో నిలిచింది. కానీ షమి అద్భుత బౌలింగ్‌లో భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. అతడు విజృంభించడంతో దక్షిణాఫ్రికా 19 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు చేజార్చుకుని 163/5కు చేరుకుంది. షమి వేసిన ఇన్నింగ్స్ 42వ ఓవర్లో ఎక్స్‌ట్రా బౌన్స్‌కు బోల్తాకొట్టిన డివిలియర్స్.. వికెట్‌కీపర్ చేతికి చిక్కాడు. నాలుగు ఓవర్ల తరాత షమి షార్ట్ బంతిని పుల్ చేయబోయిన ఎల్గర్.. స్క్వేర్ లెగ్‌లో నేరుగా రాహుల్‌కు క్యాచ్ ఇచ్చాడు. షమి తన తర్వాతి ఓవర్లోనే డికాక్ (12)నూ వెనక్కి పంపాడు. డికాక్.. వికెట్‌కీపర్ పార్థివ్ చేతికి చిక్కాడు. ఆ దశలో నిలిచిన డుప్లెసిస్.. ఫిలాండర్ (26)తో కలిసి జట్టు స్కోరు 200 దాటించాడు. ఓ దశలో దక్షిణాఫ్రికా 209/5తో నిలిచింది. ఐతే విజృంభించిన భారత బౌలర్లు 49 పరుగుల వ్యవధిలో మిగతా ఐదు వికెట్లు పడగొట్టారు.

వారెవ్వా కోహ్లి..: భారత్ ఆఖరి రోజు వరకు పోటీలో నిలిచిందంటే అది కోహ్లి చలవే. చిరస్మరణీయ శతకంతో అతడు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని 28 పరుగులకు పరిమితం చేశాడు. మిగతా బ్యాట్స్‌మెనంతా కలిసి చేసిన పరుగులకన్నా కోహ్లి ఒక్కడు చేసిన పరుగులే ఎక్కువ కావడం విశేషం. ఓవర్‌నైట్ 183/5తో మూడో రోజు, సోమవారం భారత్ తొలి ఇన్నింగ్స్ కొనసాగించగా.. కోహ్లి (ఓవర్‌నైట్ 85) త్వరగానే టెస్టుల్లో తన 21వ శతకాన్ని పూర్తి చేశాడు. ఎంగిడి వేసి ఇన్నింగ్స్ 65వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన కోహ్లి.. అతడి తర్వాతి ఓవర్లో ఓ డబుల్‌తో మూడంకెల స్కోరును అందుకున్నాడు. కానీ ఇంతలోనే భారత్‌కు పెద్ద దెబ్బతగిలింది. ఏమాత్రం రనౌటయ్యే అవకాశం లేకున్నా.. నిర్లక్ష్యంతో రనౌటై అందరినీ షాక్‌కు గురిచేశాడు హార్దిక్ పాండ్య. రబాడ బంతిని మిడాన్‌లో ఆడి, సింగిల్ తీయబోయిన అతడు..కోహ్లి వద్దనడంతో వెనుదిరిగాడు. కానీ చాలా తాపీగా పరుగెత్తాడు. పాండ్య (15) కాలు, బ్యాటు క్రీజుపైన గాల్లో ఉండగా ఫిలాండర్ త్రో వికెట్లను పడగొట్టింది. అప్పటికి స్కోరు 209. ఐతే వీలైనప్పుడల్లా బౌండరీ బాదిన కోహ్లికి అశ్విన్ మంచి సహకారం ఇవ్వడంతో ఇన్నింగ్స్ మళ్లీ కుదుటపడింది. అశ్విన్ (38; 54 బంతుల్లో 7×4) కూడా చక్కని స్ట్రోక్‌ప్లేను ప్రదర్శించాడు. రబాడ బౌలింగ్‌లో అతడు వరుసగా మూడు ఫోర్లు సాధించడం విశేషం. ఓ దశలో 280/6తో నిలిచిన భారత్.. దక్షిణాఫ్రికా స్కోరును దాటుతుందేమో అనిపించింది. కానీ 27 పరుగులకే భారత్ మిగతా నాలుగు వికెట్లు చేజార్చుకుంది. అశ్విన్‌ను ఔట్ చేయడం ద్వారా ఫిలాండర్.. 71 పరుగుల ఏడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. షమి వెంటనే ఔటైనా.. కాసేపు నిలిచిన ఇషాంత్ (20 బంతుల్లో 3) సహకారంతో కోహ్లి జట్టు స్కోరును 300 దాటించాడు. చివరికి ఆఖరి వికెట్ రూపంలో నిష్క్రమించాడు. వర్షం వల్ల సోమవారం మొత్తం 60 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 335
భారత్ తొలి ఇన్నింగ్స్: 307
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ ఎల్బీ (బి) బుమ్రా 1; ఎల్గర్ (సి) రాహుల్ (బి) షమి 61; ఆమ్లా ఎల్బీ (బి) బుమ్రా 1; డివిలియర్స్ (సి) పార్థివ్ (బి) షమి 80; డుప్లెసిస్ (సి) అండ్ (బి) బుమ్రా 48; డికాక్ (సి) పార్థివ్ (బి) షమి 12; ఫిలాండర్ (సి) విజయ్ (బి) ఇషాంత్ 26; మహారాజ్ (సి) పార్థివ్ (బి) ఇషాంత్ 6; రబాడ (సి) కోహ్లి (బి) షమి 4; మోర్నీ మోర్కెల్ నాటౌట్ 10; ఎంగిడి (సి) విజయ్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (91.3 ఓవర్లలో ఆలౌట్) **258; వికెట్ల పతనం: 1–1, 2–3, 3–144, 4–151, 5–163, 6–209, 7–215, 8–245, 9–245; బౌలింగ్:** అశ్విన్ 29.3-6-78-1; బుమ్రా 20-3-70-3; ఇషాంత్ 17-3-40-2; షమి 16-3-49-4; పాండ్య 9-1-14-0

భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబాడ 9; రాహుల్ (సి) మహారాజ్ (బి) ఎంగిడి 4; పుజారా బ్యాటింగ్ 11; కోహ్లి ఎల్బీ (బి) ఎంగిడి 5; పార్థివ్ పటేల్ బ్యాటింగ్ 5; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (23 ఓవర్లలో 3 వికెట్లకు) 35
వికెట్ల పతనం: 1-11, 2-16, 3-26; **బౌలింగ్:** ఫిలాండర్ 6-3-6-0; రబాడ 5-2-9-1; ఎంగిడి 6-2-14-2; మోర్నీ మోర్కెల్ 5-3-14-0; మహారాజ్ 1-0-1-0

గాయపడ్డ సాహా స్థానంలో కార్తీక్



సెంచూరియన్: భారత వికెట్‌కీపర్ వృద్ధిమాన్ సహా తొడ కండరాల గాయంతో ఆఖరిదైన మూడో టెస్టుకు దూరమయ్యాడు. ఈ మ్యాచ్‌కు సెలక్షన్ కమిటీ అతడి స్థానంలో దినేశ్ కార్తీక్‌ను ఎంపిక చేసింది. మూడో టెస్టుకు ముందు అతడు జట్టుతో చేరతాడు. 32 ఏళ్ల కార్తీక్ భారత్ తరపున 23 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. చివరిసారి 2010లో టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగాడు. ఈ నెల 11న ప్రాక్టీస్ సందర్భంగా గాయపడ్డ సాహా.. ప్రస్తుతం జరుగుతున్న రెండో టెస్టులో కూడా లేని సంగతి తెలిసిందే. అతడి స్థానంలో పార్థివ్ పటేల్ వికెట్‌కీపింగ్ చేస్తున్నాడు. మూడో టెస్టు ఈ నెల 24న జొహానెస్‌బర్గ్‌లో ఆరంభమవుతుంది.

కోహ్లికి జరిమానా

ప్రిటోరియా: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి జరిమానాకు గురయ్యాడు. రెండో టెస్టులో సోమవారం ఆట సందర్భంగా చిత్తడిగా ఉన్న ఔట్‌ఫీల్డ్ కారణంగా బంతి తడిసిపోతోందని అంపైర్‌కు పదేపదే ఫిర్యాదు చేయడమే కాకుండా, కోపంగా బంతిని నేలకు కొట్టినందుకు కోహ్లిపై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నాడు. కోహ్లి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత పెట్టాడు. అలాగే ఓ అపరాధ పాయింట్‌ను కూడా ఇచ్చాడు. రెండేళ్ల కాలంలో నాలుగు లేదా అంతకన్నా ఎక్కువ అపరాధ పాయింట్లు అందుకున్న ఆటగాడిపై ఒక టెస్టు లేదా రెండు వన్డేలు లేదా రెండు టీ20 మ్యాచ్‌ల నిషేధం పడుతుంది.

భారత్–అఫ్గాన్ టెస్టు బెంగళూరులో

దిల్లీ: చరిత్రాత్మక టెస్టు మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. గతేడాది ఐర్లాండ్‌తో పాటు టెస్టు హోదా పొందిన అఫ్గానిస్థాన్.. తన తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. భారత్‌తో జూన్ 14న బెంగళూరు వేదికగా అఫ్గాన్ టెస్టు అరంగేట్రం చేయనుంది. ఈ మేరకు మంగళవారం బీసీసీఐ, అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) నిర్ణయం తీసుకున్నాయి. "బెంగుళూరులోనే మ్యాచ్ ఎందుకంటే.. ఆ సమయంలో దేశంలో వర్షాలు కురుస్తాయి. వర్షం కురియని, వేడిగా ఉన్న ప్రాంతమే మ్యాచ్‌కు అనుకూలం. అందుకే బెంగళూరును ఎంపికచేశాం" అని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి తెలిపాడు. "భారత్, అఫ్గానిస్థాన్ మధ్య ఉన్న స్నేహం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఇప్పుడు దానికి క్రికెట్ జత కలిసింది. ఏసీబీకి బీసీసీఐ అపూర్వమైన మద్దతునిస్తోంది. భారత్‌కు రుణపడి ఉంటాం" అని ఏసీబీ ఛైర్మన్ శుక్రుల్లా అతిఫ్ మశల్ బీసీసీఐకి ధన్యవాదాలు తెలిపాడు.

అండర్-19 ప్రపంచకప్



అనుకుల్‌కు సహచరుడి అభినందన

క్వార్టర్స్‌లో భారత్

● పపువా న్యూగినియా చిత్తు
● రాణించిన అనుకుల్, పృథ్వీ

మౌంట్ మాంగనూయి: అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత్ దూసుకెళ్తోంది. తొలి మ్యాచ్‌లో 100 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘనవిజయం సాధించిన భారత్.. రెండో మ్యాచ్‌లో పసికూన పపువా న్యూగినియాను చిత్తు చేసి క్వార్టర్స్‌ఫైనల్లో అడుగు పెట్టింది. మంగళవారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో లెఫ్టార్మ్ స్పిన్నర్ అనుకుల్ రాయ్ (5/14) సత్తా చాటడంతో భారత్ 10 వికెట్ల తేడాతో న్యూ గినియాపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినియాను భారత బౌలర్లు బెంబేలెత్తించారు. ముఖ్యంగా అనుకుల్ రాయ్ తన స్పిన్‌తో ప్రత్యర్థిని చుట్టేశాడు. ఒక దశలో 42/3తో నిలిచిన ఆ జట్టు.. భారత బౌలర్ల ధాటికి 21.5 ఓవర్లలో కేవలం 64 పరుగులకే కుప్పకూలింది. ఓవై సామ్ (15), సిమన్ (13), అరువా (12) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. అనుకుల్ రాయ్‌తో పాటు శివమ్ మావి (2/16) ఆకట్టుకున్నాడు. నాగరకోటి, అర్షదీప్ సింగ్ తలో వికెట్ తీశారు. కెప్టెన్ పృథ్వీ షా (57 నాటౌట్; 39 బంతుల్లో 12×4) చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్.. కేవలం 8 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. పృథ్వీ చేసిన పరుగుల్లో 48 పరుగులు బౌండరీల ద్వారానే వచ్చాయంటేనే అతని జోరు అర్థం చేసుకోవచ్చు. ఈ విజయంతో క్వార్టర్స్ చేరిన భారత్.. ఈ నెల 19న జింబాబ్వేతో నామమాత్రమైన లీగ్ మ్యాచ్ ఆడనుంది.

అగ్రతారలు అలవోకగా..



షరపోవా

● ఫెదరర్, నాదల్, జకోవిచ్ శుభారంభం
● హలెప్, ముగురుజ, షరపోవా ముందంజ ● వీనస్‌కు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అగ్రతారలు శుభారంభం చేశారు. డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్, ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్, మాజీ నంబర్‌వన్ జకోవిచ్ అలవోకగా రెండో రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ హలెప్, మూడో సీడ్ ముగురుజ, మరియ షరపోవా ముందంజ వేశారు. నిరుటి ఫైనలిస్ట్ వీనస్ విలియమ్స్ మాత్రం అనూహ్య పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మెల్‌బోర్న్

ఈ ఏడాది మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్‌లో స్టార్ క్రీడాకారులు, టైటిల్ ఫేవరెట్లు ఫెదరర్ (స్విట్జర్లాండ్), నాదల్ (స్పెయిన్) రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. తొలి రౌండ్లో ఫెదరర్ 6-4, 6-4, 6-3తో అల్జాజ్ బెడెన్ (స్లొవేనియా)ను మట్టికరిపించగా.. నాదల్ 6-1, 6-1, 6-1తో బుర్గోస్ (డొమినికన్ రిపబ్లిక్)పై విజయం సాధించాడు. ఇక గాయంతో ఆరునెలల పాటు ఆటకు దూరమైన జకోవిచ్ తొలి రౌండ్లో చెలరేగిపోయాడు. ఏకపక్ష మ్యాచ్‌లో 14వ సీడ్ జకోవిచ్ 6-1, 6-2, 6-4తో డొనాల్డ్ యంగ్ (అమెరికా)ను చిత్తుగా ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 7-6 (7-5)తో ఫాబియానో (ఇటలీ)పై, ఐదో సీడ్ థీమ్ (ఆస్ట్రియా) 6-4, 6-4, 6-4తో పెలా (అర్జెంటీనా)పై, బెర్డిచ్ (చెక్) 6-3, 3-6, 6-0, 6-1తో మినార్ (ఆస్ట్రేలియా)పై, మూడో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-2, 6-1తో నొవాక్ (ఆస్ట్రియా)పై, వావ్రింకా (స్విట్జర్లాండ్) 6-3, 6-4, 2-6, 7-6 (7-2)తో బెరాంకిస్ (లితువేనియా)పై, డెల్ పొట్రో (అర్జెంటీనా) 6-3, 6-4, 6-3తో తైఫో (అమెరికా)పై నెగ్గారు. రొనిచ్ (కెనడా) 7-6 (7-5), 5-7, 4-6, 6-7 (4-7)తో లుకాస్ లాకో (స్లొవేకియా) చేతిలో ఓడిపోయాడు. గోఫిన్ (బెల్జియం), సామ్ క్వెరీ (అమెరికా), సోంగా (ఫ్రాన్స్), సిలిచ్ (క్రొయేషియా), కిర్గియోస్ (ఆస్ట్రేలియా) రెండో రౌండ్లో అడుగుపెట్టారు. సింగిల్స్ బరిలో ఉన్న ఏకైక భారత ఆటగాడు యుకి బాంబ్రి తొలి రౌండ్ దాటలేకపోయాడు. యుకి 6-7 (4-7), 4-6, 3-6తో బగ్దాటిస్ (సైప్రస్) చేతిలో ఓడిపోయాడు.

వీనస్ ఔట్: మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ వీనస్ విలియమ్స్ (అమెరికా)కు షాక్ తగిలింది. తొలి రౌండ్లో స్విస్ అమ్మాయి బెలిండా బెన్సిచ్ 6-3, 7-5తో ఆమెపై సంచలన విజయం సాధించింది. ప్రపంచ నంబర్‌వన్ సిమోనా హలెప్ (రొమేనియా) కష్టపడి రెండో రౌండ్‌కు చేరుకుంది. తొలి రౌండ్లో ఆమె 7-6 (5), 6-1తో దెస్తానీ ఐవా (ఆస్ట్రేలియా)ను ఓడించింది. మూడో సీడ్ ముగురుజ (స్పెయిన్), 9వ సీడ్ కొంటా (బ్రిటన్), మరియా షరపోవా (రష్యా), మాజీ నంబర్‌వన్ కెర్బర్ (జర్మనీ) రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. కొంటా 6-3, 6-1తో మాడిసన్ బ్రెంగిల్ (అమెరికా)పై, షరపోవా 6-1, 6-4తో తజానా మరియా (జర్మనీ)పై, కెర్బర్ 6-0, 6-4తో అనా లెనా ఫ్రీడ్స్‌మన్‌పై గెలిచారు. ముగురుజ 6-4, 6-3తో పొంచెట్ (ఫ్రాన్స్) పై గెలిచింది. మరోవైపు రెండుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. ఆమె 3-6, 6-4, 8-10తో పెట్కోవిచ్ (జర్మనీ) చేతిలో ఓడిపోయింది. ఒస్తాపెంకో (లాత్వియా), ప్లిస్కోవా (చెక్), మాడిసన్ కీస్ (అమెరికా), కెనడా అమ్మాయి బౌచర్, వోజ్నియాకి (డెన్మార్క్) ముందంజ వేశారు.



ఆధిక్యంలో ఆనంద్

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): ఐదు సార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. మూడో రౌండ్లో కరౌనా (అమెరికా)పై గెలిచిన ఆనంద్ 2.5 పాయింట్లతో అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో కలిసి సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు. ఛాలెంజర్స్ విభాగంలో ఎర్విన్ ఎమి (నెదర్లాండ్స్)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హారిక(1.5) డ్రా ముగించింది.

నాలుగో వన్డేలోనూ కివీస్‌దే గెలుపు

హామిల్టన్: పాకిస్థాన్‌తో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ క్లీన్‌స్వీప్ దిశగా సాగుతోంది. మంగళవారం జరిగిన నాలుగో వన్డేలో కివీస్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట పాక్..మహ్మద్ హఫీజ్ (81) మెరవడంతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 262 పరుగులు చేసింది. ఫకర్ జమాన్ (54), హారిస్ సొహైల్ (50), కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ (51) రాణించారు. గ్రాండ్‌హోమ్ (74 నాటౌట్; 40 బంతుల్లో 7×4 5×6) చెలరేగడంతో కివీస్ 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.



సిక్కి జోడీ ఓటమి

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు నిరాశజనక ఫలితాలు ఎదురయ్యాయి. మంగళవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సిక్కిరెడ్డి-ప్రణవ్ చోప్రా 18-21, 17-21తో చున్ రెజినాల్డ్-చౌ హోయ్ (హాంకాంగ్) చేతిలో ఓడారు. ప్రజక్త సావంత్ (భారత్)- యోగేంద్రన్ కృష్ణన్ (మలేసియా) జోడీకి వాకోవర్ లభించింది. పురుషుల సింగిల్స్ తొలి అర్హత రౌండ్లో పారుపల్లి కశ్యప్ 14-21, 17-21తో కంటపాన్ (థాయ్‌లాండ్) చేతిలో, శుభంకర్ దేవ్ 21-11, 11-21, 9-21తో కిమ్ బ్రూన్ (డెన్మార్క్) చేతిలో పరాజయం చవిచూశారు. బుధవారం జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో కంటపాన్‌తో సాయిప్రణీత్, మహిళల డబుల్స్ తొలి రౌండ్లో జొహానా-కేప్లిన్ (జర్మనీ)తో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప తలపడతారు.

దిగువ బెర్తులకు ఎక్కువ రుసుములు!

రైల్వే కమిటీ సిఫార్సు

దిల్లీ: దిగువ బెర్తులు ఎంపిక చేసుకునేవారు, పండుగల సీజన్‌లో ప్రయాణాలు చేసేవారి నుంచి అధిక రుసుములు వసూలు చేయాలని ఛార్జీల సమీక్ష కమిటీ సిఫార్సు చేసింది. విమానయాన సంస్థలు హోటళ్లు అనుసరించిన రీతిలో రైల్వేలోనూ డైనమిక్ ఛార్జీల విధానం ఉండాలని సూచించింది. ఈ కమిటీ తన నివేదికను సోమవారం రైల్వే బోర్డుకు సమర్పించింది. అందులో ప్రధాన సిఫార్సులివీ..

★ విమానాల్లో ముందు సీట్ల కోసం ప్రయాణికులు అధిక రుసుములు చెల్లించాల్సి ఉంటుందని, ఇదేరీతిలో రైళ్లలో కోరుకున్న సీట్ల కోసం ప్రయాణికులు ఎక్కువ మొత్తం చెల్లించాలి.
★ నిర్దిష్ట మార్గంలో 'అనుకూల' సమయాల్లో నడిచే రైళ్లు, ప్రజాదరణ ఎక్కువగా ఉండే రైళ్లలోనూ ఛార్జీలను పెంచాలి.
★ ఎప్పుడూ ఒకేరకం రుసుములు నిర్దేశించడానికి బదులు పండుగల సీజన్‌లో ఎక్కువగా, రద్దీ పెద్దగా లేని నెలల్లో తక్కువగా ఛార్జీలు ఉండాలి.
★ అసౌకర్యంగా ఉండే సమయాల్లో గమ్యస్థానాలకు చేరే రైళ్లలోని ప్రయాణికులకు రాయితీలను ఇవ్వాలి.
★ రాత్రిపూట ప్రయాణించే రైళ్లలోను, వంటశాల (ప్యాంట్రీ కార్) కలిగిన రైళ్లకు ప్రీమియం ఛార్జీలు ఉండాలి.

ఉద్రిక్తతల నడుమ రాహుల్ పర్యటన


అమేథీలో రోడ్‌షో నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీ చెవిలో రహస్యంగా ఏదో చెబుతున్న ఓ స్థానికురాలు

- యూపీలో అడుగడుగునా భాజపా నిరసనలు
- ఘర్షణకు దిగిన ఇరు పార్టీల శ్రేణులు

అమేథీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి హోదాలో రాహుల్ గాంధీ తొలిసారి ఉత్తర్‌ప్రదేశ్‌లో చేపట్టిన రెండు రోజుల పర్యటన ఉద్రిక్తతల నడుమ మంగళవారం ముగిసింది. అయితే ఆయన సొంత నియోజకవర్గం అమేథీలోని గౌరీగంజ్ ప్రాంతంలో కాంగ్రెస్, భాజపా కార్యకర్తల నడుమ ఘర్షణలు చెలరేగడంతో రాహుల్ తన పర్యటన మార్గాన్ని మార్చుకోవాల్సి వచ్చింది.

ముసాఫిర్‌ఖానా నుంచి గౌరీగంజ్‌కు రాహుల్ గాంధీ చేరుకోవాల్సి ఉంది. ఆయన పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానిక భాజపా నేతలు ఆశిష్ శుక్లా, సుధాంశు శుక్లాలు భారీ సంఖ్యలో కార్యకర్తలను సమీకరించి మార్గమధ్యంలో గుమికూడారు. ఈ నేపథ్యంలో పోలీసులు రాహుల్ వాహనశ్రేణిని జామో రోడ్డులోకి మళ్లించారు. అక్కడ రోడ్డుకు ఇరువైపులా కాంగ్రెస్ కార్యకర్తలు నిలబడి, తమ నేతకు అభివాదం చేశారు.

ఆ తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు రెండు కిలోమీటర్ల మేర నడిచి గౌరీగంజ్ చేరుకున్నారు. మరోవైపు గౌరీగంజ్-ముసాఫిర్‌ఖానా రోడ్డు వద్ద భాజపా కార్యకర్తలు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబట్టారు. ఆయనను 'ఆచూకీ లేని ఎంపీ'గా అభివర్ణించారు. రైతుల భూములను లాగేసుకున్నారని, అమేథీ అభివృద్ధిని విస్మరించారని, ఎంపీల్యాడ్స్ నిధులను వినియోగించలేదని ఆరోపించారు.

సోమవారమూ భాజపా కార్యకర్తలు నిరసనల సెగ రాహుల్‌కు తగిలింది. అమేథీ పరిధిలోని సాలోన్ నుంచి పార్షదేర్‌పుర్‌కు వెళుతున్నప్పుడు భాజపా కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి, కాంగ్రెస్ కార్యకర్తలకు నడుమ ఘర్షణలు చెలరేగాయి. పోలీసులు జోక్యం చేసుకొని వారిని చెదరగొట్టారు. అమేథీలోని రాజీవ్ గాంధీ చౌక్ వద్ద కూడా కాంగ్రెస్ అధ్యక్షుడికి తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. దీంతో ఆయన తన తండ్రి రాజీవ్ విగ్రహానికి పూలమాల వేయలేకపోయారు. మరోపక్క.. మోదీకి వ్యతిరేకంగా గౌరీగంజ్ రైల్వేస్టేషన్ వద్ద వెలసిన పోస్టర్లపై రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని భాజపా డిమాండ్ చేసింది.

ఆ శిశువుల్లో

భాషా నైపుణ్యాల జాప్యం గుట్టు వీడింది!



వాషింగ్టన్: నెలలు నిండక ముందే పుట్టే శిశువులు చిన్నతనంలో భాషాపరమైన ఇబ్బందులను ఎదుర్కోవడానికి కారణమవుతున్న అంశాలను శాస్త్రవేత్తలు తాజాగా నిర్ధారించారు. ధ్వనులను వినడంతోపాటు అర్థం చేసుకోవడానికి మెదడులోని నిర్దిష్ట భాగాలు ఉపయోగపడతాయని.. వాటి అభివృద్ధిలో జాప్యం కారణంగానే చిన్నారుల్లో సమస్యలు తలెత్తుతున్నాయని వెల్లడించారు. సాధారణ శిశువులతో పోలిస్తే.. నెలలు నిండకుండానే పుట్టిన శిశువుల్లో భాషాపరమైన నైపుణ్యాలు రెండేళ్ల వయసులో తక్కువగా ఉంటాయి. ఇందుకు దారితీస్తున్న పరిస్థితులను తెలుసుకునేందుకుగాను అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయ పరిశోధకులు విస్తృత పరిశోధనలు నిర్వహించారు. సాధారణ శిశువులతో పోలిస్తే.. నెలలు నిండకుండానే పుట్టిన చిన్నారుల్లో మెదడులోని 'ప్రైమరీ ఆడిటరీ కార్టెక్స్', 'నాన్‌ప్రైమరీ ఆడిటరీ కార్టెక్స్' అభివృద్ధి నెమ్మదిగా ఉంటున్నట్లు గుర్తించారు. నెలలు నిండకుండానే జన్మించిన శిశువుల్లో 'ప్రైమరీ ఆడిటరీ కార్టెక్స్' కొంతమేరకు బాగానే ఉంటున్నప్పటికీ.. 'నాన్‌ప్రైమరీ ఆడిటరీ కార్టెక్స్' అభివృద్ధి మరీ జాప్యమవుతున్నట్లు కనుగొన్నారు. దీంతో రెండేళ్ల వయసునాటికి ఆ చిన్నారుల్లో భాషాపరమైన నైపుణ్యాలు తక్కువగా ఉంటున్నాయని వివరించారు.


క్యాన్సర్ కణాలను వేటాడే చికిత్స

లాస్ ఏంజెలిస్: క్యాన్సర్ కణాలను వెతికిపట్టి ఇట్టే హతమార్చేందుకు తోడ్పడే అధునాతన చికిత్సా విధానాన్ని పరిశోధకులు అభివృద్ధిచేశారు. ఒంటిపై చిన్న గాటు పెట్టకుండానే ఇది ఫలితాలను ఇవ్వడం విశేషం. అమెరికాలోని కాలిఫోర్నియా శాన్‌డీగో వర్సిటీ నిపుణులు తాజా పరిశోధన చేపట్టారు. కణజాలం, కణాల ధర్మాల్లో మార్పులను విశ్లేషించే మెకనోజెనిటిక్స్ పరిజ్ఞానంపై వారు దృష్టి కేంద్రీకరించారు. మొదట రోగనిరోధక టీ-కణాల్లో వారు జన్యు మార్పులు చేశారు. అనంతరం మెకనోజెనిటిక్స్ పరిజ్ఞానాన్ని అనుసరించి అల్ట్రాసౌండ్ సాయంతో వీటిని క్రియాశీలం చేశారు. చివరగా క్యాన్సర్ కణాలను గుర్తించి, హతమార్చేందుకు వీటిని ఉపయోగించుకునే వీలుందని నిరూపించారు.

ప్లాస్టిక్ రూపంలోకి కార్బన్ డైఆక్సైడ్

టొరంటో: భూతాపానికి కారణమవుతున్న కార్బన్ డైఆక్సైడ్‌కు కెనడా శాస్త్రవేత్తలు అద్భుత విరుగుడును కనుగొన్నారు. ఈ వాయువును ఇథలీన్‌గా మార్చే ఒక సమర్థ విధానాన్ని వారు అభివృద్ధి చేశారు. ఇథలీన్.. సాధారణ ప్లాస్టిక్ ఉత్పత్తికి అక్కరకొస్తుంది. ఈ పరిశోధనలో కీలకం.. కార్బన్ డైఆక్సైడ్ క్షీణత చర్య. ఇందులో విద్యుత్, ఒక ఉత్ప్రేరకం సాయంతో రసాయన చర్యను జరిపి కార్బన్ డైఆక్సైడ్‌ను ఇతర రసాయనాలుగా మారుస్తారు. ఇందులో బంగారం, వెండి, జింక్ వంటి అనేక లోహాలను ఉత్ప్రేరకాలుగా వాడితే కార్బన్ మోనాక్సైడ్ ఉత్పత్తవుతుంది. అయితే రాగి మాత్రమే ఇథలీన్‌ను తయారుచేస్తుంది. "రాగి అనేది అద్భుతలోహం. దీనిసాయంతో మీథేన్, ఇథలీన్, ఇథనాల్ వంటి విభిన్న రసాయనాలను ఉత్పత్తి చేయవచ్చు. అది ఏం ఉత్పత్తి చేస్తున్నదన్నదానిపై నియంత్రణ కష్టమే" అని పరిశోధనలో పాలుపంచుకున్న ఫిల్ డిలునా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు ఒక ఉత్ప్రేరకాన్ని రూపొందించి, దాని సాయంతో ఇథలీన్‌ను గరిష్ఠ స్థాయిలోను, మీథేన్‌ను నామమాత్రంగాను ఉత్పత్తి చేసేలా ఒక విధానాన్ని కనిపెట్టారు. దీనికి కర్బన సంగ్రహణ పరిజ్ఞానాన్ని జోడిస్తే.. ప్లాస్టిక్‌లను పర్యావరణ అనుకూల విధానాలతో రూపొందించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

తుమ్మును బలవంతంగా ఆపుకోవద్దు!




లండన్: నోరు, నాసికా రంధ్రాలను ఒకేసారి మూయడం ద్వారా తుమ్మును బలవంతంగా ఆపుకోవడం అత్యంత ప్రమాదకరమని వైద్యులు తాజాగా హెచ్చరించారు. కొన్నిసార్లు అది ఏకంగా ప్రాణానికే ముప్పుగా పరిణమించే అవకాశముందని చెప్పారు. తీవ్రమైన గొంతునొప్పి, వాంతులతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన 34 ఏళ్ల వ్యక్తి పరిస్థితిని సమగ్రంగా విశ్లేషించిన అనంతరం బ్రిటన్‌లోని లీసెస్టర్ విశ్వవిద్యాలయ ఆస్పత్రి వైద్యులు ఈ అంశాలను వెల్లడించారు. నోరు, ముక్కును గట్టిగా మూసుకొని బలమైన తుమ్మును ఆపుకోవడంతో బాధితుడి గొంతులో పగులు వచ్చిందని వైద్యులు తెలిపారు. మెడలో వాపు రావడంతోపాటు మాట కూడాపడిపోవడంతో బాధితుడు తమను సంప్రదించినట్లు చెప్పారు. వారం చికిత్స అనంతరం కోలుకున్నారని తెలిపారు. నోరు, ముక్కు ఒకేసారి మూసుకొని తుమ్మును ఆపుకుంటే ఊపిరితిత్తుల మధ్య గాలి చిక్కుకునే ముప్పుందని. అది ప్రాణానికే ప్రమాదమని భారత సంతతికి చెందిన రఘువిందర్ సహోటా, సుదీప్ దాస్‌లతో కూడిన లీసెస్టర్ వైద్యబృందం హెచ్చరించింది.

25% మంది మాతృభాషనే చదవలేకపోతున్నారు

- సగం మందికి భాగహారాలే రావు
- 14 నుంచి 18 ఏళ్ల గ్రామీణ విద్యార్థులపై తాజా అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: యువతను ఆర్థిక ప్రగతికి చోదకాలుగా భారత్ ఉపయోగించుకోలేకపోతోందని తాజా అధ్యయనం చెబుతోంది. తయారీ రంగాన్ని ఉరకలెత్తించాలంటే మానవ వనరులకు మేలిమి నైపుణ్యాలు తప్పనిసరని వివరిస్తోంది. దేశంలో భారీ సంఖ్యలో యువతకు ఉపాధికి అవసరమైన కనీస యోగ్యతలు లేవని చెబుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా స్థితిగతులపై వార్షిక నివేదిక (అసర్) పేరిట స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ ఈ అధ్యయన ఫలితాలను విడుదలచేసింది. దీనిలో వెలుగుచూసిన ఆశ్చర్యకర అంశాలు..

★ 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న గ్రామీణ యువతలో 25 శాతం మంది మాతృభాషలోని అంశాలనూ స్పష్టంగా చదవలేకపోతున్నారు. వీరిలో సగం కంటే ఎక్కువ మంది మూడంకెలతో కూడిన భాగహారాలను (విభాజకం ఒకే అంకెలో ఉన్నప్పటికీ) చేయలేకపోతున్నారు.
★ చాలా మంది గడియారం చూసి సమయం కూడా చెప్పలేకపోతున్నారు. కేవలం గంటలను అయితే 83 శాతం మంది, నిమిషాలతో సహా అయితే 60 శాతం మందే సరిగ్గా చెప్పగలుగుతున్నారు.
★ 76 శాతం మంది డబ్బులనూ సరిగ్గా లెక్కపెట్టలేకపోతున్నారు. అయితే గణనలు చేయగలిగిన వారిలో 90 శాతం మంది ఈ పనిని చక్కగా పూర్తిచేయగలుగుతున్నారు.
★ 14 శాతం మంది ప్రపంచ పటంలో భారత్‌ను గుర్తించలేకపోతున్నారు.
★ 36 శాతం మంది దేశ రాజధాని పేరు చెప్పలేకపోతున్నారు.
★ 21 శాతం మంది వారికి సొంత రాష్ట్రం పేరు తెలీదు.
★ 58 శాతం మంది వారి రాష్ట్రాన్ని పటంలో గుర్తించలేకపోతున్నారు.


పిండాన్ని అమర్చిన ఆవు

ఆవుల ద్వారా టెస్ట్‌ట్యూబ్ దూడలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఆవుల్లో టెస్ట్‌ట్యూబ్ పిండాన్ని ప్రవేశపెట్టి దూడలను అభివృద్ధి చేసే ప్రక్రియ చేపట్టినట్లు శాస్త్రవేత్త ఎం.ముక్తారావు తెలిపారు. గుంటూరు జిల్లాలోని లాంఫాం పరిశోధనా స్థానంలోని ప్రయోగశాలలో అభివృద్ధి చేసిన పిండాన్ని తుళ్లూరులోని కొమ్మినేని అప్పారావుకు చెందిన ఆవులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. తుళ్లూరు పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. పాలచార, ఒంగోలు జాతి ఆంబోతుల పునరుద్ధరణకు ప్రభుత్వం చేపట్టిన టెస్ట్‌ట్యూబ్ విధానానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గుంటూరు జిల్లాలో దీనిని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ జగ్గాపురం, నాదెండ్ల, నంబూరు, గ్రామాల్లోని పది ఆవుల్లో పిండాలను ప్రవేశపెట్టామని, నెలరోజుల తర్వాత ఆయా పశువుల సూడి విషయం తెలుస్తుందని చెప్పారు. పిండాలను ఆవుల్లో ప్రవేశపెట్టేందుకు రూ.10వేలు ఖర్చవుతుందని, పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. ఆసక్తి కలిగినవారు లాంఫాంలో సందర్శించవచ్చని సూచించారు.

'వ్యాపం' కేసులో సీబీఐ తాజా అభియోగపత్రం దాఖలు

దిల్లీ: మధ్యప్రదేశ్‌లో ఒప్పంద ఉపాధ్యాయుల నియామకంలో అవకతవకలకు సంబంధించిన 'వ్యాపం' కేసులో సీబీఐ తాజాగా మంగళవారం 95 మందిపై అభియోగపత్రం నమోదు చేసింది. ఈ అభియోగపత్రంలో 83 మంది అభ్యర్థులు, నలుగురు అధికారులు, 8 మంది మధ్యవర్తుల పేర్లను చేర్చింది. పరీక్షలకు ఉత్తీర్ణత సాధించేందుకు 84 మంది అభ్యర్థుల మార్కుల్ని పెంచినట్లు గుర్తించామనీ, ఒక అభ్యర్థి పరారీలో ఉన్నారనీ, కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాల్ తెలిపారు.


రేవు కల్యాణ్, పోతుల శ్యామ్ మృతదేహాలు

గోదావరిలో మునిగి ఇద్దరి మృతి

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగకు బంధువుల ఇంటికి వచ్చిన ఇద్దరు గోదావరి నదిలో కొట్టుకుపోయి మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం పశువుల్లంక మొండి వద్ద వృద్ధగౌతమి గోదావరిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన రేవు కల్యాణ్(19), శేరిల్లంకకు చెందిన పోతుల శ్యామ్(14), పోతుల అనిల్ పశువుల్లంకలోని బంధువుల ఇంటికొచ్చి శేరిల్లంక వెళ్లారు. ఈ ముగ్గురు సరదాగా గోదావరిలో స్నానం చేసేందుకని నదిలోకి దిగి కొట్టుకుపోయారు. అనిల్‌ను స్థానికులు కాపాడారు. కల్యాణ్, శ్యామ్‌లు కొట్టుకుపోయారు. వీరి మృతదేహాలు మంగళవారంలభ్యమయ్యాయి.

జూదం తెచ్చిన మృత్యువు

పోలీసులు వెంటపడడంతో చెరువులోకి దూకి దుర్మరణం


మృతుడు వీరయ్య

కడప, న్యూస్‌టుడే: జూదరుల్ని పోలీసులు వెంబడించగా తప్పించుకోడానికి చెరువులోకి దూకిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. కడప శివారు ఫరీదానగర్ వద్ద ఉన్న ఫక్కీర్‌పల్లె చెరువు సమీపంలో శివానందపురానికి చెందిన వీరయ్య(30) తదితరులు మంగళవారం జూదమాడుతున్నారు. ఇంతలో పోలీసుల రాకను గమనించిన వారు... భయంతో పరారయ్యారు. ఈక్రమంలో వారు ఫక్కీర్‌పల్లె చెరువులోకి దూకారు. వీరయ్య బురదలో ఇరుక్కుని చనిపోయాడు. బాషా, రవిలకు ఈత రావడంతో ఈదుకుంటూ వెళ్లిపోయారు. పోలీసుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



మొదటి చిత్రాన్ని తీసిన కార్టోశాట్-2

శ్రీహరికోట, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ప్రయోగించిన కార్టోశాట్-2 సిరీస్ ఉపగ్రహం తీసిన తొలి చిత్రాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మంగళవారం విడుదలచేసింది. దీనిలో హోల్కర్ క్రికెట్ మైదానం సహా ఇండోర్‌లోని కొన్ని ప్రాంతాలు కనిపిస్తున్నాయి. ఈ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ-సీ 40 రాకెట్ విజయవంతంగా శుక్రవారం కక్ష్యలో విడిచిపెట్టిన సంగతి తెలిసిందే.

కార్తి చిదంబరానికి మళ్లీ సమన్లు

దిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు కార్తి చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు తాజాగా సమన్లు జారీ చేశారు. ఐఎన్ఎక్స్ మీడియా అక్రమ నగదు లావాదేవీల కేసు విషయమై జనవరి 18లోగా తమ ముందు వ్యక్తిగతంగా గాని, మీ న్యాయ ప్రతినిధులు గాని హాజరు కావాలని ఆ నోటీసులో అధికారులు పేర్కొన్నారు. మొదటిసారి ఇచ్చిన సమన్లు మేరకు జనవరి 11న కార్తి న్యాయవాదులు ఈడీ అధికారులను కలసి సమాధానమిచ్చారు.

రాజపుత్ నేతలపై మోదీ ప్రశంసలు

పచ్‌పాద్ర(రాజస్థాన్): రాజస్థాన్ రాజపుత్ నేతలపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. మంగళవారం రాజస్థాన్ బాడ్‌మేడ్ చమురు శుద్ధి కర్మాగారం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెఖావత్, మాజీ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జస్వంత్‌సింగ్‌లను కొనియాడారు. ఈ నెల 29న రెండు లోక్‌సభ, ఒక అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరుగనుండగా..ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పద్మావత్‌పై హరియాణా ప్రభుత్వ నిషేధం

చండీగఢ్: సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన 'పద్మావత్' సినిమా విడుదలను హరియాణాలోని మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి అనిల్ విజ్ తెలిపారు.

ఆ ఫిర్యాదును పరిశీలించండి

- పోలవరం ఈఎన్‌సీకి ఫిర్యాదీదారుడి లేఖను పంపిన ప్రాజెక్టు అథారిటీ
- విచారణ జరిపి సమాధానం ఇవ్వండి
- లేఖలో కోరిన అథారిటీ కార్యదర్శి
- పీఎంవో, జల వనరులశాఖకు విశ్రాంత అధ్యాపకుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుతోపాటు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు జె.చౌదరయ్య చేసిన ఫిర్యాదును పరిశీలించి, విచారణ జరిపి సమాధానం ఇవ్వాలని పోలవరం ప్రాజెక్టు ఇంజినీరు ఇన్ చీఫ్‌ను (ఈఎన్‌సీ) ప్రాజెక్టు అథారిటీ కోరింది. ఒకవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపడుతూనే అందులో భాగంగా పేర్కొంటూ పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, పురుషోత్తపట్నం పథకాన్ని అవసరం లేకుండానే నిర్మిస్తోందని, దీనివల్ల తమలాంటి అనేక మంది రైతులు భూములు కోల్పోతున్నారని పేర్కొంటూ ప్రధాన మంత్రి కార్యాలయానికి, కేంద్ర జల వనరులశాఖకు చౌదరయ్య ఫిర్యాదు చేశారు. ఆయన తన ఫిర్యాదు లేఖకు 2016లో కాగ్ సమర్పించిన నివేదికను జత చేశారు. అందులో ఎత్తిపోతల పథకాలపై కాగ్ ఆక్షేపణలున్నాయి. ఆ అంశాలను ఈనాడు కాగ్ నివేదికలను పార్లమెంటుకు సమర్పించినప్పుడే వెలుగులోకి తెచ్చింది. దీనికి తోడు విశాఖకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి పోలవరం ప్రాజెక్టుపై కేంద్రానికి రాసిన లేఖనూ చౌదరయ్య జత చేశారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన ఉత్తర్వులనూ ఉటంకించారు. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని ఆయన పీఎంవోను, జల వనరులశాఖను కోరారు. ఈ లేఖను అందుకున్న కేంద్ర జల వనరులశాఖ దానిని పోలవరం ప్రాజెక్టు అథారిటీకి పంపింది. అటు పీఎంవో నుంచీ అథారిటీకి ఈ లేఖ వచ్చింది. అథారిటీ కార్యదర్శి దానిని ఈఎన్‌సీకి పంపి పరిశీలించి, విచారణ జరిపి ఫిర్యాదీకి, తమకు సమాధానం పంపాలని కోరారు.

కేంద్రానికి లేఖ రాసిన చౌదరయ్య పురుషోత్తపట్నం ఎత్తిపోతల ప్రాజెక్టు కింద భూమిని కోల్పోయారు. పరిహారంగా ఎకరానికి రూ.28 లక్షలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాగా సరిపోదంటూ రూ.34 నుంచి రూ.38 లక్షల వరకూ వస్తుందని హైకోర్టును ఆశ్రయించారు. ఇదే ఎత్తిపోతల పథకంపై జాతీయ హరిత ట్రైబ్యునల్‌కూ ఫిర్యాదు చేశారు. ఆ క్రమంలోనే తాజాగా కేంద్ర జల వనరులశాఖకు లేఖ రాశారు.

అగ్నిప్రమాదం కేసులో ముంబయి పబ్ యజమాని అరెస్టు

ముంబయి: గతనెల 29న భారీ అగ్నిప్రమాదం తర్వాత తప్పించుకు తిరుగుతున్న మోజోస్ బిస్ట్రో పబ్ యజమాని యుగ్ టులీ మంగళవారం తమ ఎదుట లొంగిపోయారని ముంబయి పోలీసులు తెలిపారు. అనంతరం ఆయనను సెంట్రల్ ముంబయిలోని భోయివాడ కోర్టులో హాజరు పరిచారు. దీంతో కమలామిల్స్ కాంపౌండ్‌లోని మోజోస్ బిస్ట్రో, వన్ అబౌ పబ్‌ల యజమానులందరినీ అరెస్టు చేసినట్లయిందని అదనపు కమిషనర్ ఎస్.జయకుమార్ వెల్లడించారు. డిసెంబరు 29న జరిగిన భారీ అగ్నిప్రమాదంలో కమలామిల్స్ ప్రాంగణంలోని పబ్‌లలో 14 మంది మృత్యువాతపడ్డారు. ఈ ప్రమాదంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, బీఎంసీ కమిషనర్ అజయ్ మెహతాను సస్పెండ్ చేయాలని మహారాష్ట్ర కాంగ్రెస్ డిమాండ్ చేసింది.



రష్యాలో మైనస్ 67 సెం. డిగ్రీలు

వజ్రాలు విరివిగా లభ్యమయ్యే రష్యాలోని యకూటియా ప్రాంతంలో ఉష్ణోగ్రతలు కనివిని ఎరుగని స్థాయికి పడిపోయాయి. రికార్డుస్థాయిలో మైనస్ 67 డిగ్రీల సెంటీగ్రేడ్ చూపిస్తున్న ఉష్ణోగ్రతామానిని చిత్రంలో చూడవచ్చు. ఇక్కడికి సమీపంలోని యకుట్స్కలో మైనస్ 50 డిగ్రీలు నమోదు కావడంతో కనురెప్పలు సైతం మంచుతో నిండిపోయిన అనస్తాసియా గ్రుజ్‌దెవా అనే యువతిని గమనించవచ్చు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు
its@eenadu.in
బుధవారం, జనవరి, 17 2018
విజయవాడ
13

సంక్రాంతి సంబరాల మాదిరే... టెక్నాలజీ ప్రియులకూ ఓ సంబరం! ఏటా జనవరిలో... అమెరికాలో జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలన్నీ ఓ చోట చేరతాయి... సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొస్తాయి... చూసేందుకు వచ్చే టెక్ ప్రియులతో ఒకటే సందడి! మరి, గత వారంలో జరిగిన టెక్ పండగ 'కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఈఎస్)-2018'లో ఆకట్టుకున్న తీన్‌మార్ సంగతులు కొన్ని...

సీఈఎస్-2018

టెక్నాలజీ తీన్‌మార్





తోక ఊపుతూ... తలాడిస్తూ!

దీని పేరు ఐబో. సోనీ కంపెనీ తయారు చేసిన బుజ్జి పప్పీ. సీఈఎస్ షో అంతా కలియతిరుగుతూ.. అందర్నీ చూస్తూ తోకూపుతూ... తలాడిస్తూ కనిపించింది. అచ్చంగా ఇంట్లో పెంచుకునే బుజ్జి కుక్కపిల్లలానే అబ్బురపరిచింది. తలపై నిమిరితే తన్మయంతో దగ్గరైంది. దీనంతటికీ కారణం దీని బుర్రలోని కృత్రిమ మేధస్సు. స్పర్శకు స్పందించడమే కాదు. చెప్పిన మాట వింటూ కుటుంబసభ్యులతో కలిసిపోతుందట. ఇంతకీ 'ఐబో' అంటే అర్థమేంటో తెలుసా? తోడు. 1999లోనే ఇది ప్రపంచానికి పరిచయమైనా ఇప్పుడు తెలివిగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ముందుకొచ్చింది.

వీడియో లింక్: https://goo.gl/bLYy15



టీవీ ముడుచుకుంటుంది

ఎంత నాజూకు టీవీ అయినా టేబుల్‌పైన పెట్టాలి.. లేదా గోడకు తగిలించాల్సిందే. చూసినా... చూడకపోయినా... అలా నిత్యం కనిపిస్తూనే ఉంటుంది. పిల్లలు ఉన్న ఇంట్లో అయితే.. అందకుండా... ఏదీ తగలకుండా... జాగ్రత్త పడాల్సిందే. ఇలాంటివి ఏమీ లేకుండా టీవీని చుట్టచుట్టి ఓ బాక్స్‌లో పెట్టేస్తే. చూద్దాం అనుకున్నప్పుడు రిమోట్‌ని తాకగానే బాక్స్‌లో నుంచి బయటికి టీవీ పొడుచుకొస్తే! ఎల్‌జీ కంపెనీ తయారు చేసిన 'ఎల్‌జీ డిస్‌ప్లే' టీవీతో ఇది సాధ్యమే. ఓఎల్‌ఈడీ హెచ్‌డీ టీవీ తెర పరిమాణం 65 అంగుళాలు. చూడ్డానికి దళసరి కాగితంలా తెర కనిపిస్తుంది.

వీడియో లింక్: https://goo.gl/e4zH8a




డ్రైవరూ... డెలివరీ బాయ్ అక్కర్లేదు

అమెజాన్‌లో ఏదో వస్తువుగానీ.. లేదంటే వేడిగా తిందామని ఓ పిజ్జానో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే! మామూలుగా అయితే, వాహనంపై డెలివరీ బాయ్ తెచ్చి ఇస్తాడు. ఇది ఇప్పుడు. సమీప భవిష్యత్తులో డ్రైవరుతోగానీ... డెలివరీ బాయ్‌తోగానీ అక్కర్లేదు. టయోటా కంపెనీ అందుబాటులోకి తేనున్న 'ఈ-ప్యాలెట్' స్మార్ట్ వాహనం ఒక్కటి చాలు. దీన్ని నడిపేందుకు డ్రైవర్ అక్కర్లేదు. మిని వ్యానులా ఉండే దీంట్లో ఆర్డర్లు, అడ్రస్‌లను లోడ్ చేస్తే చాలు. మెరుపు వేగంతో డెలివరీ చేస్తుంది. అంతేనా... కార్యాలయాలకు ఉద్యోగుల్ని చేరవేస్తుంది. వీడియో లింక్: https://goo.gl/yiQytH



ఇదో కెమెరా 'కన్ను'

కంటి చూపు లేనివారు లేదా చూపు పాక్షికంగా కోల్పోయినవారు పుస్తకాలు, పత్రికలు చదవడం కష్టమే కాదు... కొందరికి అసాధ్యం కూడా. అలాంటి వారికి చదివి వినిపించే కెమెరా కన్ను త్వరలోనే పరిచయం కానుంది. అదే 'ఆర్‌కామ్ మైఐ2.0'. చూపుడు వేలంత ఉన్న దీన్ని చిత్రంలో మాదిరిగా కళ్లజోడుకి అమర్చుకుని చదవాలనుకున్న వాటిని వేలితో చూపితే చాలు. శ్నాప్ తీసుకుని చక్కగా చదివి వినిపిస్తుంది. అంతేకాదు... షాపింగ్‌కి వెళ్లినప్పుడు కెమెరాకి చూపిన వాటిని గుర్తించి చెప్పడంతో పాటు రేటెంతో కూడా చెబుతుంది. కృత్రిమ మేధస్సుతో మనుషుల ముఖాల్ని గుర్తించి వచ్చింది ఎవరనేది చెబుతుంది. ముఖ్యమైన 100 మంది వ్యక్తుల ముఖాల్ని గుర్తించేలా సెట్ చేసుకోవచ్చు. వీడియో లింక్: https://goo.gl/3QJaot





ఈ కారుకి ఓనరు తెలుసు

ఎప్పుడైనా కారు తాళాలు పోగొట్టుకుంటే వచ్చే ఇబ్బంది అంతా ఇంతా కాదు. ప్రత్యామ్నాయం చాలా కష్టం. మరైతే, ఇప్పుడొస్తున్న స్మార్ట్‌ఫోన్ మాదిరిగా కారు దగ్గరికి వెళ్లగానే మీ కారు మిమ్మల్ని గుర్తిస్తే! డోరు తెరుచుకుంటే! భవిష్యత్ కార్లలో ఇది సాధ్యమే. కావాలంటే చైనాకి చెందిన బైటన్ కంపెనీ తయారు చేసిన ఈ నమూనా కారుని చూడండి. ఇదో ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారు. దీంట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ'తో యజమానిని గుర్తించి కారు డోరు తెరుచుకుంటుంది. కారు మొత్తాన్ని స్మార్ట్‌గా మేనేజ్ చేసేందుకు ముందు భాగంలో పెద్ద టచ్‌స్క్రీన్‌ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక సెన్సర్లు నిత్యం డ్రైవరు హార్ట్‌రేట్, బీపీలను ట్రాక్ చేస్తాయి కూడా. వీడియో లింక్: https://goo.gl/H1Jftm



సూట్‌కేస్ 'ఫాలో.. ఫాలో.. యు!'

దూర ప్రాంతాలకు వెళ్లేప్పుడు ఒకటే ఇబ్బంది. సూట్‌కేస్‌ని మోసుకెళ్లడం. లేదంటే లాక్కెళ్లడం. ఇదేం లేకుండా మనం నడుస్తూ వెళ్తుంటే... మనల్ని సూట్‌కేస్ ఫాలో అయితే! ఏదో ఫాంటసీ సినిమాలో అయితే సాధ్యమే అనుకోవక్కర్లేదు. ఈ ఏడాదిలో ఇది సాధ్యమే. చైనా కంపెనీ తయారు చేసిన 'ఫార్వార్డ్‌ఎక్స్ సీఎక్స్-1' స్మార్ట్ సూట్‌కేస్ అందుకు సాక్ష్యం. హోటళ్లు, ఎయిర్‌పోర్టుల్లో వెళ్లేటప్పుడు మిమ్మల్నే చూస్తూ ఫాలో అయిపోతుంది. అందుకు దీంట్లో కృత్రిమ మేధస్సుతో కూడిన కెమెరాల్ని నిక్షిప్తం చేశారు. ఒకవేళ యజమాని సూట్‌కేస్ గుర్తించలేనంత దూరం వెళ్తున్నా... బ్యాటరీ శాతం తగ్గుతున్నా వెంటనే మేసేజ్ ద్వారా తెలుపుతుంది.

వీడియో లింక్: https://goo.gl/Ks2TJi

సీఈఎస్-2018లో మురిపించిన మరిన్ని అప్‌డేట్స్ ఈనాడు.నెట్‌లో...

మీకు తెలుసా?



రేటు అంతే ఉండొచ్చు

షామీ కంపెనీ నుంచి వచ్చిన రెడ్‌మి సిరీస్ ఇప్పుడు 'నోట్ 5'గా ముందుకురానుంది. రేటు ఎంతుండొచ్చు? అనే ప్రశ్నకు నెట్టింట్లో టెక్కీలంతా రూ.7,000 ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. స్పెసిఫికేషన్స్ విషయానికొస్తే... తెర పరిమాణం 5.99 అంగుళాలు. ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే. 3జీబీ, 4జీబీల్లో ర్యామ్. 32జీబీ, 64జీబీల్లో మెమొరీ. బ్యాటరీ సామర్థ్యం 4,000 ఎంఏహెచ్. ఆండ్రాయిడ్ ఎన్ ఓఎస్‌తో పాటు 'మియూ9' ఇంటర్‌ఫేస్‌ని అందిస్తున్నారు. వెనక భాగంలో డ్యూయల్ కెమెరాలు (16మెగాపిక్సల్, 5 మెగాపిక్సల్) ఉండొచ్చని అంచనా. అంతేనా... మి రౌంటర్ 3సీ, మి వై-ఫై రిపీటర్ గ్యాడ్జెట్‌ల ధరల్ని దేశీయ మార్కెట్‌లో బాగా తగ్గించింది. రూ.1,199 ఉన్న రౌటర్‌ని 999కి, 899ఉన్న దాన్ని రూ799కి అందించేందుకు షామీ సిద్ధం అయింది.



ఆండ్రాయిడ్ 'గో'తో నోకియా

ఎంట్రీ లెవల్ ఫోన్లకు ప్రత్యేకంగా గూగుల్ అందిస్తున్న 'ఆండ్రాయిడ్ గో' ఎడిషన్‌తో నోకియా బేసిక్ ఫోన్ అందుబాటులోకి రానుందని నెట్టింట్లో మొబైల్ ప్రియుల ముచ్చట. 'నోకియా 1' పేరుతో మార్కెట్‌లోకి రానున్న ఫోన్ ఫొటోలు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్నాయి. 1జీబీ ర్యామ్, కాస్త ఇంటర్నల్ మెమొరీ, ఐదు అంగుళాల హెచ్‌డీ ఎల్‌సీడీ డిస్‌ప్లేతో నోకియా 2 మోడల్‌ని పోలి ఉంటుందట.

'ప్లస్' అవ్వండి

టైపింగ్‌కి బిల్ట్‌ఇన్ కీబోర్డ్‌నే ఎంత కాలం ఉపయోగిస్తాం?... 'జీబోర్డు ప్లస్'ని వాడి చూడండి. టైపింగ్ మరింత స్మార్ట్ అవుతుంది. కీబోర్డు నుంచే అదనపు సౌకర్యాల్ని పొందొచ్చు.

- వాట్సాప్‌లో స్నేహితులతో ఛాటింగ్... ఏదో అంశానికి సంబంధించిన అనుమాన నివృత్తి కోసం గూగుల్ చేయాల్సి వస్తుంది. దీని కోసం వాట్సాప్‌ను క్లోజ్ చేసి గూగుల్ సెర్చ్ ఆప్ ఓపెన్ చేయక్కర్లేదు. ఎందుకంటే జీబోర్డ్‌లోనే గూగుల్ సెర్చ్ ఆప్షన్ ఉంది. కీబోర్డు పైన ఉన్న గూగుల్ బటన్ (గూగుల్ లోగో)ను క్లిక్ చేసి సెర్చ్ చేసుకోవచ్చు. వచ్చిన వివరాల్ని అక్కడి నుంచే వాట్సాప్‌లో షేర్ చేయొచ్చు.
- వాట్సాప్, మెసెంజర్ గ్రూపు ఛాట్‌లో నవ్వులు పూయించడానికి జిఫ్‌లు ఎంత ఉపకరిస్తాయో మీకు తెలిసిందే. వాటిని కూడా మీరూ జిబోర్డ్‌లో పొందొచ్చు. కీబోర్డులో ఉన్న ఎమోజీ బటన్‌ను క్లిక్ చేస్తే దిగువన జిఫ్ ట్యాబ్ ఉంటుంది. అందులోకి వెళ్లి మీకు కావల్సిన ఎమోజీని సెర్చ్ చేసి పొందొచ్చు.
- చిన్న స్క్రీన్ ఉన్న మొబైల్స్‌లో టైపింగ్ చేసేటప్పుడు వచ్చే ప్రధాన సమస్య...కర్సర్‌ను ముందుకు, వెనక్కి కదపడం. జీబోర్డ్‌లో ఇందుకోసం సులభమైన ఆప్షన్ ఉంది. కీబోర్డు మీద టైప్ చేశాక... స్పేస్ బార్ అంచున వేలు తాకించి ఎడమ, కుడివైపు కదిపితే... కర్సర్ అందుకనుగుణంగా కదులుతుంది.
- కీబోర్డులో @, #, !, % లాంటి గుర్తుల్ని టైప్ చేయాలంటే... షిఫ్ట్ కీని ప్రెస్ చేయాలి. జిబోర్డ్‌లో అయితే '.' కీని లాంగ్ ప్రెస్ చేస్తే సరి. ఆ కీని లాంగ్ ప్రెస్ చేస్తే సింబల్స్ ముఖ్యమైనవి ఒకే బార్‌లో కనిపిస్తాయి. వాటిలో మీకు కావల్సినదాన్ని ఎంచుకోవచ్చు.
- మెయిల్ చేస్తున్నప్పుడు, లేదంటే నోట్స్ రాసుకుంటున్నప్పుడు ఏదైనా పదానికి అర్థం తెలియకపోతే... వెంటనే గూగుల్‌లోకి వెళ్లిపోనక్కర్లేదు. జీబోర్డులోని ట్రాన్స్‌లేటర్‌ను వాడుకోవచ్చు. కీబోర్డుపైనున్న 'జి' బటన్‌ను క్లిక్ చేస్తే... అందులో ట్రాన్స్‌లేటర్ ఐకాన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేసి మీకు కావల్సిన పదాన్ని అనువాదం చేసుకోవచ్చు.
- జీబోర్డ్‌లో పర్సనల్ డిక్షనరీ ఆప్షన్ ఉంది. అందులో మెయిల్ ఐడీ, చిరునామా, మొబైల్ నెంబరు లాంటి ముఖ్యమైన విషయాలను పొందుపరిచి, వాటికి షార్ట్‌కట్‌లు పెట్టుకోవచ్చు. ఉదాహరణకు మీ మెయిల్ ఐడీని ఇచ్చి, షార్ట్‌కట్‌గా మెయిల్ అని పెట్టుకుంటే... ఆ తర్వాత మీరు కీబోర్డు మీద ఎప్పుడు మెయిల్ అని టైప్ చేసినా పైన సజెషన్స్‌లో మీ మెయిల్ ఐడీ కనిపిస్తుంది. దీని కోసం కీబోర్డు దిగువన ఉన్న ',' బటన్‌ను లాంగ్‌ప్రెస్ చేసి సెట్టింగ్స్‌లోకి వెళ్లండి. అందులో జీబోర్డ్‌సెట్టింగ్స్‌ను ఎంచుకోండి. ఆ తర్వాత డిక్షనరీ విభాగంలోకి వెళ్తే పర్సనల్ డిక్షనరీ కనిపిస్తుంది. అందులో మీరు షార్ట్‌కట్‌లు క్రియేట్ చేసుకోవచ్చు.



- పెద్ద తాకేతెర ఉన్న మొబైల్‌ను ఒక చేత్తో పట్టుకొని టైప్ చేయడం కష్టంగా ఉంటుంది. దీని కోసం కొన్ని కీబోర్డ్స్‌లో సింగిల్ హ్యాండ్ ఆప్షన్ ఉంటుంది. దీన్ని యాక్టివేట్ చేసుకుంటే కీబోర్డు వెడల్పు తగ్గి ఒకవైపు చేరిపోతుంది. జిబోర్డ్‌లోనూ ఇలాంటి ఆప్షన్ ఉంది.

ఫాంట్ ఏంటి?

ఈ - కబుర్లు మీవే



గ్రీటింగ్ కార్డుల్లో... గ్రాఫిక్ డిజైన్లలో రకరకాల ఫాంట్‌లు చూస్తుంటాం. మరి, ఎప్పుడైనా ఆయా ఫాంట్‌ల పేర్లు తెలుసుకోవాలని అనిపించిందా? అయితే, అదేం పెద్ద కష్టమైన పని కాదు. వాడుతున్న స్మార్ట్‌ఫోన్‌లో 'వాట్ ద ఫాంట్' ఆప్‌ని ఇన్‌స్టాల్ చేయండి చాలు. ఫోన్ కెమెరాతో ఫాంట్‌ని స్నాప్ తీస్తే చాలు. కృత్రిమ మేధస్సుతో ప్రాసెస్ చేసి ఫాంట్ వివరాల్ని చెబుతుంది. ఆప్ కావాలంటే https://goo.gl/uc9RYX లింక్‌ని చూడండి.

- నాని, బొర్రంపాలెం

ఎఫ్‌బీ వీడియోలు

టెక్'టిప్'



అవసరం మేరకు ఫేస్‌బుక్ వీడియోలు డౌన్‌లోడ్ చేయాలంటే? పీసీలో అయితే వీడియోపై రైట్‌క్లిక్ చేసి 'షో వీడియో యూఆర్ఎల్' ఆప్షన్‌పై క్లిక్ చేయండి. ప్రత్యేక బాక్స్‌లో ఎఫ్‌బీ వీడియో లింక్ ఓపెన్ అవుతుంది. ఇతరులకు ఎవరికైనా లింక్‌ని షేర్ చేయాలంటే కాపీ చేసి పంపొచ్చు. వీడియోని డౌన్‌లోడ్ చేయాలంటే లింక్‌ని https://en.save-from.net/ వెబ్‌సైట్‌లోకి కాపీ చేసి సిస్టంలో సేవ్ చేయవచ్చు. ఫేస్‌బుక్ ఆప్ నుంచి వీడియోల డౌన్‌లోడ్ లింక్‌లను పొందేందుకు వీడియో పక్కనే కనిపించే మూడు చుక్కలపై క్లిక్ చేయాలి. పాప్‌అప్ మెనూలో 'కాపీ లింక్' ఆప్షన్ కనిపిస్తుంది. ఎక్కడైనా యూఆర్ఎల్ లింక్‌ని పేస్ట్ చేసి షేర్ చేయవచ్చు. డౌన్‌లోడ్ చేయాలంటే అదే మెనూలో 'డౌన్‌లోడ్' ఆప్షన్ కనిపిస్తుంది.

బ్రైట్‌నెస్ తగ్గించాలంటే?

ప్రశ్నజవాబులు

ఏసర్ ఏస్పైర్ ఈ15 మోడల్ ల్యాపీని వాడుతున్నా. డిస్క్ నుంచి 'బ్రైట్‌నెస్ కంట్రోల్ డ్రైవర్స్' ఇన్‌స్టాల్ చేయలేకపోతున్నా. ఇతర వెబ్‌సైట్‌ల నుంచి సాధ్యం కావడం లేదు. ఏం చేయాలి?

– అనిల్ యాదవ్

బహుశా మీ ల్యాపీలో రెండు డిస్‌ప్లే కార్డ్స్ ఉండొచ్చు. ఒకటి ఇంటెల్ డ్రైవర్స్ (మైక్రోసాఫ్ట్ బేసిక్ డిస్‌ప్లే అడాప్టర్) అయితే మరోటి ఇంటెల్ మదర్‌బోర్డ్‌తో పాటు వచ్చిన 'ఎన్విడియా'గానీ మరేదైనా కార్డు ఉండొచ్చు. ఈ రెండు డ్రైవర్లలో ఏది మిస్ అయ్యిందో చూసి దాన్ని మాత్రం లోడ్ చేస్తే సరిపోతుంది. డ్రైవర్స్ కోసం మీ సిస్టం ఓఎస్ ఆధారంగా కింది వెబ్‌సైట్‌లను చూడండి.

- https://goo.gl/8sZxoP
- https://goo.gl/FCPzAF





సీహెచ్ఏఎస్ మూర్తి
సీ-డాక్, జాయింట్ డైరెక్టర్

యూట్యూబ్, ఇతర వెబ్‌సెట్స్‌లో అశ్లీల సైట్‌లు ఓపెన్ కాకుండా బ్లాక్ చేయడానికి అనువైన ఆప్స్‌ని తెలుపగలరు?

– ప్రసాద్ టీవీఎన్ఎస్

నెట్టింట్లో టెక్నాలజీ సొల్యుషన్స్ కారణంగా అశ్లీల వీడియోలు, ఇతర అసభ్యకరమైన కంటెంట్‌ని ఫిల్టర్ చేయడం టూల్స్ వాడకంతో సాధ్యం కాదనే చెప్పాలి. టూల్స్‌తో నిరంతరం మానిటర్ చేయాలంటే పెద్ద వ్యవస్థని సెట్ చేసుకోవాలి. యూట్యూబ్‌లో ఫిల్టర్ చేసేందుకు కొన్ని ప్రత్యేక ఆప్షన్లు ఉన్నాయి. అందుకు https://goo.gl/SzBMtF, https://goo.gl/DYXpgm, https://goo.gl/G1yxXm, https://goo.glhC67h సైట్‌లను చూడండి.

టెక్నాలజీ వాడకంలో సందేహం ఏదైనా మాకు పంపండి. నిపుణులతో సూచనలు అందిస్తాం.
మా ఈ-మెయిల్ its@eenadu.in

భరత్ తొలి ప్రమాణం


మహేష్‌బాబు

'శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని... భారత దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతని కాపాడుతానని, నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను'. - చట్టసభలకి ఎన్నికైన ప్రజాప్రతినిధులు పదవులు చేపట్టే ముందు చేసే ప్రమాణం ఇది. చేసిన ఆ ప్రమాణానికి తగ్గట్టుగా నడుచుకొనే నాయకులు ఎంతమందనేది పక్కనపెడితే, ఈ కార్యక్రమం మాత్రం ఎంతో పవిత్రంగా జరుగుతుంటుంది. భరత్ కూడా అలా ప్రమాణం చేసే సమయమొచ్చింది. తొలి ప్రమాణం ఈ నెల 26నే చేయబోతున్నారు. అసలు ఈ భరత్ ఎవరు? ఆయన ఏ పదవికి ఎంపికయ్యారంటారా? ఆ విషయాల్ని మహేష్‌బాబు కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భరత్ అనే నేను' చిత్రంలో చూడాల్సిందే. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న చిత్రమిది. కైరా అద్వాణీ కథానాయిక. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరణ జరుగుతోంది. ఈ నెల 26 వరకు పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తారు. దాంతో రెండు పాటలు, రెండు ఫైట్లు మినహా చిత్రీకరణ పూర్తవుతుంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తారు. 'భరత్ తొలి ప్రమాణం'గా అభివర్ణిస్తోంది చిత్ర బృందం. రాజకీయ నేపథ్యంతో కూడుకొన్న ఈ చిత్రంలో మహేష్‌బాబు ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. మరి ఫస్ట్‌లుక్‌లోనూ, టీజర్‌లోనూ మహేష్‌బాబు ప్రమాణం చేస్తూ కనిపిస్తారా అనేది చూడాలి. ఆ విషయం గురించి ఆసక్తికరంగా మాట్లాడుకొంటున్నారు అభిమానులు. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు.

ఈనాడు సినిమా

చరణ్ జోరు


రామ్‌చరణ్

రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'రంగస్థలం'. సమంత కథానాయిక. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్, మోహన్ (సి.వి.ఎమ్) నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకొంది. ఈ నెల 24న టీజర్‌ని విడుదల చేయబోతున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. 1985 నేపథ్యంలో సాగే చిత్రమిది. రామ్‌చరణ్ గోదావరి తీరంలోని ఓ పల్లెటూరికి చెందిన యువకుడిగా, సరికొత్త వేషధారణతో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం కోసం ఆయన గుబురుగా గడ్డం పెంచి చిత్రీకరణలో పాల్గొన్నారు. ఆది పినిశెట్టి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: రత్నవేలు.

కొత్త చిత్రంకోసం సిద్ధం

బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ నెల 19 నుంచి చిత్రీకరణ మొదలవుతుంది. 'రంగస్థలం' కోసం కండలన్నీ కరిగించి, కొత్త లుక్‌లోకి మారిపోయిన చరణ్... బోయపాటి సినిమా కోసం మళ్లీ కండలు పెంచి సన్నద్ధమయ్యారు. మాస్ కథతో తెరకెక్కుతున్న చిత్రం కావడంతో చరణ్ మునుపటిలాగా కసరత్తులు చేసి ఫిట్‌గా మారిపోయారు. బోయపాటితో చేయనున్న సినిమా పూర్తవ్వగానే మల్టీస్టారర్ చిత్రం కోసం రంగంలోకి దిగబోతున్నారు చరణ్. వరుస చిత్రాలతో ఈ యేడాది తన జోరును ప్రదర్శించబోతున్నారు చరణ్.


రకుల్ ప్రీత్ సింగ్

అదో థ్రిల్!

సినిమా తారలు అనేసరికి వాళ్లదో రంగుల ప్రపంచం. వాళ్లు మనలా ఉండరు. సాధారణ వ్యక్తులకు ఉన్నంత స్వేచ్ఛా జీవితం వాళ్లకు ఉండదు.. ఇలాంటి అభిప్రాయాలున్నాయి. ఇందులో కొన్ని నిజమే కావచ్చు కానీ అన్నీ కాదు అనేది దక్షిణాది అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్ అభిప్రాయం. "మాది రంగుల ప్రపంచమే కావచ్చు. కానీ నేనూ ఓ సాధారణ అమ్మాయినే. తర్వాతే కథానాయికను. మిగిలిన రంగాలతో పోలిస్తే సినిమా తారలకు ముఖ్యంగా కథానాయికలు స్వేచ్ఛగా ప్రజల మధ్య తిరగడం కొంచెం కష్టమే. అలాగని మనసులో ఉన్న ఇష్టాల్ని చంపేసుకోలేం కదా! స్నేహితులతో తిరగాలని, సరదాగా షాపింగ్ చేయాలని ఇలా చిన్న చిన్న కోర్కెలు చాలా ఉంటాయి. కథానాయికగా ప్రేక్షకుల్లో నా పట్ల ఉన్న అభిమానాన్ని ఆస్వాదిస్తూనే నా సరదాలు తీర్చేసుకుంటుంటాను. నేను నేనుగా సాధారణ ప్రజానీకంతో కలిసి తిరగలేకపోవచ్చు. కానీ చాటుమాటుగా తిరిగే అవకాశం ఉంది. అలా తిరగడం, షాపింగ్ చేయడంలో బోలెడంత థ్రిల్ ఉంటుంది"అని చెప్పింది రకుల్.


అజయ్‌కు జోడీగా?

రకుల్ ప్రీత్ సింగ్ దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతోంది. 'అయ్యారీ'తో బాలీవుడ్‌లో సందడికి సిద్ధమైంది. ఈ చిత్రం విడుదల కాకముందే రకుల్‌కు ఓ భారీ అవకాశం వచ్చినట్టు తెలిసింది. అజయ్‌దేవ్‌గణ్ తర్వాత చిత్రంలో కథానాయికగా రకుల్‌ను తీసుకున్నట్టు బాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో ఆమెది పట్టణ నేపథ్యం ఉన్న ఓ అమ్మాయి పాత్రట. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మొత్తానికి బాలీవుడ్‌లోనూ తన సత్తా చాటడానికి జోరుగానే ఉంది రకుల్.

ఊరంతా అనుకుంటున్నారు


నవీన్ విజయ్‌కృష్ణ

నవీన్ విజయ్‌కృష్ణ కథానాయకుడిగా నటించనున్న చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. బాలాజీ సనాల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీహరి మంగళంపల్లి, ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మంగళవారం నవీన్ విజయ్‌కృష్ణ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మిత్రుడైన కథానాయకుడు సాయిధరమ్ తేజ్ ట్విట్టర్ ద్వారా కొత్త చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు' మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. "ప్రేమ, కుటుంబ అంశాల నేపథ్యంలో సాగే చిత్రమిది. ఊరంతా ఎవరి గురించి, ఏమనుకొంటున్నారన్నది మాత్రం తెరపైనే చూడాలి. ఈ నెల 22 నుంచి చిత్రీకరణ మొదలవుతుంది. ఇందులో శ్రీనివాస్ అవసరాల కీలక పాత్ర పోషిస్తున్నార"న్నారు దర్శకుడు. మేఘా చౌదరి, సోఫియా సింగ్, జయసుధ, అన్నపూర్ణమ్మ తదితరులు నటించనున్న ఈ చిత్రానికి కథ: శ్రీరమ్య - శ్రీమంగలం, సంగీతం: కె.ఎం.రాధాకృష్ణ, ఛాయాగ్రహణం: జి.లింగబాబు.


హృతిక్ రోషన్

ప్రపంచ సుందరుడు హృతిక్!

హీరోలు ఎంతమైందెనా ఉండొచ్చు కానీ కండలు తిరగిన శరీరాకృతి, పదునైన చూపులతో ఆకట్టుకుంటాడు హృతిక్ రోషన్. బాలీవుడ్‌లోనే కాదు ఇప్పుడు ఏకంగా ప్రపంచ నటుల్లో అందగాడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రముఖ హాలీవుడ్ హీరోలు రాబర్ట్ ప్యాటిన్‌సన్, క్రిస్ ఇవాన్స్, గాడ్‌ఫ్రే గావో లాంటి వాళ్లను వెనక్కి నెట్టి నెం.1 స్థానంలో నిలిచాడు హృతిక్. వరల్డ్‌టాప్‌మోస్ట్.కామ్ అనే సంస్థ సర్వే చేసి నటుల్లో టాప్‌టెన్ అందగాళ్ల జాబితాను ప్రకటించింది. "చక్కటి శరీరాకృతి, బాక్సాఫీసు రేటింగ్, ప్రకటనలు, అభిమాన గణం..వీటి ఆధారంగా పూర్తి పారదర్శకంగా ఈ సర్వే చేశాం"అని ఆ సంస్థ ప్రకటించింది. ఈ జాబితాలో బాలీవుడ్ సుల్తాన్ సల్మాన్‌ఖాన్ ఐదో స్థానంలో నిలిచాడు.

కొంత కాలం నేలకొచ్చాం
అతిథులై ఉండివెళ్లగా
కోటలైనా కొంపలైనా
ఏవీ స్థిరాస్తి కాదుగా
కాస్త స్నేహం కాస్త సహనం
పంచుకోవచ్చు హాయిగా
అంతకన్నా స్వంతమంటూ
ప్రపంచ పటంలో లేదుగా


గీతం: ముసుగువెయ్యొద్దు...
చిత్రం: ఖడ్గం
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
- పంపినవారు: జఫరుల్లా ఖాన్, మహబూబ్‌నగర్

గీతోపదేశం

పన్నెండేళ్లుగా ఆదరణ


శశాంక్ వెన్నెలకంటి, విఘ్నేష్ శివన్, సూర్య, జ్ఞానవేల్‌రాజా, వంశీ

"తెలుగు ప్రేక్షకులు పన్నెండేళ్లుగా ప్రేమాభిమానాల్ని పంచుతున్నారు. సంక్రాంతికి ఇక్కడ నా సినిమా విడుదలవడం ఇదే తొలిసారి. 'గ్యాంగ్' తమిళంతో పాటు, తెలుగులోనూ విజయాన్ని అందుకొంది. ఈ ఆనందాన్ని తెలుగు ప్రేక్షకులతో పంచుకోవాలని నిర్ణయించుకొన్నా. తొలిసారి నా కుటుంబానికి దూరంగా ఉంటూ ఇక్కడే పండగని జరుపుకొంటున్నా" అన్నారు సూర్య. ఆయన కథానాయకుడిగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గ్యాంగ్' ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో సూర్య మాట్లాడారు. "తొలిసారి నేను తెలుగులో డబ్బింగ్ చెప్పుకొన్నది 'గ్యాంగ్'కే. పెద్ద సినిమాలతో పాటు, మా చిత్రాన్ని కూడా ఆదరించారు. ఇకపై ప్రతి సినిమాకీ తెలుగులో డబ్బింగ్ చెప్పుకొనేందుకు ప్రయత్నిస్తా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "తమిళంలో కంటే ఎక్కువ తెలుగులో ఈ చిత్రానికి ప్రచారం చేస్తున్నారు మా నిర్మాతలు. మాక్కూడా తమిళ సినిమా కాకుండా, తెలుగు సినిమా చేసినట్టుగా ఉంది. సూర్య అభినయం అలరిస్తోంది. రమ్యకృష్ణ పాత్రకి కూడా మంచి స్పందన లభిస్తోంది" అన్నారు. కార్యక్రమంలో శశాంక్ వెన్నెలకంటి, జ్ఞానవేల్‌రాజా, వంశీ తదితరులు పాల్గొన్నారు.



గ్లామర్ పోలీస్

దీపికా పదుకొణె అంటే ఇప్పుడు అందరికీ 'పద్మావత్' గుర్తొస్తుంది. మహారాణి పాత్రలో నిండుగా కనిపిస్తుంది దీపిక. తాజాగా ముంబయి వీధుల్లో దీపికా పోలీస్ గెటప్‌లో కనిపించి షాకిచ్చింది. జీపు బానెట్‌పై స్టైల్‌గా కూర్చొని దర్జా ఒలకబోస్తుందామె. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. బహుశా దీపిక తర్వాత చిత్రం షూటింగ్ కోసమే ఇదంతా అనుకున్నారంతా. కానీ ఈ సందడంతా ఓ ప్రకటన చిత్రం కోసమట. దీపికా ప్రియుడు రణ్‌వీర్‌సింగ్ కూడా 'సింబ' చిత్రంలో పోలీస్ గెటప్‌లో కనిపించి ఆకట్టుకున్నాడు.

అలలు అల్లరి చేస్తాయి... సముద్రం నిశ్శబ్దంగానే ఉంటుంది. ఒక్కసారి ఉప్పొంగిందా! ఒక్కడు ఒక్కడు మిగలడు!

చిత్రం: గౌతమిపుత్ర శాతకర్ణి
- పంపినవారు: కె.చత్రగాయపుల్లయ్య, కవులూరు, ప.గో.జి

పంచ్ డైలాగ్

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!
చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

రథం ఎప్పుడొస్తుందంటే?


రవిశంకర్

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా నటించిన చిత్రం 'రాజరథం'. ఆర్య, రవి శంకర్ ముఖ్యభూమిక పోషించారు. అనూప్ భండారి దర్శకుడు. జాలీ హిట్స్ టీమ్, అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. "విజయవంతమైన 'రంగితరంగి' తర్వాత నేను దర్శకత్వం వహించిన చిత్రమిది. సంగీతం కూడా నేనే సమకూర్చా. సహజమైన వాద్య పరికరాలతో పాటల్ని సిద్ధం చేశాం. వినడానికి, అలాగే తెరపై చూసేటప్పుడు కూడా పాటలు చాలా బాగుంటాయి" అన్నారు. "విభిన్నమైన కథతో, అత్యున్నతమైన సాంకేతిక హంగులతో చిత్రాన్ని తీర్చిదిద్దాడు అనూప్ భండారి. రొమాంటిక్ కథతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది" అన్నారు నిర్మాతల్లో ఒకరైన అజయ్‌రెడ్డి గొల్లపల్లి. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి.

Dwaraka



‘ నాకు ఐటీ, ఫార్మా కంపెనీల్లో ఐదంకెల ఉద్యోగం సాధించేంత చదువులేదు. అంతమాత్రాన కూలీనాలీ చేసుకుందామనుకున్నా ఇంట్లో ఒప్పుకోరు. కానీ ఆర్థికంగా నాకాళ్లపై నేను నిలబడాలని ఉంది..!’

..మనలోని 70 శాతం మందిలో ఉన్న ఆలోచన ఇది! ఇలాంటివాళ్లకే చక్కటి పరిష్కార మార్గాలు చూపిస్తోంది హైదరాబాద్‌లోని రూరల్ టెక్నాలజీ పార్కు(ఆర్టీపీ)! కేవలం మూడు నుంచి పదిరోజుల శిక్షణతో.. తక్కువలో తక్కువ ఐదువేల రూపాయల పెట్టుబడితో మీరూ పరిశ్రమని స్థాపించవచ్చు. ఈ సంస్థ దాన్నెలా సాధ్యం చేస్తోందంటే..

మూడురోజుల్లో... పరిశ్రమ పెట్టొచ్చు!

జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్ఐఆర్‌డీ)లో భాగమైన హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఉన్న ఆర్టీపీ. తమకున్న తక్కువ అర్హతలతోనే స్వయం ఉపాధి సాధించాలనుకునే మహిళలకి శిక్షణతోపాటూ, మార్కెటింగ్ మెలకువలూ నేర్పించడం దీని లక్ష్యం. ‘రూరల్ టెక్నాలజీ పార్కు’ అన్నంతమాత్రాన ఇది గ్రామీణ స్త్రీలకే పరిమితం అనుకోనక్కర్లేదు. ఏ నగరం నుంచైనా దీన్ని సంప్రదించవచ్చు. కుటుంబ ఆర్థిక పరిస్థితి, చదువు.. ఇవేమీ పరిగణనలోకి తీసుకోరు. నేర్చుకొని వ్యాపారం ప్రారంభించాలన్న తపన ఒక్కటుంటే చాలు.. పూర్తి ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. వ్యాపారం ప్రారంభించి మరో పది మందికి చేయూత కల్పించాలనే లక్ష్యం ఉందా లేదా అని మాత్రమే చూస్తారు! కొన్ని ఆసక్తికరమైన కోర్సులివి..

ఎలా నమోదు చేసుకోవాలి?

శిక్షణ కోసం నమోదు చేసుకోవాలంటే ఒక చిన్న ఉత్తరం రాసినా సరిపోతుంది (చిరునామా: రూరల్ టెక్నాలజీ పార్కు, రాజేంద్రనగర్, హైదరాబాద్-500 030). లేదంటే rtpnird@gmail.com కు మీ వివరాలు మెయిల్ చేయొచ్చు. ఆయా బ్యాచ్‌లవారిగా కోర్సులు నిర్వహిస్తారు. అవి ప్రారంభమయ్యేటప్పుడు మీకు సమాచారం అందిస్తారు. నమోదు రుసుము వంద రూపాయలు. ప్రయాణ ఛార్జీ లొక్కటే మీకు అదనపు ఖర్చు. కోర్సు పూర్తయ్యే వరకూ వసతి కూడా వారే కల్పిస్తారు. బ్యాచ్ ప్రారంభం కాకముందే మీకు శిక్షణ అవసరమైతే అదనపు ఫీజులతో మీకు తర్ఫీదు ఇస్తారు. వివరాలకు 9848780277 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

పుట్టగొడుగుల పెంపకం

దీన్ని చిన్న స్థాయిలో ప్రారంభించడానికి ఒక చిన్న షెడ్ లాంటి నిర్మాణం, చేతిలో అయిదు వేలు రూపాయలుంటే చాలు. వేరే వాళ్ల మీద ఆధారపడకుండా మనకు మనమే సంపాదించుకోవచ్చు. పుట్టగొడుగులు ఒకవేళ అమ్ముడు కాకపోతే పాడవకుండా వాటిని ప్రాసెసింగ్ చేసే పద్ధతులు కూడా శిక్షణలో భాగంగా నేర్పుతున్నారు. వాటినీ చాలా తక్కువ ఖర్చుతోనే మనమే సొంతంగా ఇంట్లో ఏర్పాటు చేసుకోవచ్చు.



విస్తరాకులు...

సాధారణంగా వీటి తయారీకి కావాల్సిన హైడ్రాలిక్ యంత్రాల కోసం 70 వేల రూపాయలు అవసరమవుతాయి. హైడ్రాలిక్ మెషీన్లు కాకుండా చేతితో పనిచేసే పరికరాలని ఇరవైవేలలో కొనుగోలు చేసేయొచ్చు. ఆర్టీపీలో వాటిపైనే శిక్షణ అందిస్తున్నారు. అడ్డాకు, మోదుగాకుతో ఈ విస్తరాకులు తయారుచేస్తున్నారు. వీటితో గంటకు ముప్పై విస్తరాకులు తయారు చేయొచ్చు. రోజుకు నాలుగు గంటలు కష్టపడితే 120 వస్తాయి. ఒక్కోటి ఆరు రూపాయల వంతున(గరిష్ఠంగా) వేసుకుంటే నెలకు దాదాపు ఇరవైవేలు సంపాదించినట్లే. వీటిని తయారుచేసి విదేశాలకూ ఎగుమతి చేస్తున్నవాళ్లున్నారు.

వీళ్లు సాధించారు...



రాజేశ్వరిది సోమాజిగూడ. ఒకప్పుడు చిరుద్యోగి. పెద్దగా చదువుకోలేదు. బొటాబొటి జీతం కాకుండా.. ఆర్థికంగా మరింత స్థిరంగా నిలదొక్కుకోవాలనుకుంది. ఆర్టీపీ గురించి తెలుసుకుని శిక్షణకి దరఖాస్తు చేసుకుంది. సబ్బులూ, షాంపూల ఉత్పత్తి నేర్చుకుంది. ఇప్పుడు సంవత్సరానికి మూడు లక్షల రూపాయల ఆదాయం అందుకుంటోంది. పాత ఉద్యోగం కంటే దాదాపు మూడురెట్లు ఎక్కువ సంపాదిస్తోంది. యాదాద్రికి చెందిన రాధిక సాధారణ గృహిణి. సొంతంగా వ్యాపారం చేసేంత స్థితి లేదు. అందువల్ల తోటివారితో కలిసి కొద్ది పెట్టుబడితో డిటర్జెంట్, డిష్‌వాష్‌లు మొదలుపెట్టింది. ఇప్పుడు చక్కటి లాభాలు ఆర్జిస్తోంది. రాయపల్లికి చెందిన నాని, వెంకట లక్ష్మి.. కూడా ఏం చేయాలో తెలియక ఒకప్పుడు భవిష్యత్తు గురించి సతమతమైనవారే. ఇటుకల తయారీ వాళ్ల జీవితాన్ని మార్చేసింది. వాళ్ల ఊరిలో ఓ ఆసుపత్రిని నిర్మిస్తే.. అందుకు అవసరమైన మొత్తం ఇటుకలూ వీళ్లే తయారు చేసి ఇచ్చారు!

ఐదువేలుంటే చాలు...

మూడు రోజుల నుంచి పదిహేను రోజుల వరకూ నిడివి ఉంటాయంతే. వేప ఉత్పత్తులతోపాటు వర్మి కంపోస్ట్ తయారీ (3 రోజులు), సబ్బుల తయారీ (4 రోజులు), విస్తరాకుల తయారీ (5 రోజులు), తేనె, సోయా ఉత్పత్తులు తయారు చేయడం (5 రోజులు), హెర్బల్ ఉత్పత్తులు (4 రోజులు), సహజ రంగుల తయారీ (15 రోజులు), ఆభరణాల తయారీ (10 రోజులు).. ఇలా దాదాపు ఇరవై రకాల కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. పెట్టుబడి మనం ఎంచుకున్న వ్యాపారాన్ని ఐదు వేల నుంచి అరవైవేలదాకా ఉంటుంది. ‘ఇక్కడ శిక్షణనిచ్చేది కేవలం అధ్యాపకులు కాదు. ఆయా రంగాల్లో సంస్థలు నడుపుతున్నవారు. శిక్షణతోపాటూ పరిశ్రమ పరిస్థితినీ తమ అనుభవాలు రంగరించి చెబుతారు. కాబట్టి.. నేర్చుకున్నవారు అప్పటికప్పుడే ఆయా రంగంలో ధీమగా అడుగుపెట్టొచ్చు..’ అని చెబుతున్నారు ఆర్టీపీ సీనియర్ కన్సల్టెంట్ ఖాన్.

సంచుల తయారీ

కాటన్ సంచుల తయారీ నేర్పిస్తున్నారు ఇక్కడ. శిక్షణా కాలం పదిరోజులు. బ్యాగులతో పాటే వివిధ గృహాలంకార వస్తువుల తయారీపైనా శిక్షణ అదనంగా ఉంటుంది. ఒక కుట్టు మిషన్, అయిదు వేల రూపాయల ముడి సరకు మన చేతిలో ఉండా లంతే. రెండు నుంచి మూడు మీటర్ల కాటన్ వస్త్రంతో చిన్న సైజు బ్యాగులు ఇరవై దాకా తయారుచేయొచ్చు. మనం కొన్న వస్త్రానికి మనం చేసిన పనితనం, సృజన విలువ తెచ్చి పెడతాయి. అవే లాభంగా మారతాయి.

- కౌటిక్ ప్రణయశ్రీ

జలుబా... వెళ్లొద్దు!



రోజులో దాదాపు ఎనిమిది గంటలు కార్యాలయంలోనే గడుపుతుంటారు మనలో చాలామంది. అంటే రోజులో మూడో వంతు అన్నమాట. అక్కడ చిన్న చిన్న పొరపాట్లూ, తప్పిదాలు జరగడం సహజమే. అవి పెరగకుండా ఉండాలంటే... ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం.

- కుటుంబం, సన్నిహితుల వద్ద కొన్ని సందర్భాల్లో మనం నియంత్రణ కోల్పోయి ఏడ్చేస్తాం. అయితే కార్యాలయంలో ఇది సరికాదు. మీకు ఏదైనా విషయంలో సమస్య ఎదురైతే దాన్ని పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయాలి. వీలైతే ఆ సమస్యను మీ పై అధికారికి తెలియజేయాలి. అంతే తప్ప ప్రతి సమస్యకు ఏడుపు పరిష్కారం కాదు.
- మీ సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి ఉండటం చాలా అవసరం. అయితే ‘అతి’ పనికిరాదు. మీ వ్యక్తిగత విషయాలను వారితో చర్చించకూడదు. స్నేహం హద్దు మీరకుండా చూసుకోవాలి.
- ముగ్గురు వ్యక్తులు ఒకచోట కలిస్తే.. అక్కడ లేని వారి గురించి మాట్లాడుకోవడం మామూలే. అలాంటి చర్చలకు వీలైనంత దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ ఎవరైనా పదే పదే చెబుతున్నా ఆసక్తి లేదనే విషయాన్ని సున్నితంగానే తెలియజేయండి.
- జలుబూ, దగ్గు.. లాంటి సమస్యలు ఉన్నప్పుడు ఓ మాత్ర వేసుకుని ఆఫీసుకు వచ్చేస్తుంటాం. కానీ మీ వల్ల ఇతరులకు వ్యాపించొచ్చు. అందుకే కుదిరితే సెలవు తీసుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వండి.
- ఉద్యోగం అన్నాక ఒత్తిళ్లు సహజమే. ఒక్కోసారి దీన్ని భరించడం కష్టం. అలాంటప్పుడు కోపాన్నీ, అసహనాన్ని వ్యక్తం చేయకుండా అధిగమించేందుకు ప్రయత్నించాలి.

వాటితో సమస్య లేకుండా...



లోదుస్తుల విషయంలో మనం తరచూ ఎదుర్కొనే సమస్య అవి బయటికి కనిపించడం. కొన్నిసార్లు దుస్తులు బాగా లేకో, లేదంటే మనం ఎంచుకున్న రకానికి నప్పకో ఈ సమస్య ఎదురవుతుంది. ఇలాంటప్పుడు ఏంచేయాలంటే..

- బ్రాలకోసం ప్రత్యేకంగా చిన్న బ్యాండ్ ఎయిడ్ లేదంటే టేపు లాంటిది బజార్లో దొరుకుతుంది. దాన్ని భుజం దగ్గర చర్మానికి అంటించి ఆ తరువాత బ్రా పట్టీలకు అంటించండి. పదే పదే సర్దుకోవాల్సిన అవసరం ఉండదు. మనం పెట్టుకునే బొట్టుబిళ్లలకు ఉండే గమ్ లాంటిదే దీనికీ ఉంటుంది కాబట్టి ఉపయోగించుకోవచ్చు. కిందకు జారకుండా కూడా దీన్ని వాడుకోవచ్చు.
- జీన్స్ మీద వేసుకునే టాప్‌లకు ముందు వైపు బటన్లు ఉంటాయి. కొన్నిసార్లు వాటి మధ్య ఖాళీలు ఎక్కువగా వచ్చి శరీరం కనిపిస్తుంది. అలాంటప్పుడు కూడా ఈ టేప్ అంటిస్తే రెండు అంచులు ఎంచక్కా అతుక్కుపోతాయి.
- బజార్లో బ్రా ఎక్స్‌టెండర్స్ అని దొరుకుతాయి. బ్రా ఏ మాత్రం బిగుతుగా ఉన్నా దాన్ని జతచేస్తే మళ్లీ కొన్నాళ్లు వాడుకోవచ్చు.
- ఒకవేళ రెండు పట్టీలు వదులుగా అయి జారుతోంటే.. రెండు పట్టీలను కలిపి చిన్న పిన్ను పెట్టుకుంటే సరిపోతుంది.

బంగారం-వెండి



16న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,170	30,810	30,700	30,700
ఆర్నమెంట్	29,100	28,770	28,500	28,500
వెండి (కిలో)	40,200	39,900	40,200	40,200
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,070	30,480	30,680	30,480
ఆర్నమెంట్	28,400	28,270	28,690	28,500
వెండి (కిలో)	40,000	39,900	39,450	39,300
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,850	30,610	-------	-------
ఆర్నమెంట్	28,690	28,470	2,882	2,850 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	42.40	42.00 గ్రా

నజరానా

అరటి, ఆపిల్ పండ్లు వంటివి ముక్కలుగా తరిగిన తరువాత నల్లబడుతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే కాస్త ఉప్పు కలిపిన నీటిని వాటిపై చల్లి చూడండి. రంగు మారవూ, తాజాగానూ ఉంటాయి!

ఏ కారైనా... నడిపేస్తుంది!



అలెక్స్ హిర్ష్చి... ఒకప్పుడు ఆర్జేగా పనిచేసిన ఆమె.. ఇప్పుడు పెద్దపెద్ద కార్ల టెస్ట్‌రైడర్‌గా అరుదైన గుర్తింపు తెచ్చుకుంటోంది. కార్లు నడపడంపై ఆమెకున్న ఆసక్తితోనే ఈ రంగాన్ని ఎంచుకుందామె. దానికి కారణం ఓసారి ఆమె చేసిన సాహసయాత్రే. కార్ల డ్రైవింగ్‌పై ఉన్న అమితాసక్తితో ఆమె ‘సూపర్ కార్స్ క్లబ్ అరేబియా’లో సభ్యురాలైంది. ఒకసారి ఆ క్లబ్‌కు చెందిన 60 మంది సభ్యులతో కలిసి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి సౌదీ అరేబియా సరిహద్దు వరకూ వెయ్యి కిలోమీటర్లు కార్లో ప్రయాణించింది. అత్యంత ఖరీదైన, విలాసవంతమైన 60 కార్లు వేగంగా ఒకదానిని మించి ఒకటి వరుసగా వెళుతుంటే, ఆ ప్రయాణానికి దుబాయ్ పోలీస్‌లు అంగరక్షకులయ్యారు. అంతేకాదు, హెలీకాప్టర్‌లో కూడా పర్యవేక్షించారు. దాన్నుంచి వచ్చిన ఆనందాన్ని ఆమె జీవితాంతం కొనసాగించాలనుకుంది. అంతే ఉద్యోగానికి రాజీనామా చేసింది. కార్ల టెస్ట్‌రైడర్‌గా మారిపోయింది. ఎలాంటి కారైనా సరే.. మైళ్ల దూరం నడిపి దాని పనితీరూ, పరిస్థితీ, మైలేజీ వంటి వివరాలు వినియోగదారులకు అందిస్తుంది. 100 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో కార్లను నడిపేస్తుంది. వాటిల్లో ఫెరారీ 488 జీటీబీ, 488 స్పైడర్, బెంట్లీ జీటీ3ఆర్, మెర్సిడెస్ ఏఎంజీ జీటీస్, మెక్లారెన్570, లంబోర్గనీ హురాకన్ సహా అన్నీ అత్యాధునికమైనవే. మహిళలు పెద్దగా కనిపించని ఈ రంగంలో మీరెలా అని అడిగితే ‘ఇందులో ఉన్న కిక్, ఇంకే ఉద్యోగంలోనూ ఉండదు’ అంటుంది అలెక్స్. కేవలం నడపడమే కాదు “సూపర్‌కార్ బ్లాండ్” పేరుతో ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో ఆ వివరాలనూ పోస్టు చేస్తుంది. విచిత్రం ఏంటంటే.. ఆమెకు లక్షల్లో ఫాలోవర్లు ఉన్నారు.



భర్తను అదే పనిగా అనుమానిస్తుంటే...

? మా మేనత్త కూతురికి నాలుగేళ్ల క్రితం పెళ్లయ్యింది. ఇది ఆమెకు రెండో పెళ్లి. మొదటి భర్త పెళ్లయిన రాత్రే చిత్రహింసలు పెడితే పెద్దలు విడాకులిప్పించారు. ఆ తరువాత ఏడాదికే ఆమెకు మరో పెళ్లి చేశారు. అతను కూడా రెండో పెళ్లి వ్యక్తే. పోనీలే ఇద్దరూ సర్దుకుపోతారనుకుంటే సమస్య మరోలా వచ్చింది. ఇప్పుడు ఆమె అతడి ప్రతి కదలికనూ అనుమానిస్తోంది. ఎవరితో మాట్లాడుతున్నా సరే! అతనికి వారితో ఏదో సంబంధం ఉంటుందంటోంది. అంతా కలిసి తనపై ఏదో కుట్ర చేస్తున్నారని ఏడుస్తుంది. కానీ అతనేమో ఆమే అలా ప్రవర్తిస్తోందని తన తప్పేం లేదనీ చెబుతున్నాడు. తన మానసిక పరిస్థితిని పూర్తిగా అంచనా వేయలేకపోతున్నాం. పైగా బంధువులంతా ఆమె కావాలనే అతనంటే ఇష్టం లేక అలా చేస్తోందంటున్నారు. ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందా? లేక ఆమె కావాలనే చేస్తోందా?

- ఓ సోదరి

డియర్ వసుంధర



డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

✔ మీ ఉత్తరాన్ని బట్టి మీరు మీ కజిన్‌ని మానసికవైద్యుల వద్దకు తీసుకెళ్లడం మంచిదని అర్థం అవుతోంది. ఇది ఆమె భవిష్యత్తుకీ, వర్తమాన పరిస్థితుల తీవ్రత దృష్ట్యా తప్పనిసరి. అప్పుడే సమస్య మరింత చేయి దాటిపోకుండా ఉంటుంది. అయితే ఇదే సమయంలో కేవలం ఆ కౌన్సెలింగ్ ఆమెకు మాత్రమే కాక ఆమె భర్తకూ అవసరం. దానికంటే ముందు అసలు ఆమెలో విపరీతమైన అభద్రతా భావానికి గల కారణాలు తెలుసుకోండి. ఆమె తన భర్తను అనుమానించడం ద్వారా అభద్రతా భావాన్ని బయటపెట్టుకుంటున్నట్లుగా మీ ఉత్తరం సూచిస్తోంది. నిజంగానే ఊహించుకుంటోందా! లేక అతని ప్రవర్తనా, ఇతరత్రా అంశాలేవైనా దీనికి దోహదం చేస్తున్నాయా అనేదీ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది మానసిక వైద్యుల పర్యవేక్షణలో జరిగితే మరింత మంచిది. ప్రత్యేకమైన థెరపీతో నయం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఇక అదే సమయంలో అతని వైపు నుంచి కూడా సమస్యను అర్థం చేసుకోవడం తప్పనిసరి. ఈ సమయంలో అతని ఆలోచనను అంచనా వేయండి. అసలు పెళ్లయినప్పటి నుంచీ ఆమె అలానే ఉందా! లేక మధ్యలో ఈ పరిస్థితి తలెత్తిందా తెలుసుకోండి. ఈ మార్పు కొత్తగా గనుక మొదలైతే.. దానికి ముందు జరిగిన సంఘటనల నేపథ్యం తెలుసుకోవడం తప్పనిసరి. అలానే అతని ప్రవర్తన నిజంగానే తెలిసో, తెలియకో దీనికి కారణం అయితే ఆ అపోహల్ని తొలగించడానికి అతను ఏం చేయగలడో అడగండి. కుటుంబసభ్యులు ఏ విధంగా సాయం చేయగలరనేదీ కూడా అంచనాకు రండి. ఇవేవీ కాకుండా అంతకు ముందు పెళ్లిలో ఎదురైన సంఘటన వల్ల ప్రస్తుతం ఈ ప్రవర్తన ఇలా ఉంటే అతను చూపించే ప్రేమ ద్వారా మానసికంగా దగ్గరయ్యే అవకాశం ఉంది. కాబట్టి నిపుణులను సంప్రదించడం మంచిది.

బీటెక్‌కి సంబంధించి మొదటి ముఖ్య ఘట్టం సీటు సాధించుకోవడమైతే, మలిఘట్టం మూడు, నాలుగు సంవత్సరాల్లో ప్రాజెక్టులు చేయడం. రెండోది మంచి ఉద్యోగం సంపాదించుకోవడానికి చాలా అవసరం. చేసే ప్రాజెక్టు నాణ్యత ఉద్యోగస్థాయిని కూడా నిర్ణయిస్తుంది. తరగతిలో, ప్రయోగశాలల్లో, ఇంకా సెమిస్టర్ పరీక్షల్లో ప్రదర్శించే ప్రతిభ అంతా ఒక ఎత్తయితే ప్రాజెక్టు వర్క్ మరో ఎత్తవుతుంది. అందుకే ఒక బీటెక్ విద్యార్థి ప్రాజెక్టులు ఎన్ని చేయాలి? ఎప్పుడు చేయాలి? ఎందుకు చేయాలి? వాటి అవసరమేంటి? ఉపయోగమేమిటి? తదితర ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుంటే మంచి ప్రాజెక్ట్‌కి మార్గం తేలిగ్గా వేసుకోవచ్చు.

ఇష్టాల ప్రకారమే ఇంజినీరింగ్ ప్రాజెక్ట్!

ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి యూనివర్సిటీ నిబంధనలను అనుసరించి మూడో సంవత్సరం రెండో సెమిస్టర్‌లో మినీ ప్రాజెక్టు, నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్‌లో మేజర్ ప్రాజెక్టు అంటే కనీసం రెండు ప్రాజెక్టులు చేయాలి. వీటికి వరుసగా 50, 200 మార్కులు ఉంటాయి. అయితే మొదటి నుంచి ప్రతి సెమిస్టర్‌లో ఒక ప్రాజెక్టు చేయడం చాలా మంచిది. అలా వీలు కాకపోతే మూడు, నాలుగు సంవత్సరాల్లో సెమిస్టర్‌కి ఒకటి చొప్పున నాలుగు ప్రాజెక్టులు చేసినా ఉపయోగకరమే.



నేర్చుకున్నది చేసి చూపడమే

ఇంజినీరింగ్ విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న, ప్రయోగశాల్లో అభ్యాసం చేసిన విషయాలను కలిపి సమగ్రంగా అర్థం చేసుకోవడం ప్రాజెక్టువర్క్‌ల వల్ల సాధ్యమవుతుంది. తాము నేర్చుకున్న అంశాల అనువర్తన పరిశ్రమల్లో ఏవిధంగా జరుగుతుందో తెలుస్తుంది. ఒక ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తిచేయాలంటే దానిపట్ల సరైన అవగాహన ఉండాలి. సాధారణంగా ప్రాజెక్ట్ అనగానే సరికొత్తగా ఉండాలనుకుంటారు. అలా నవ్యతతో కూడిన వాటిని చేయాలంటే ప్రాజెక్ట్ పర్వాన్ని ఒక క్రమంలో అనుసరించాలి.

ప్రాజెక్ట్‌ను ఎంచుకోవడంలో ముఖ్యమైన అంశాలు పరిధి, సమయం. వాటిని తెలుసుకోడానికి ఈ కింది మార్గదర్శకాలు అనుసరించాలి.

అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలు: ప్రాజెక్టు ఎంచుకోవడానికి ముందు మన బ్రాంచిలోని ఏ సబ్జెక్టులో మనకు ప్రత్యేక శ్రద్ధ ఉందో గ్రహించాలి. ఉదాహరణకు మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి ఆటోమొబైల్‌లో ప్రాజెక్ట్ చేయాలనుకుంటే, ఆ రంగంలో కనీస పరిజ్ఞానం ఉండాలి. అప్పుడే ప్రాజెక్టు పట్ల స్పష్టత ఉంటుంది.

సంక్లిష్టం కానీయవద్దు: ప్రాజెక్ట్ లక్ష్యం పట్ల స్పష్టత ఉండాలి. ఒక్కోసారి ఈ క్రమంలో లక్ష్యం పట్ల సరైన అవగాహన లేక ప్రాజెక్ట్‌ను సంక్లిష్టం చేసుకునే అవకాశం ఉంది. అలా జరగకుండా జాగ్రత్త వహించాలి. తమకు వీలైన, ఒక మోస్తరు జటిలంగా ఉండే ప్రాజెక్ట్‌ను ఎంచుకోవాలి. సంబంధిత సమాచారాన్ని ముందే సేకరించుకోవాలి.

తక్కువ ఖర్చు: ప్రాజెక్ట్ చేయాలంటే కొన్ని పరికరాలు, వనరులు కావాలి. వాటికి సంబంధించిన ఖర్చు గురించి ముందే అంచనా వేసుకోవాలి. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం చేకూర్చే ప్రాజెక్ట్‌లను ఎంచుకోవాలి.

కాలపరిమితి: మూడో సంవత్సరంలో చేసే మినీ ప్రాజెక్ట్ కాలవ్యవధి దాదాపు మూడు వారాలు. నాలుగో సంవత్సరంలో చేసే మేజర్ ప్రాజెక్టుకు మూడు నెలల కాలపరిమితి ఉంటుంది. ఎక్కువ కాలం పట్టే ప్రాజెక్ట్‌లు ఎంచుకోకూడదు.

టూల్స్ అందుబాటు: ప్రాజెక్ట్‌కి అవసరమైన టూల్స్ అందుబాటులో ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఉదాహరణకు సిమ్యులేషన్ ద్వారా ఒక ప్రాజెక్టు చేయాలనుకుంటే దానికి సంబంధించిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లు ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవాలి.

ప్రాజెక్టు అబ్‌స్ట్రాక్ట్

ముగ్గురితో టీమ్: ప్రాజెక్ట్ టీమ్‌లో ముగ్గురు మించకుండా చూసుకోవాలి. ఇద్దరు లేదా ముగ్గురు ఉంటే సమంగా బాధ్యతలను పంచుకొని ప్రాజెక్ట్ పూర్తిచేయడం సులువవుతుంది. ఒక్కరే చేయాలనుకోవద్దు. ఇతరులతో కలిసి చేయడం మంచిది. మనతోపాటు ఆలోచించగలిగి, బాధ్యతలను పంచుకునే వారినే సభ్యులుగా ఎంచుకోవాలి.



అబ్‌స్ట్రాక్ట్: తాము చేయబోయే ప్రాజెక్ట్ వివరాలను క్లుప్తంగా టీమ్ సిద్ధం చేసుకోవాలి. ఇదే సారాంశం లేదా అబ్‌స్ట్రాక్ట్. ఇందులో సమస్య నిర్వచనం, ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ, పరిధి, పరిమితులు, అవసరాలు, ఉపయోగాలు, అవసరమైన టూల్స్, బృంద సభ్యుల వ్యక్తిగత బాధ్యతలు, గాంట్ చార్ట్ తదితర రూపాల్లో ప్రాజెక్ట్ ప్రణాళికలు ఉంటాయి. వాటిని కాలేజీ ప్రాజెక్ట్ కమిటీకి తమ గైడ్ ద్వారా సమర్పించాలి.

విభిన్న బ్రాంచిలకు వివిధ డొమెయిన్‌లు

ప్రతి ఇంజినీరింగ్ బ్రాంచిలోనూ కొన్ని ముఖ్యమైన ఉప శాఖలు ఉంటాయి. ఏదైనా ఒక ఉప విభాగంలో ప్రాజెక్ట్ చేయవచ్చు. ఇష్టమైన డొమెయిన్‌లో ప్రాజెక్టు చేస్తే అన్ని విధాలా ప్రయోజనకరంగా ఉంటుంది.



నీలమేఘశ్యామ్ దేశాయ్
ACE ఇంజినీరింగ్ కళాశాల

అభ్యర్థుల అవగాహన కోసం ఇంజినీరింగ్‌లో మూల శాఖలైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ బ్రాంచిలకు సంబంధించిన ముఖ్యమైన డొమెయిన్‌లను ఈ కింద పరిశీలించవచ్చు.

సివిల్ ఇంజినీరింగ్: ◆ సర్వేయింగ్ వంటి క్షేత్రస్థాయి ప్రాజెక్ట్‌లు ◆ కాంక్రీట్ టెక్నాలజీ ◆ డిజైన్ ◆ స్టాడ్‌ప్రో సాఫ్ట్‌వేర్ వినియోగం ◆ రవాణా ◆ ఆర్‌సీసీ డిజైన్ ◆ స్టీల్ డిజైనింగ్ ◆ ప్రిస్ట్రెస్డ్ కాంక్రీట్ స్ట్రక్చర్ డిజైన్ ◆ స్టాడ్/ప్రొ ఈ-టాబ్ ఆధారిత ప్రాజెక్ట్ ◆ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ ◆ కన్‌స్ట్రక్షన్, ఎస్టిమేషన్ ◆ జియోటెక్నికల్ ఇంజినీరింగ్ ◆ వాటర్ రిసోర్సెస్.

ఈఈఈ/ఈసీఈ/ఈఐఈ: ఈ మూడు బ్రాంచిల వారికి కామన్‌గా ఉండే కొన్ని ప్రాజెక్టులు- ▮ ఎంబెడెడ్ సిస్టమ్స్ ▮ వీఎల్ఎస్ఐ ▮ సిమ్యులేషన్ ప్రాజెక్ట్ (లాబ్ వ్యూ, మాట్‌లాబ్) ▮ రియల్‌టైమ్ డీఐపీ ▮ రోబోటిక్స్ ▮ ఇన్‌స్ట్రుమెంటేషన్ ▮ వర్చువల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ▮ పీఎల్‌సీ - స్కాడా ▮ ఆండ్రాయిడ్ ▮ అర్డుయినో

ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్

ఐఓటీ - ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ ప్రస్తుతం చాలా ముఖ్యమైన డొమెయిన్. ఏ బ్రాంచ్ వారైనా తమ ప్రాజెక్ట్‌ను నెట్‌వర్క్ వాతావరణంలో ఇంటర్‌నెట్ ఆధారంగా వివిధ టెక్నాలజీల, సేవల అభివృద్ధి, నిర్వహణ ఈ డొమెయిన్ ప్రత్యేకతలు. హెల్త్‌కేర్, పారిశ్రామిక, రవాణా, సమాచార, భద్రత, వినోదం మొదలైన రంగాల్లో దీని వినియోగం ఎక్కువ. పరిశ్రమల్లోని కొన్ని ప్రత్యేకమైన పనులను ఐఓటీ ద్వారా చేయిస్తున్నారు. ప్రాజెక్ట్ ఎంపికలో ఈ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.

ఎలక్ట్రికల్: ✦ పవర్ జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ ✦ ఏసీ, డీసీ డ్రైవ్స్ ✦ టెలిమెట్రీ ✦ అన్‌ఇంటరప్టెడ్ పవర్ సప్లై ✦ ఇన్వర్టర్స్ ✦ ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా ✦ లాస్‌లెస్ పవర్ ట్రాన్స్‌మిషన్ ✦ పీసీబీ, పవర్ ప్యానెల్స్ నిర్మాణ, నిర్వహణలు ✦ పవర్ ఎలక్ట్రానిక్స్

ఈసీఈ/ఈఐఈ: ◗ వీధి దీపాల స్వయం నిర్వహణ ◗ రేడియో ఫ్రీక్వెన్సీ ఆధారిత పాస్‌పోర్టులు ◗ బయోమెట్రిక్ ప్రాజెక్ట్ ◗ టచ్ స్క్రీన్ నిర్వహణ, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ◗ ఆర్ఎఫ్ఐడీ కమ్యూనికేషన్ డివైజెస్ ◗ డేటా కలెక్షన్ అండ్ ప్రాసెసింగ్ ఫ్రమ్ శాటిలైట్స్ ◗ మొబైల్ ఫోన్ ఆధారిత టెలిమెట్రీ ◗ డిజిటల్ కంట్రోల్ సిస్టమ్స్ ◗ థైరిస్టర్ కంట్రోల్ సిస్టమ్స్ ◗ మైక్రో కంట్రోలర్ సిస్టమ్స్

మెకానికల్ ఇంజినీరింగ్: ✦ ఆటోమొబైల్స్ ✦ మాన్యుఫాక్చరింగ్ ✦ రోబోటిక్స్ ✦ కాడ్/కామ్ ✦ అగ్రికల్చర్ ✦ థర్మల్ ప్రాజెక్ట్ ✦ సీఎన్‌సీ మెషిన్స్ ✦ ఆటోమేషన్ ✦ మెకాట్రానిక్స్ ✦ కాంపోజిట్స్ ✦ మిస్సైల్ టెక్నాలజీ ✦ డ్రోన్స్ ✦ పౌడర్ మెటలర్జీ ✦ ల్యూబ్రికేషన్ ✦ పైప్‌లైన్ డిజైన్

కంప్యూటర్ సైన్స్: ◆ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ◆ క్లౌడ్ కంప్యూటింగ్ ◆ డేటా సెక్యూరిటీ ◆ డేటా మైనింగ్ ◆ డేటాబేస్ సెక్యూరిటీ ◆ డిస్ట్రిబ్యూటెడ్ నెట్‌వర్కింగ్ ◆ గ్రిడ్ కంప్యూటింగ్ ◆ ఇమేజ్ ప్రాసెసింగ్ ◆ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ◆ ఇంట్రూజన్ డిటెక్షన్ సిస్టమ్స్ ◆ నాలెడ్జ్ అండ్ డేటా ఇంజినీరింగ్ ◆ మొబైల్ కంప్యూటింగ్ ◆ నెట్‌వర్క్ సెక్యూరిటీ ◆ కంప్యూటర్ నెట్‌వర్క్ ◆ న్యూరల్ నెట్‌వర్క్ ◆ వర్చువల్ రియాలిటీ ◆ పెర్ఫార్మెన్స్ ట్యూనింగ్ ◆ రియల్ టైమ్ సర్వేయలెన్స్ సెక్యూరిటీ సిస్టమ్స్ ◆ సిగ్నల్ ప్రాసెసింగ్ ◆ డిజిటల్ ఫోరెన్సిక్స్ ◆ వెబ్ సెక్యూరిటీ ◆ వెబ్ మైనింగ్ ◆ వైర్‌లెస్ సెన్సర్ నెట్‌వర్క్ ◆ టెక్స్ట్‌మైనింగ్

ప్రాజెక్టుల సంక్షిప్త సమాచారం, టైటిల్స్ ఇతర వివరాలు అందించే కొన్ని వెబ్‌సైట్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్‌డీఏ & ఎన్ఏ ఎగ్జామ్-2018
ఖాళీల వివరాలు: ✦ నేషనల్ డిఫెన్స్ అకాడమీ: 360 ✦ నావల్ అకాడమీ: 55
మొత్తం ఖాళీలు: 415
అర్హతలు: ఎన్‌డీఏకు పన్నెండో తరగతి, ఎన్ఏకైతే ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** అభ్యర్థులు 02.07.1999 నుంచి 01.07.2002 మధ్య జన్మించి ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ తదితర టెస్టుల ఆధారంగా **దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరి తేదీ:** 05.02.2018 **పరీక్ష తేదీ:** 22.04.2018
వెబ్‌సైట్: www.upsc.gov.in

ఎస్‌బీఐ - స్పెషలిస్ట్ ఆఫీసర్స్
పోస్టుల సంఖ్య: 121
1) మేనేజర్: 76
2) చీఫ్ మేనేజర్: 45
అర్హత: సీఏ/ ఎంబీఏ/ పీజీడీఎం/ ఐసీడబ్ల్యూఏ/ ఏసీఎస్/ బీఈ/బీటెక్‌తో ఎంబీఏ/ పీజీడీఎం/ పీజీడీబీఏ ఉండాలి. **అనుభవం:** మేనేజర్ - 5 సంవత్సరాలు, చీఫ్ మేనేజర్ - 8 సంవత్సరాలు.
దరఖాస్తు: ఆన్‌లైన్. **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు ఫీజు: రూ.600. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.100.
చివరి తేదీ: 04.02.2018.
దరఖాస్తు ప్రింట్ తీసుకోవడానికి చివరితేదీ: 19.02.2018.
వెబ్‌సైట్: https://www.sbi.co.in/careers

సెంట్రల్ పవర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
ఖాళీల సంఖ్య: 18
పోస్టులు: ఇంజినీరింగ్ ఆఫీసర్-09, ఇంజినీరింగ్ అసిస్టెంట్-02, టెక్నీషియన్-02, అసిస్టెంట్-03, అసిస్టెంట్ లైబ్రేరియన్-02.
అర్హత: బీఈ/బీటెక్, డిప్లొమా (సివిల్), ఐటీఐ, డిగ్రీ (కామర్స్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ బిజినెస్ మేనేజ్‌మెంట్), డిగ్రీ/డిప్లొమా (లైబ్రరీ సైన్స్)/ బీఎల్ఐఎస్సీ.
దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరితేదీ:** 29.01.2018.
వెబ్‌సైట్: www.cpri.in/careers.html

వాక్ఇన్

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా
ఖాళీల సంఖ్య: 09.
1) సీనియర్ రిజిస్ట్రార్
అర్హత: ఎంబీబీఎస్‌తోపాటు మూడేళ్ల పీజీ డిగ్రీ ఉండాలి.
2) రిజిస్ట్రార్
అర్హత: ఎంబీబీఎస్‌తోపాటు రెండేళ్ల డిప్లొమా ఉండాలి.
3) రెసిడెంట్ హౌస్ ఆఫీసర్
అర్హత: ఎంబీబీఎస్‌తోపాటు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
వాక్ఇన్ తేదీ: 29.01.2018.
వెబ్‌సైట్: https://www.sailcareers.com/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

మార్కెట్ రిసెర్చ్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్స్

వెబ్ డెవలప్‌మెంట్
సంస్థ: Cassius Technologies
ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.10,000
లింకు: internshala.com/i/8303
గడువు: జనవరి 24, 2018 **అర్హులు:** ఎంఎస్ ఆఫీస్ నైపుణ్యాలు ఉన్నవారు.

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: WhiteCoats
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.7000-రూ.12,000
లింకు: internshala.com/i/8304
గడువు: జనవరి 25, 2018
అర్హులు: అడొబ్ ఫొటోషాప్, అడొబ్ ఇలస్ట్రేటర్ నైపుణ్యాలు ఉన్నవారు.



మార్కెట్ రిసెర్చ్
సంస్థ: LADDER INDIA
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.6000-రూ.8000
లింకు: internshala.com/i/8308
గడువు: జనవరి 22, 2018
అర్హులు: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

మరిన్ని ఇంటర్న్‌షిప్‌లకు www.eenadupratibha.net చూడవచ్చు.

ఒక ప్రిపరేషన్.. రెండు పరీక్షలు!

సాధారణ డిగ్రీతో 950 ఆఫీసర్ ఉద్యోగాలకు పోటీపడే మంచి అవకాశం వచ్చింది. ఒక ప్రిపరేషన్ పట్టుదలతో చేస్తే రెండు బ్యాంకులు నిర్వహించే ఉద్యోగ పరీక్షలకు హాజరు కావచ్చు. కొత్త సంవత్సరంలో ఆఫీసర్ ఉద్యోగంలో చేరిపోవచ్చు.

ఎస్‌బీఐ, ఐబీపీఎస్‌లు నిర్వహించే ఉమ్మడి రాత పరీక్షల ద్వారానే కాకుండా కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు పీజీడీబీఎఫ్ (పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్) కోర్సు ద్వారా కూడా ప్రొబెషనరీ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సిండికేట్ బ్యాంకు 500 పోస్టులు, కెనరా బ్యాంక్ 450 పోస్టులకు నోటిఫికేషన్లను విడుదల చేశాయి. రెండింటికీ దాదాపు ఒకే పరీక్ష విధానం ఉండటం వల్ల ఒకే ప్రిపరేషన్ ద్వారా ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యే అవకాశం అభ్యర్థులకు కలిగింది.



కెనరా బ్యాంక్, సిండికేట్ బ్యాంక్‌ల రాతపరీక్షా విధానం ఒకే విధంగా ఉంది. నాలుగు సబ్జెక్టులతో ఆబ్జెక్టివ్ తరహాలో ఒకే విధమైన ప్రశ్నల సంఖ్యతో ఉన్నాయి. అయితే సిండికేట్ బ్యాంక్‌కి మాత్రం అదనంగా ఇంగ్లిష్ భాషపై డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. ఈ నాలుగు సబ్జెక్టుల్లో ఏయే అధ్యాయాల నుంచి ఎలాంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందో చూద్దాం.

ఛైర్మన్ పోస్టు వరకు చేరుకోవచ్చు!

ఒక సంవత్సరం పీజీడీబీఎఫ్ కోర్సు పూర్తయ్యాక అభ్యర్థులు ప్రొబెషనరీ ఆఫీసర్లుగా నియమితులవుతారు. రెండు సంవత్సరాల ప్రొబెషనరీ కాలం పూర్తయ్యాక అభ్యర్థులు అసిస్టెంట్ మేనేజర్‌లుగా స్కేల్-1 కేటగిరీలో నియమితులవుతారు.

ఇప్పుడు ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ ఫాస్ట్ ట్రాక్ ప్రమోషన్ పద్ధతులను అనుసరిస్తూ అంతర్గతంగా రాతపరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించడం ద్వారా పదోన్నతులను కలుగజేస్తున్నాయి. అసిస్టెంట్ మేనేజర్‌లుగా స్కేల్- 1 కేటగిరీలో నియమితులైన అభ్యర్థులు తర్వాత పదోన్నతుల ద్వారా డిప్యూటీ మేనేజర్ (స్కేల్- 2), మేనేజర్ (స్కేల్ - 3), చీఫ్ మేనేజర్ (స్కేల్ -4), అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (స్కేల్ - 5), డిప్యూటీ జనరల్ మేనేజర్ (స్కేల్ -6), జనరల్ మేనేజర్ (స్కేల్ -7), చీఫ్ జనరల్ మేనేజర్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంది.

ప్రస్తుతం వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల ఛైర్మన్‌లు చాలా వరకు ప్రొబెషనరీ ఆఫీసర్లుగా తమ కెరియర్ మొదలుపెట్టినవారే. అందువల్ల డిగ్రీ పూర్తయిన వెంటనే చిన్నవయసులోనే పీవో ఉద్యోగం సాధిస్తే బ్యాంకులో అత్యున్నత స్థానం చేరుకునే అవకాశం ఉంటుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో సింప్లిఫికేషన్స్, నంబర్ సిరీస్, డేటా సఫిషియన్సీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, అరిథ్‌మెటిక్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ మొదలైన వాటి నుంచి ప్రశ్నలు ఉంటాయి. అరిథ్‌మెటిక్‌లో నిష్పత్తులు (రేషియో), శాతాలు (పర్సంటేజి), లాభ - నష్టాలు (ప్రాఫిట్ - లాస్), బారువడ్డీ - చక్రవడ్డీ (సింపుల్ - కాంపౌండ్ ఇంటరెస్ట్), కాలం - పని (టైమ్ - వర్క్), కాలం - దూరం (టైమ్ - డిస్టెన్స్), ట్రెయిన్స్, బోట్స్, మెన్సురేషన్, ప్రస్తారాలు - సంయోగాలు (పర్ముటేషన్స్ - కాంబినేషన్స్), సంభావ్యత (ప్రాబబిలిటీ) మొదలైన వాటి నుంచి కనీసం ఒక ప్రశ్న వచ్చే అవకాశం ఉంది. డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 20 - 25 ప్రశ్నలు ఉంటాయి. వాటిని బాగా సాధన చేయాల్సి ఉంటుంది. అదే విధంగా కాలిక్యులేషన్స్ వేగంగా చేయగలిగేలా సాధన చేయాలి.



డా. జి.ఎస్. గిరిధర్
డైరెక్టర్, RACE

రీజనింగ్

ఆసక్తిని కలిగించే సబ్జెక్టు ఇది. నాన్ - మేథ్స్ అభ్యర్థులు కూడా తేలికగా చేయగలిగే అవకాశం ఉంది. కోడింగ్ - డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిజమ్, పజిల్‌టెస్ట్, ఇన్‌పుట్ - అవుట్‌పుట్, ఎలిజిబిలిటీ టెస్ట్, డేటాసఫిషియన్సీ, స్టేట్‌మెంట్ - అజమ్షన్స్/ఆర్గ్యుమెంట్స్/కోర్సెస్ ఆఫ్ యాక్షన్/ఇన్‌ఫరెన్స్ మొదలైన వాటి నుంచి తప్పనిసరిగా ప్రశ్నలుంటాయి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లు రెండింటిలోనూ ఈ విభాగం ఉంది. రీడింగ్ కాంప్రహెన్షన్, ఫైండింగ్ ఎర్రర్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సెంటెన్స్ కంప్లిషన్స్, రీ అరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, క్లోజ్ టెస్ట్, సిననిమ్స్, యాంటనిమ్స్ మొదలైన వాటి నుంచి ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, ప్రెసి రైటింగ్ మొదలైన వాటిపై డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. డిస్క్రిప్టివ్ టెస్ట్ గట్టెక్కాలంటే రైటింగ్ స్కిల్స్‌పై పట్టు పెంచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

వర్తమానాంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. బ్యాంకింగ్, ఆర్థిక సంబంధ విషయాలపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. భారత దేశ బ్యాంకింగ్ వ్యవస్థ, ఆర్థిక సంస్థలు, ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్టాక్‌మార్కెట్ మొదలైన వాటితోపాటు వర్తమానాంశాలపై తప్పనిసరి ప్రశ్నలు ఉంటాయి. వీటితోపాటు ముఖ్యమైన వ్యక్తులు, పుస్తకాలు - రచయితలు, ముఖ్యమైన రోజులు, అవార్డులు, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

	సిండికేట్ బ్యాంక్ పీవో	కెనరా బ్యాంక్ పీవో
పోస్టుల సంఖ్య	500	450
దరఖాస్తుకు చివరితేదీ	17-01-2018	31-01-2018
పరీక్ష తేదీ	18-02-2018	04-03-2018

పరీక్ష విధానం

రెండు బ్యాంకులకు ఆబ్జెక్టివ్ తరహా ఆన్‌లైన్ పరీక్ష ఒకే రకంగా ఉంది. సమయం రెండు గంటలు. సిండికేట్ బ్యాంక్‌కి మాత్రం అరగంట కాలానికి ఇంగ్లిష్ భాషలో డిస్క్రిప్టివ్ పరీక్ష (50 మార్కులకు రెండు ప్రశ్నలు) అదనంగా ఉంది.

సబ్జెక్టు	ప్రశ్నల సంఖ్య	మార్కులు
రీజనింగ్	50	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	50
ఇంగ్లిష్ లాంగ్వేజ్	50	50
జనరల్ అవేర్‌నెస్	50	50
మొత్తం	**200**	**200**

ఎలా సిద్ధమవ్వాలి?

సిండికేట్ బ్యాంక్ పరీక్ష ఫిబ్రవరి 18న, కెనరా బ్యాంక్ పరీక్ష మార్చి 4న జరగనున్నాయి. అందుబాటులో ఉన్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని పరీక్షలోని నాలుగు విభాగాలపై అవగాహన పెంచుకోవాలి. నిర్దిష్ట సమయంలో వీలైనన్ని ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. రోజూ ఒక పూర్తిస్థాయి మోడల్ పేపర్‌ను ప్రాక్టీస్ చేయాలి. అరిథ్‌మెటిక్ అండ్ రీజనింగ్‌లలో ఎక్కువ సంఖ్యలో ప్రశ్నలు వచ్చే టాపిక్స్ ప్రిపరేషన్ ముందుగా పూర్తిచేయాలి. పరీక్షలకున్న ఈ 30 - 40 రోజుల సమయాన్ని ప్రణాళిక ప్రకారం సరిగా ఉపయోగించుకుని ప్రిపేరైతే బ్యాంకు ఉద్యోగం సాధించుకోవచ్చు.